ఏప్రియల్ 2022 సంచిక : 446 వెల : 25/-

ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక



కార్మిక, కర్షక అఖిల భారత సార్వత్రిక సమ్మెకు సంఘీభావం

జనసాహితి ప్రచురణ

కవిత

# యుద్ధం ముగుస్తుంది

- ఎ. మన్మధరావు

**యుద్ధం** ముగుస్తుంది

విరిగిపడిన ఆకాశం
అతుక్కుపోయినట్టు
పొగలుకక్కిన అగ్నిపర్వతం
చల్లారిపోయినట్టు

యుద్ధం ముగిసిపోతుంది....

నెత్తురు
ఏరులై పారిన తర్వాత
శరీరాలు
మాంసపు ముద్దలుగా
మూటగట్టబడిన తర్వాత

యుద్ధం ముగుస్తుంది....

తలలు తెగిన శరీరాలు
ముక్కలైన శవాలు
రేగిన చితిమంటలు
లెక్కతేలని సమాధులు
కళ్ళముందు
కదలాడుతూనే ఉంటాయి

యుద్ధం ముగుస్తుంది.....

నరమేధం
విజయగీతాలు ఆలపిస్తుంది
నెత్తుటి హత్యలు
వీరత్వాలై విర్రవీగుతాయి
అమరత్వం
శోక సముద్రంలో చిక్కి
కన్నీటి చుక్కై కరిగిపోతుంది

యుద్ధం ముగుస్తుంది....

పెట్టెలో వచ్చే
శవం కోసం
పుట్టెడు దుఃఖంతో
కన్నతండ్రి ఎదురుచూపు
గుడ్డల్లో చుట్టబడిన
బిడ్డకోసం
ఘోషిస్తున్న కన్నతల్లి కడుపుకోత

కట్టుకున్నవాడికి కడసారి
భార్య
గుండె పగిలే కన్నీటి వీడ్కోలు

భూమీ ఆకాశం బద్దలయ్యేలా
బిడ్డల అరణ్య రోదన
ఇంటిముందు అలజడి
గుమ్మం ముందర శవం

అక్కడ
ముగిసిన యుద్ధపు
విధ్వంసం సాక్షిగా
ఇక్కడి
విషాద జీవితాలలోన
విలాప యుద్ధం మొదలౌతుంది.....



జనసాహితి ప్రచురణ

45 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

446

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 45

సంచిక : 9

ఏప్రియల్ 2022

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | మార్చి 28, 29 తేదీలలో "సేవ్ పీపుల్–సేవ్ నేషన్" అనే నినాదంతో జరిగిన కార్మిక, కర్షక అఖిల భారత సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా.... | – చిత్రం : అంతర్జాలం నుండి | .....01 |
| ✦ రెండవ అట్ట | : | యుద్ధం ముగుస్తుంది (కవిత) | – ఎ. మన్మధరావు | .....02 |
| ✦ మూడవ అట్ట | : | నేరం, పునరావేశం (కవితలు) | – రవి నన్నపనేని; పి.ఎస్.నాగరాజు | .....43 |
| ✦ నాల్గవ అట్ట | : | రాంపుర్హాత్ (కవిత) | – అనువాదం : కొత్తపల్లి రవిబాబు | .....44 |
| ✦ సంపాదకీయం | : | 'అణ్వస్త్రాలు కాదు – అన్నవస్త్రాలు కావాలి!' | | .....05 |
| ✦ కథ | : | పనిష్మెంటు | – ఓవీవీయస్ | .....07 |
| ✦ వ్యాసాలు | : | తెల్లచీర రక్తంతో ఎరుపెక్కింది | – ఆర్. ఉమామహేశ్వరి | .....14 |
| | : | కథలే మిగిల్చి కరిగిపోయిన రాచకొండకు కలాల నివాళి | – సి. రామ్మోహన్ | .....30 |
| ✦ పుస్తక పరిచయం | : | డిజిటల్ శ్రమ – కార్ల్‌మార్క్స్ | – జి.వి. భద్రం | .....26 |
| ✦ పుస్తక సమీక్ష | : | పేదప్రజల పక్షాన నిలచిన 'తిరుగబడు' కవులు | – కె. కృష్ణమూర్తి | .....10 |
| ✦ సినిమా సమీక్ష | : | 'ది కశ్మీరీ ఫైల్స్' | – బాలాజీ (కోల్‌కతా) | .....22 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | సఫ్దార్ హష్మీ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....29 |
| ✦ కవితలు | : | అంజని బిట్ల (**09**); సహచరి (**13**); కొత్తపల్లి రవిబాబు (**28**); ఏటూరి నాగేంద్రరావు, తమ్మినేని అక్కిరాజు (**34**); సిహెచ్. మధు (**36**) | | |
| ✦ వివిధ | : | ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**21**); సాహిత్య, సాంస్కృతిక సామాజికాంశాలు (**38**) చైతన్యవాహిని (**39**); ఈ పుస్తకాలు అందాయి (**25, 41**) | | |
| ✦ శాశ్వతనిధి | : | చీడిపూడి సాంబిరెడ్డి – వేమమ్మ, చావా నాగేంద్రమ్మ (**04**) | | |
| ✦ సంతాపాలు | : | మల్లు స్వరాజ్యం (**06**); ఐజాజ్ అహ్మద్, సి. గణేశలింగం, కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు (**32**); డప్పు రమేష్, కట్టమంచి అయ్యస్వామి ప్రభావతి, వుమ్మనేని పాపయ్య, డా॥ రాచకొండ అన్నపూర్ణాదేవి, తల్లావఝుల సుందరం (**33**); సి. రామ్మోహన్ (**35**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 9441913829 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# కృతజ్ఞతలు



**చావా** నాగేంద్రమ్మగారు 1942లో జన్మించారు. దీర్ఘకాలం అనారోగ్యంపాలై తన 78వ యేట 2020 ఏప్రియల్ 7న విజయవాడలో మరణించారు.

ఆమె ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదివారు. స్వాతంత్ర్య సమరయోధుడు, హేతువాది ఐన యలమంచిలి వెంకటప్పయ్య (తెనాలి)గారి కుమారుడు మురళీధర్‌తో 1959లో వివాహం జరిగింది. వారికి ఒక కొడుకు శ్రీధర్ – లెక్చరర్‌గా రిటైరయ్యారు. కూతుళ్ళు సుగుణ, శైలజ, సుప్రియలు.

శైలజ టీచరుగా పనిచేశారు. సుప్రియ లెక్చరర్‌గా వెలగపూడి రామకృష్ణ కళాశాల నగరంలో చేసి ప్రస్తుతం బదిలీపై విజయవాడ మేరీస్టెల్లా కళాశాలలో పనిచేస్తున్నారు. సుగుణ 2018 మే నెలలో చనిపోయారు.

నాగేంద్రమ్మగారి భర్త మురళీధర్ మార్క్సిస్టు, భౌతికవాది.

నాగేంద్రమ్మగారి రెండవ వర్ధంతి (ఏప్రియల్ 7, 2022) సందర్భంగా వారిని జ్ఞాపకం చేసుకుంటూ వారి కుటుంబ సభ్యులు ఈ సంచిక ముద్రణకై 25 వేల రూపాయలు విరాళం ఇచ్చారు. వారికి ధన్యవాదాలు. నాగేంద్రమ్మగారికి జోహార్లు. ✦

# చీడిపూడి సాంబిరెడ్డిగారి 6వ వర్ధంతి



**చీడిపూడి** వేమమ్మ, సాంబిరెడ్డిగార్లది ప్రజాసాహితిని అభిమానించే కుటుంబం. వీరిది గుంటూరుజిల్లా నూతక్కి గ్రామం. వేమమ్మగారు 8-12-1999న రోడ్డు ప్రమాదంలో తన 50వ ఏట మరణించగా, 23-4-2016న సాంబిరెడ్డిగారు 75వ ఏట అనారోగ్యంతో మరణించారు. 2003లో రూ. 40వేలు 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి అందించిన వారి కుటుంబసభ్యులు సాంబిరెడ్డిగారి మొదటి వర్ధంతి సందర్భంగా మరొక 25 వేల రూపాయలు అందించారు. చీడిపూడి వేమమ్మ, సాంబిరెడ్డిగార్లను జ్ఞాపకం చేసుకుంటున్నాం. ✦

## సంపాదకీయం

# "అణ్వస్త్రాలు కాదు - అన్నవస్త్రాలు కావాలి"

**'మానవ ప్రాణాలకీ,** మానవీయ విలువలకు తలకొరివి యుద్ధం'.

'ఎక్కడ యుద్ధం జరిగినా, పరిజన సమేతంగా దిగుడుబావుల్లోకి దూకాల్సిందీ, సామూహిక సజీవ దహనాలు కావల్సిందీ, రహస్య చిత్రహింసల పాలు కావల్సిందీ సామాన్య పౌరులే!'

'యుద్ధం ఒక గుండెకోత'.

రాజ్యాలు ఏర్పడిన నాటినుండీ వాటి విస్తరణకై యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. నేడు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఆ రెండు దేశాల మధ్య వుండిన ఏ గొడవల వల్ల, ఏ ప్రయోజనాల కోసం మొదలై సాగుతూంది? ఆ రెండు దేశాల ప్రజలకు, ప్రపంచంలోని ప్రజలందరికీ యుద్ధం వల్ల చేకూరే ప్రయోజనాలు ఏంటి? అమెరికా ఏర్పాటు చేసుకున్న యుద్ధ కూటమి నాటోలో ఉక్రెయిన్ ఎందుకు చేరాలనుకుంది? తూర్పు యూరప్ దేశాలు సోవియట్ యూనియన్ చొరవతో నాటో కూటమి నుండి రక్షణకు ఏర్పాటు చేసుకున్న వార్సా కూటమిని 1991 తర్వాత రద్దు చేసుకున్నా, అమెరికా నాటోను ఎందుకు కొనసాగిస్తోంది. పాలస్తీనా మీద ఇజ్రాయెల్ యుద్ధాన్ని గడిచిన 75 ఏళ్ళుగా ఏ ఆధిపత్యశక్తుల ప్రయోజనాల కోసం కొనసాగిస్తూనే వుంది? యుద్ధగాయాలను, దుష్ఫలితాలను అనుభవిస్తూంది ఎవరు?

'రణరంగం కానిచోటు – భూస్థలమంతా వెదకిన దొరకదు'

వేల సంవత్సరాలుగా గతచరిత్రలో జరిగిన మానవసంహారం కంటే మొదటి, రెండవ ప్రపంచయుద్ధాలలో మరణించిన, క్షతగాత్రులైన వారి సంఖ్య అనేక పదుల రెట్లు ఎక్కువ. ఒక్క రెండవ ప్రపంచ యుద్ధంలోనే ఐదు కోట్లమంది సైనికులు, సాధారణ పౌరులు మరణించారు. సామ్రాజ్యవాదమంటేనే యుద్ధం. సామ్రాజ్యవాదం తన మార్కెట్ల పోటీకై అందులో మరీ ముఖ్యంగా ఆయుధాల పోటీకై యుద్ధాలు చేయకతప్పని సంక్షుభిత దశకు చేరుకుంది. అందుకే రెండవ ప్రపంచ యుద్ధానంతరం నుండి నేటివరకు అమెరికా యుద్ధోన్మాద విధానాలకు దేశాలకు దేశాలే బలైనాయి.

మార్కెట్ల కోసం పోటీలు, యుద్ధాలుగా పరిణమించాయి. పెట్టుబడిదారీరాజ్యాలు సామ్రాజ్యవాదరాజ్యాలుగా ఆవిర్భవించాయి. వలస సామ్రాజ్యవాదాలు ఏర్పడ్డాయి. అవి ఇప్పుడు పరోక్ష వలసలయ్యాయి. ప్రపంచపటం మీద మార్కెట్ల కోసం, వాటి విస్తరణ కోసం దేశాల మధ్య యుద్ధాలు జరగని రోజులేదు. సహజవనరుల కోసం, చౌక కూలీల కోసం, విశాల మార్కెట్ల కోసం పోటీపడుతూ సామ్రాజ్యవాద దేశాలు యుద్ధోన్మాద ప్రదర్శనకు పూనుకుంటున్నాయి.

ఈ అగ్రరాజ్యాల మార్కెట్ ఎకానమీ అతి పెద్ద దాహం ముందు – మనుషుల మానప్రాణాలు, మానవీయ విలువలు, దయ, కరుణ, స్నేహం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ, సమానత్వం, శాంతి అన్నీ తృణప్రాయమే. తమ స్వార్థపూరిత ప్రయోజనాలకి ఇవన్నీ సమిధలే.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కొరియా నుండి కొసావో వరకు, వియత్నాం నుండి ఇరాక్ మీదుగా ఆఫ్ఘన్ వరకు సుమారు 80 లక్షలమందిని అమెరికా రక్తదాహం పొట్టన పెట్టుకుంది. తమ స్వీయ తప్పిదాలతో 1991లో సోవియట్ యూనియన్ చెల్లాచెదురైనది. రష్యా సామ్రాజ్యవాద దేశంగా మారి తన గొడుగు కిందకు తూర్పు యూరప్ దేశాలను చేర్చుకోవాలనే దురాక్రమణ కాంక్షని ప్రపంచమంతా గమనిస్తూనే వుంది. ఈనాడు ఉక్రెయిన్ దేశం పైకి రష్యా విరుచుకుపడి యుద్ధ బీభత్సాన్ని సృష్టించడానికి అగ్రరాజ్యాల యుద్ధకాంక్ష వెనుక ఉన్న తక్షణ పరిస్థితులను పరిశీలించాలి.

తాత్కాలికంగా బలహీనపడిన రష్యా కాలక్రమంలో తన ఆయుధ సంపత్తిని పెంచుకుని ఏక ధృవ ప్రపంచంగా పెత్తనం చెలాయిస్తున్న అమెరికాతో పోటీకి రాసాగింది. ఈ అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాల పోటీలో పశ్చిమ, తూర్పు యూరప్ దేశాల ప్రజలు ప్రస్తుతం చిక్కుబడి వున్నారు.

యూరప్ నుండి రష్యాలోకి ప్రవేశించడానికి ఉక్రెయిన్ సింహద్వారం లాంటిది. అందుకని అమెరికా చాలా కాలంగా ప్రయత్నిస్తూ రష్యా అనుకూల ఉక్రెయిన్ ప్రభుత్వాన్ని దించి, తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని గద్దెనెక్కించింది. ఆవిధంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా చెప్పుచేతల్లోనే వుంటున్నాడు. ఈ క్రమంలో అమెరికా ఆయుధాలకు ఉక్రెయిన్‌లో చోటు ఇవ్వడం, అమెరికా అనుకూల యూరప్ దేశాల కూటమి అయిన నాటోలో చేరడానికి ప్రయత్నించటం యుద్ధ ప్రజ్వలనకు ఆజ్యం పోసినట్లయింది. జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపట్ల సానుకూలత లేనప్పటికీ అమెరికా ఆధిపత్యానికి తలవంచక తప్పలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా తన ఆంతరంగిక భద్రత దృష్ట్యా – ఉక్రెయిన్ పొలిమేరలో సైనిక విన్యాసాలు చేసింది. దాంతో అమెరికా మరొక్క అడుగు ముందుకు వేసి, ఉక్రెయిన్‌ని తన పావుగా మార్చుకుని రష్యా మీదకి యుద్ధానికి ఉసిగొల్పింది. ఉక్రెయిన్‌ని అమెరికా తన ఆయుధ స్థావరంగా చేసుకొని రష్యా మీద సైనిక ఒత్తిడిని పెంచుతుంది. ఈ కారణంగా ఉక్రెయిన్‌ని నాటో కూటమిలో చేరనీయకుండా చూడాల్సిన ఒత్తిడికి రష్యా గురైంది.

రష్యా ఇలా అంటోంది – ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ చేయదు. అయితే మా చుట్టూ సైనిక స్థావరాలను అంగీకరించము. 'నాటో' కూటమి దేశాలపై మరే ఇతరదేశం సైనికదాడికి దిగినా, అమెరికాపై సైనికదాడితో సమానంగా భావించి నేరుగా జోక్యం చేసుకొనే ప్రపంచగూండాగా అమెరికా వ్యవహరిస్తూ ఉక్రెయిన్‌ని నాటోలో చేరడానికి ప్రోత్సహిస్తోంది.

అంటే ప్రపంచ ఆధిపత్యం కోసం జరిగే సామ్రాజ్యవాద అగ్రరాజ్యాల కుమ్ములాటలో భాగమే – ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం అని స్పష్టంగా అర్థమవుతోంది.

గత రెండు సంవత్సరాలుగా కరోనా మృత్యుగహ్వరంలో పడి చావుబతుకులమధ్య కొట్టుమిట్టాడిన ప్రపంచ ప్రజలకు ఈ ఉక్రెయిన్ యుద్ధం గాయాలమీద వాతలా పెను ఆందోళనను కల్గిస్తోంది. అగ్రరాజ్యాల ఆయుధసంపత్తి, ముఖ్యంగా అణ్వాయుధనిక్షేపాలు, హిరోషిమా, నాగసాకి అనుభవాలతో ప్రపంచప్రజల్ని గడగడ వణికిస్తున్నాయి.

ఐక్యరాజ్యసమితిలో రష్యా ఉక్రెయిన్‌పై సాగిస్తున్న యుద్ధాన్ని ఖండించకుండా మిన్నకుండిన దేశాలలో చైనాతోపాటు భారత పాకిస్తాన్‌లు కూడా ఉండటం ప్రపంచ ఆధిపత్యశక్తులైన అమెరికా రష్యాల బలాబలాల తూకంలో మార్పును సూచిస్తుంది.

ఉక్రెయిన్‌లాంటి చిన్నదేశంలో ఇరవైవేలమంది వైద్య విద్యార్థులు మన దేశం నుండి చదువుకోవటానికి వెళ్ళటం, మన దేశంలో ఉన్నత విద్య గడించటానికి అవకాశాల లేమిని కళ్ళకు కట్టినట్లుగా సూచిస్తుంది.

ఆధిపత్య యుద్ధాల, డాలర్ మార్కెట్ యుద్ధాల, ఆర్థిక విస్తరణవాద యుద్ధాల లోతుపాతులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రపంచంలోని సహజవనరులను శ్రమ సంపదలను కొల్లగొడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అగ్రరాజ్యాల, మరీ ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద కాంక్షను ధిక్కరిస్తూ, ప్రతిఘటిస్తూ అశేష ప్రజానీకం చేయవలసిన ప్రజాయుద్ధంలో రచయితలంగా, కళాకారులంగా మన పాత్ర నిర్వహించటానికి పూనిక వహించాలి. యుద్ధాలు లేని సమాజాన్ని సాధించాలి. యుద్ధాలకు మూలమైన సామ్రాజ్యవాదం నశించాలి. 'అణ్వస్త్రాలు కాదు – అన్నవస్త్రాలు కావాలి; యుద్ధాలు కాదు – శాంతి కావాలి'.

**29-3-2022** ✦

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటనేత మల్లు స్వరాజ్యంకు జోహార్లు



**తన** 13వ యేటనే తుపాకి చేతబట్టి నిజాం వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న మల్లు స్వరాజ్యం తన 91వ యేట హైదరాబాదులో 19-3-2022న మరణించారు. వారు 1931లో సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి మండలంలోని కొత్తగూడ (కరివిరాల)లో జన్మించారు. 1945-46లలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వారు క్రియాశీలంగా పాల్గొన్నారు.

భూస్వామ్య కుటుంబమే ఐనా 1945-46లలో సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తల్లిదండ్రులు, తోబుట్టువులతోపాటు స్వరాజ్యమూ 12 ఏళ్ళ వయసునుండే పాల్గొన్నారు. మాక్సింగోర్కీ 'అమ్మ' నవల స్ఫూర్తిని నింపితే, ఆనాటి భూస్వామ్య వ్యవస్థ క్రూరత్వం, శ్రామిక ప్రజలపై సాగిస్తున్న దోపిడీ పీడనలు ఆమెను దళాల్లోకి నడిపించాయి. తమ భూముల్లో తామే బానిసలుగా బ్రతకాల్సి వచ్చిన పేద ప్రజలు – పుట్టినా, గిట్టినా, పెళ్ళైనా, పేరంటమైనా హైదరాబాద్ నిజాంకు పన్నులు కట్టాల్సి వచ్చేది. రజాకార్లు నిజాం ప్రభువులకు తోడై ప్రజల జీవనాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్న రోజుల్లో 'ఆంధ్ర మహాసభ' ప్రజల్ని చైతన్యపరచి సంఘటితం చేస్తున్నది. మల్లు స్వరాజ్యం ఆ పోరాటంలో పాల్గొంటూ పాటలు పాడుతూ, ఉపన్యాసాలిస్తూ ప్రజల్ని చైతన్యపరచారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలు కలసి నిర్వహించిన పాఠశాలలు, శిక్షణా తరగతులలో పాల్గొన్నారు. దళంలో పనిచేస్తూ స్త్రీలను ఉద్యమాలలోకి సమీకరించారు. తెలంగాణ సాయుధ పోరాటం విరమణ తర్వాత ఆమె రెండుసార్లు శాసనసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఆమె దళంలో వున్నా, శాసనసభ్యులుగా ఉన్నా ప్రజల మధ్యే, ప్రజాసమస్యల పరిష్కార కర్తవ్యంతోనే కొనసాగారు. కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలకు కట్టుబడి చివరిశ్వాస వరకూ నిబద్ధతతో జీవించారు. 'నా గొంతే తుపాకి తూటా' అన్న తన స్వీయ చరిత్రలో "ఏనాడు కూలి వాడలో జొరబడ్డానో అవే నా ఉద్యమ జన్మస్థానాలు. ఆ ఉద్యమాలే నా ఉపన్యాసాలకు విషయం సమకూర్చాయి. నా పాటకు బాణీలిచ్చాయి. నా జీవితానికి ఓ చరిత్రనిచ్చాయి' అని సగర్వంగా ప్రకటించుకున్నారు. 91 ఏళ్ళ జీవితంలో 80 ఏళ్ళపాటు సమాజ మార్పుకోసం పేద ప్రజల పక్షాన జీవించిన స్వరాజ్యంకు 'జనసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. ✦

# పనిష్మెంటు

**– ఓవీవీయస్**

**అరగంట** కావొస్తుంది ఆ అబ్బాయిలిద్దరూ మోకాళ్ళదండవేసి. ఆఫీసు రూము లోపల హెడ్మాస్టారు కూర్చొని ఏదో పని చేసుకుంటున్నారు. ఆయన కుర్చీ పక్కనున్న కిటికీలోంచి చూస్తే కనిపించే విధంగా బయట ఆ యిద్దరినీ మోకాళ్ళదండ వేయించాడాయన. కంచిపాటి వెంకటేషు, గదిరెడ్డి దుర్గాప్రసాదూ అనే ఆ యిద్దరూ పదోతరగతి విద్యార్థులు. లంచవర్ తర్వాత లెక్కలు మేడమ్‌గారు తెలుగు సార్‌ని రిక్వెస్టు చేసి, స్కూలు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పీరియడ్ ఎగ్గొట్టి, క్లాసులో నిద్రపోతున్నారని వాళ్ళిద్దరి పైనా అభియోగం.

కరోనా మూడోవిడత కూడా పూర్తి చేసుకుని నెమ్మదిస్తున్న రోజులు. నాడు-నేడు తొలివిడతలోనే పూర్తి చేసుకుని ముస్తాబైన గవర్నమెంటు హైస్కూలది. తూర్పున మెయిన్ గేటు నుంచి, పడమర దాదాపు రెండొందల మీటర్ల దూరంలోనున్న మరుగుదొడ్ల వరకు..., గ్రానైట్ రాళ్ళతో తరగతి గదులనూ, సిరామిక్ టైల్స్‌తో వరండాలను, పార్కింగ్ టైల్స్‌తో కాలిబాటలనూ తీర్చిదిద్దారు. ఈ ముస్తాబులు సరేగాని మా పాఠశాలకు అదనంగా టీచర్లనివ్వండని కమిటీవారు స్వయంగా వెళ్ళి దరఖాస్తునిచ్చి కోరినా, సాధ్యంకాదని డీయీవోగారు చెప్పినట్టు భోగట్టా.

మిత్రుడొకడు వీళ్ళను చూసి వెక్కిరింతగా నవ్వుతూ, వీళ్ళవైపు రెండు హవాయి చెప్పులను విసిరాడు, క్రికెట్ మ్యాచ్‌లో క్యాచ్ పట్టినట్టు హెడ్మాస్టారికి కనిపించకుండా వాటిని పట్టుకుని నొప్పెట్టకుండా మోకాలి చిప్పలకింద పెట్టుకున్నారిద్దరూ.

'ఏదవా.... నీవాల్లే దొరికేసినాం.... అంటూ' వెంకటేషుని తిట్టాడు దుర్గాప్రసాద్, హెడ్మాస్టారికి వినబడకుండా....

'మెళ్ళిరిసే గల్సు..... నీ బ్యాగ్‌నే మేడమ్‌గారికి కనిపించీలాగెట్టీ దాని మీదన కాలేస్సి తొంగుండిపోనావ్. కనిపించిపోదేటి?!' అంటూ జవాబిచ్చాడు వెంకటేష్.

'నేను బ్యాగు మీద కాలేసినా కిటికీలోంచవుపడదు. నువ్వే డెస్కు పక్కన కాళ్ళు చాపేసి వొంటి మీన తెలివి లేకుండ పడుకుండిపోనావ్. మేడమ్‌గారు చూస్సేరు..' అంటూ మళ్ళీ అందుకున్నాడు ప్రసాద్.

వీళ్ళ సంవాదం పైకి వినబడగానే, లోపల్నుంచి హెడ్మాస్టారు...., 'మోకాళ్ళు వేయించినా బుద్ధిరాలేదురా మీకు?! పోరంబోకు వెధవల్లారా!!.... ఉండండి. మీయమ్మాబాబులికి కబుర్లెట్టేను కదా. వాళ్ళు రానీయండి. పంచాయితీపెట్టి తేల్చేస్తాను మీ సంగతి....' అంటూ కేకలు వేయగానే సైలెంటైపోయారు మళ్ళీ.




ఇంతకీ వీళ్ళు చేసిన తప్పేమిటంటే,.... ఆరోజు మధ్యాహ్నం లంచవర్ తర్వాత ఎక్స్‌ట్రా లెక్కల పీరియడ్ గ్రౌండ్లో జరుగుతుంటే.. ఎగ్గొట్టి, క్లాసురూమ్‌లో ఎవరికీ కనిపించకుండా డెస్కుల మధ్య ఖాళీ చేసుకుని పడుకుని నిద్రపోవడం. పీరియడ్ మధ్యలో ఏదో పనిపై వీళ్ళ క్లాసు మీదుగా వెళుతున్న లెక్కల మేడంగారికి ఖాళీ క్లాసురూమ్‌లో డెస్కుల మధ్య పడుకున్న వీళ్ళు కనిపించడం, ఆమె గబగబా వెళ్ళి హెడ్మాస్టారికి కంప్లయింట్ చేయడం, ఆయన చకచకా వచ్చి...., అక్కడోవైపు కష్టపడి మేడమ్ క్లాస్ చెబుతుంటే ఇక్కడ మీరు దున్నపోతుల్లాగ నిద్రపోవడమేంటని ప్రశ్నించడం.... బలవంతంగా తెలిపోయిన నిద్రలోంచి వీళ్ళిద్దరూ గుడ్లు తేలేసి, ముఖాలు వేలాడేసి మిన్నకుండిపోవడం.... ఇవన్నీ ఇంజను వెనుక రైలు పెట్టెల్లాగ వరుసగా జరిగిపోయాయి.

మామూలుగానైతే హెడ్మాస్టారు అదే పోనీలే అని ఒదిలేసేవారే. కానీ లెక్కల మేడమ్ అలా వదలనిచ్చే రకం కాదు. బోధన కన్న దండనతోనే పిల్లలు బాగుపడతారనీ, అసలు దండన సరిగా లేకపోతున్న కారణంగానే పిల్లలిలా పాడైపోతున్నారనీ ఆమెగారి సిద్ధాంతం. తానేమీ మెతక కాదనీ, దండన విషయంలో తానేమీ వెనకబడలేదని లెక్కల మేడంగారికి అర్థమవ్వాలని తాపత్రయపడిన హెడ్మాస్టారు, పిల్లల చేత మోకాళ్ళదండ వేయించేసి, తల్లిదండ్రులకు కబుర్లు పెట్టేశాడు.

'మేస్టర్లందరూ స్టాఫ్‌రూములోనుంటే ఈయమ్మ మాత్రం అన్ని రూములూ గుడ్లగూబలాగ తిరుక్కుంటూ చూస్తంటాదిరా బాబూ....' మెల్లిగా గొణిగారు ప్రసాదు, లెక్కల మేడం వీళ్ళని కొరకొరా చూస్తూ హెడ్మాస్టారి రూములోంచి స్టాఫ్‌రూమ్‌వైపు వెళ్ళిపోవడాన్ని చూసి.

'ఆ డ్రిల్లు మేస్టరైతే ఇంకొన్రాబాబూ.... ఈయమ్మకి తాతలాటోడు. ఆయాల కమిటీ ఎలచ్చన్లప్పుడు యేటి సెప్పినార్రా?!.... యూనీఫారాలేసుకోని బడికొచ్చాయాల.... పాతయ్యైనా పర్లేదన్నారా, లేదా?!....' ప్రసాదు తల ఊపేవరకు ఒక్క క్షణం ఆపి, 'అసెంబ్లీలో మాత్రం జేవీకే కిట్లోని కొత్త యూనీఫారమ్ ఇంకా కుట్టించడంలేదని రోజుకొ రేవెట్టేస్తాడ్రా!!.. టైలరు బేగివ్వకపోతే నేనేటిసేసీది!!..' బాధ వెళ్ళగక్కాడు వెంకటేసు. అక్కడితో ఆగకుండా, 'నీకు యేసుగాడి సంగతి తెలుసునా, ఆడు నైన్తు సివర్లో సెన్నైపోనాడు. ఆళ్ళమ్మానాన్నా, వొస్తే ఆల్తోపాటు ఆడూ వొస్తాడు మరి. అల్లురాకండా ఆడొక్కడూ ఎలగొస్తాడ్రా?.... యిన్నిరోజులూ బడి మానీసినాడనీసి, యేసాలు నావైపోతన్నాయనీసి,.... సైడు కటింగు వొంపెట్టి సిదగరేవెట్టీనాడ్రా డ్రిల్లు మేస్టు.

దెబ్బకి యేసుగోడు యేకంగ బడే మానేసిన్డు తెలుసునా....'

లెక్కల మేడమ్మే కాదు డ్రిల్లు మేస్టరూ తక్కువైనోడు కాదురా బాబూ అన్నట్టు చెప్పాడు వెంకటేషు.

'మా నాన్న తిమిరాం సంతకెల్లిపోనాడు. లాంగ్‌బెల్లు కొట్టీలోగా వొస్తాడో, రాడో.... అంతా మా నాన్న వొల్లనే వొచ్చింది..' విసుగ్గా అన్నాడు ప్రసాదు.

'మీ నాన్నేటి చేసేడ్రా....' వెంకటేషు అడిగేడు.

'రేపు తెల్లారే తిమిరాం సంతకెల్లాల.... కండిపల్లెల్లి సొమ్ములు చూసొద్దారి.... సైకిలట్టుకోని నాతోట్రారా.... అనీసి బయల్దేరదీసినాడు నిన్న బణ్నుంచి యింటికెల్లేక. రెండు కల్లాలు తిప్పినాడు. బేరాలు చూసినాడు. మనూరొచ్చీదార్లో సైకిలట్టుకోని నన్నుండమన్నడు. కమీషను డబ్బులెంతొచ్చినాయో తెల్దుగానీ,.... ఫుల్లుగ తాగీసొచ్చీనాడ్రా..... మనూరొచ్చీదార్లోనే ఇంకో కల్లంకెల్లి.... ఇంకో గేదిని చూసినాం. ఇకనక్కడ్నుంచి మొదలెట్టేసినాడ్రా పేలాపన. నాను తొక్కుతాన్నారా... సైకిలివ్వంటే ఇవ్వడు.... ఆదు తొక్కడు. కండిపల్లి కల్లాలకాడే టీవీల సూర్యకాంతం సీరియలొచ్చీసింది. ఏరాతిరో యింటికొచ్చేము.... ఇంటికొచ్చీసేక మళ్లీ పేలాపన మొదలెట్టినాడు మాయమ్మని సూడగానే. ఎప్పుడు పడుకున్నానో నాకే తెల్దురా.... మజ్జానం లంచ్‌బ్రేకప్పుడు తెగ నిద్రూపేసీది తెలుసునా.' అంటూ తన నిద్రకు కారణాన్ని మిత్రునితో పంచుకుని, 'మరి నువ్వెందుకు పడుకుండిపోనావ్‌రా..' అంటూ ఆరా తీసాడు ప్రసాద్.

'నిన్న రాత్తిరి మా ప్రెసిడెంటు మాయ్య కోళ్ళఫారంకి లిఫ్టింగులారీ వొచ్చిందిరా. మాయ్య ఫోన్ చేస్తే రాత్తిరి పదిగంటలకే ఫారం కాడికెల్లిపోనాం. సూత్తే లారీయేమో పదకొండున్నరకొచ్చింది. మా జట్టుగాల్లోన యిద్దరు భవానీ మాల్లేస్సినారు. నలుగురిమే మిగిల్నాం. ఆ యద్దరాత్తిరి నుంచీ తెల్లారగట్ట నాలుగ్గంటల్దాకా లారీలోకి కోళ్ళు లిఫ్టింగే లిఫ్టింగురా..... జబ్బలు జివజివలాడీసేయి.

'కోళ్ళు లారీలోకి ఎలగెక్కించుతార్రా?!.. బుట్టల్లో యేసి మోస్తారా.... పెట్టిలాటీ ఉంటాయా?!....' మధ్యలో అద్భుతగుల్తూ అడిగాడు ప్రసాదు.

కమెడియన్‌ని చూసి హీరో నవ్వేనవ్వొకటి నవ్వి.... 'తట్టలు మొయ్యడాలు, బుట్టలు మొయ్యడాలూ ఉండవ్వైస్.... కోళ్ళని వొట్టుకోని లారీ తొట్టిలోకి డైరెట్టుగ యిసీరీడమే.' జవాబిచ్చాడు వెంకటేషు.

'మరలగ యిసురుతుంటే కోల్లు పొడిసీ వేట్రా?!....' సందేహం వెలిబుచ్చాడు ప్రసాదు.

'పొద్దమొకటే కాదురాబాబూ.... తెగ రక్కేస్తాయి కూడాని. అందుకే నేను మానాన్న చొక్కా యేసుకుంటాను లిఫ్టింగప్పుడు. ఐనా బోల్టు రక్కులు యింగో....' అంటూ రెండు మోచేతులపైనా రక్కుల్ని చూపించాడు.

ఇలా వాళ్ళు మాట్లాడుకుంటూ ఉండగానే వెంకటేషు వాళ్ళమ్మ మెల్లగా వీళ్ళ దగ్గర కొచ్చింది. ప్రసాదు సైగ చేయడంతో కొంచెం వెనక్కి తిరిగి అమ్మని చూశాడు వెంకటేషు. క్షణంపాటు వాడి కళ్ళు మెరిసినా, మోకాళ్ళ మీద తల్లికి కనిపించాననే అవమానమో యేమో తలదించేసుకున్నాడు.

'గడ్డిబుంగ బాడవా మెరకలోనొగ్గీసి పారొచ్చినాను. యేటి సేసినావురా....' జుట్టును వెనక్కి మడిచి ముడివేస్తూ కొడుకునడిగిందావిడ.

కొడుకు వైపు నుంచి ఏ సమాధానమూ లేకపోవడంతో – 'మట్టి బుక్కడం లాగ ఉలకవేమి?..' అంటూ హెడ్మాస్టారి రూములోకి తొంగి చూస్తూ లోనికి వెళ్ళిందామె.

'యేదో ఒకటి పీకల మీదకి తేకండ ఉండవేట్రా..' అని కొడుకును దూరం నించే తిట్టుకుంటూ వచ్చాడు ప్రసాద్ వాళ్ళ నాన్న. పంట్లాం మీదకి మడిచిన లుంగీని కిందకు వదిలి. సరిగ్గా సర్దుకొని ఆయన కూడా హెడ్మాస్టారి రూములోకి వెళ్ళాడు.

పెద్దవాళ్ళు రాగానే దుర్గాప్రసాదునీ, వెంకటేషునీ లోనికి పిలిచారు. వీళ్ళిద్దరూ లోనికెళ్ళి తలదించుకుని దండలు కట్టుకు నిలబడ్డారు.

'యేటిచేసినాడండి సార్ మావోడు?!..' అడిగాడు దుర్గాప్రసాద్ నాన్న.

'నాయుడుగారూ! మరి వీళ్ళు రాత్రంతా ఏం చేస్తున్నారో మాకు తెలియదుగానీ, పగలు మాత్రం బళ్ళోనే నిద్రపోతున్నారండీ. ఓపక్క క్లాసులవుతుంటే ఎగ్గొట్టి మరీ నిద్రపోతున్నారు. చెప్పుకుంటే సిగ్గుచేటు బల్లల మధ్య దూరి పడుకుంటారండీ, ఎవరైనాను?!...' అంటూ ఆగాడాయన.

ఏమిరా?! అన్నట్టు చూశారు పెద్దలు పిల్లలవైపు.

"మందుగానేస్సి తొంగుండిపోనావేట్రా.... వొల్లుగానేటి కొవ్వెక్కిపోనాదా...." ప్రసాద్ నాన్న అంటే....

"ఒక్కేసి పాటాలవుతుంటే నువ్వొల్లక తొంగోడమేట్రా?!"..... అంది వెంకటేషు అమ్మ.

'బళ్లోకొచ్చీది సదుకోడానికా.. తొంగుండి పోనానికా.... పీకమీద కాలేసి తొక్కీగల్ను నా కొడకా....' అంటూ మీదికెళ్ళి ప్రసాద్‌ని కొట్టబోయాడు వాళ్ళ నాన్న.

వెంకటేషు వాళ్ళమ్మ అందుకుంటూ..., 'రెక్కలు ముక్కలు చేస్సికోని బతకతన్నం బావూ.... ఇంగో ఇప్పుడూ గడ్డి కోసం ఊరాతల బాడవా సివార్లంట పోనాను. రాత్తుర్లు యింటికాడ తిన్నంగ ఉండమంటె ఉండడు గుంటడు. అంగా జట్లు.. జట్లు. ఆ జట్లట్టీసి తిరక్కురా.. అంటే ఇన్డు. ఆ దిక్కుమాలిన కోల్లుఫారాలెమ్మట ఎల్లకరా అంటే యిన్డు.'

అప్పటిదాకా తలదించుకుని ఉన్న వెంకటేషు ఆశ్చర్యంగా తల్లికేసి చూశాడు. లిఫ్టింగుకి వెళ్ళొద్దని తల్లి ఎప్పుడూ చెప్పలేదు. మరిప్పుడు ఇలా అంటుందేంటి?....

వెంకటేషు ఆశ్చర్యం అక్కడున్న మిగిలినవారికి అర్థంకాలేదుగానీ, తల్లికి అర్థమైంది. ఐనా అదేమీ పట్టించుకోకుండా ఆమె తన ధోరణిని కొనసాగిస్తూ....

'అర్ధరాత్రప్పుడూ, అపరాత్తిరప్పుడూ కోల్లఫారాలెంట తిరగడమేట్రా.... ఆల్లిచ్చీ వొందా పందా మనకెందుకూ?!.... అసలకే కోడిగత్తరకి పాములాటీ మసుల్తాయి. ఇసప్పురుగులు కుట్టిస్తే మనమెక్కడ పరుగులు తీస్తాము.... అనీసి నెత్తీనోరూ బాదుకోని ఎంత సెప్పుతున్నా యినకుంటండు....' అని చెప్పుకు పోసాగింది.

వెంకటేషుకి అంతా అయోమయంగా ఉంది. ఉక్రోషంగా కూడా ఉంది. "కోళ్ళఫారంకి లిఫ్టింగు లారీ ఎప్పుడు వచ్చినా అమ్మకి చెప్పే వెళతాను కదా!.... ఆళ్ళిచ్చిన బిరియానీ అక్కడే తినీసినా, కూలిడబ్బులూ, కోడీ

యింటికి తెచ్చి అమ్మకే ఇచ్చేస్తాను కదా!.... మాయ్య ఎప్పుడు ఫోనుచేసి మాయల్లుడిని పంపక్కా అంటే వొద్దని అనలేదే?!.... ఆయాల బాప్పుతోటి తగువాడిన్నాడు "ఆదు తెచ్చీ దబ్బుల్తోటే వోరం వోరం కరుసెల్లిపోతంది. ఆదు న్యాపోతే యేటైపోదుం" అని కూడా అంది. మరిప్పుడేటి యిలగ మాటాడతంది?!.... ఆశ్చర్యంగా తల్లినే చూడసాగాడు వాడు.

వాడి చూపుల్లో భావం ఆమెకర్థమైన విషయం వాడికి తెలియకుండా ముఖం తిప్పేసుకుని "ఈ వొక్క తప్పు కాయండి మారాజా...." అంటూ ప్రాధేయపడసాగింది.

ప్రసాదు వాళ్ళ నాన్న కూడా "మళ్ళీ ఇలగవ్వకుండా మావుఁ చూసుకుంటం సారూ!.... ఈ వొక్కపాలికీ వొగ్గేయండి" అంటూ బ్రతిమలాడాడు.

'అసలే పదోక్లాసు. మేమేమో సిలబస్ కవర్ చేసుకుంటూ పోతుంటాం. నైన్టీనైన్ పర్సంట్ ఈసారి కరోనా పాసులు ఉండవు. పిల్లల మీద అభిమానమే లేకపోతే మీకసలు కబురే పెట్టేవాడిని కాదు. శ్రద్ధగా చదూకుంటే బాగుపడతారు. లేకపోతే పోతారు. వాళ్ళేదో బాగుపడ్డారని మాకెవరూ కిరీటాలు పెట్టరు, ఫెయిలైపోతే పీకి పారేయరు. శ్రద్ధగా చదూకుంటే వాళ్ళే బాగుపడతారు. లేకుంటే వాళ్ళే పోతారు. ఎవరి ఖర్మకెవరు బాధ్యులు.... అంటూ పైథాగరస్ సిద్ధాంతం వివరించినట్టు పరిస్థితిని వివరించి, ఖర్మ సిద్ధాంతంలోకి ముక్తాయించి పంచాయితీ ముగించారు హెడ్మాస్టారు. ✦

కవిత

# 'మీరు మేం మనమయే దెపుడు'

– అంజని బిట్ల

టోపీవాలా
చాయ్ వాలా
'గడ్డం' వాలా 'క్రాస్' వాలా
నామాల వాలా
ఇంకెన్నో వలల వేటగాళ్ళల్లారా
నాకసలే అర్థం ఐతలే
పార్లమెంటరీ పాథ్ లనే
'సోషలిజం సాధ్య'మంటిరి
'గరీబీ హటావో'
'సబ్ కే సాథ్ సబ్ కా వికాస్'
ఎన్నెన్ని మాటలు!
అరచేతి స్వర్గాలు!
ఆందర్కీ కంపల్సరీ ఉచిత
పాఠశాల విద్యంటిరి
మీరు పలక సంచితో
కాన్వీ బడికి వోయిన్నాడు
మేం ములుగర్ర గోచీతో
బర్ల గొర్లమందల కాడ
మేమూ సర్కారు బడికి వచ్చేటప్పటికి
మీరు డ్రెస్సూ బెల్టూ బూటుతో
కాన్వెంట్ కార్పొరేట్ స్కూల్లకు
అండ్లేమో ఇంకా బాగున్నదన్పించి
మేమూ ఆడికే వచ్చేటాల్లకు
మీరు గాలిమోటరెక్కి
ఎల్లలెన్నో దాటి ఏరే దేశాలకు
అరె!
ఇట్లైతె మేమూ మీరూ
మన మయ్యేదెపుడబ్బా

నేను ఈతకమ్మ గడ్డిరెమ్మా
తడికల గుడిసెల్లోపల
సాటున పండి వండుకున్నపుడు
నీవు మట్టి గోడా కూనా సాటున

నేనూ గోడకూనల కిందకు చేరేటాల్లకు
నీవు గచ్చు బంగ్లల జేర్తివి
నేనూ మూడు గదుల
సీలింగ్ కప్పుఇంటికి పాకి
పాణం సల్లబడే సమయానికి
నీవు ఏడంతస్తుల మేడల
నగిశీ ఊయలలూగి నవ్వితివి
ఇట్లైతే మనమంతా ఒకటేనా
నిజ్జెంగా మీరంతా అంతరాలు
లేని ఏక్తా తత్వులేనా
సర్వేజనాసుఖినో భవంతు
భావుకులేనా
అన్మానం వస్తాంది మరి
ఎప్పుడన్న ఎక్కడన్నా
ఏకమై మనంగా ఉంటమనే
ఆశ అడుగంటుతున్నది
ఆశ సాకారం కావాలంటే
పోరాటమేదో చేయాలని
ఆలోచన రాజుకుంటున్నది ✦

కామ్రేడ్ మధు మొదటివర్ధంతి సందర్భంగా....

# పేదప్రజల పక్షాన నిలచిన 'తిరుగబడు' కవులు

- కె. కృష్ణమూర్తి

"కామ్రేడ్ మధు అనే సంకేత నామంతో ఆరు దశాబ్దాలపాటు అజ్ఞాత విప్లవ మేధో కృషి సాగించిన మరింగంటి శ్రీనివాసాచార్యులు తన 78వ ఏట 16-04-2021న గుండెపోటుతో విజయవాడలో అమరులయ్యారు. ఆయన 'సాంస్కృతిక విప్లవం - మన కర్తవ్యాలు', 'ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమం - కమ్యూనిస్టులు' ప్రకాశరావు పేరుతో 'విప్లవ కవుల్లో అలీనవాదం - ఒక పరిశీలన' డాక్యుమెంట్లు రాశారు. హైదరాబాదులో నవోదయ సంస్థ కార్యక్రమాల బాధ్యత, 'జీవనాడి' పత్రిక బాధ్యతలు వహించారు. సి.పి.ఐ.(యం-యల్) డాక్యుమెంట్లు అనేకం రూపొందించారు. వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా (ఏప్రియల్ 16) 'తిరగబడు' కవులు పుస్తకంపై ఆయన 'సృజన' 1970 మే సంచికలో కె. కృష్ణమూర్తి పేరుతో రాసిన సమీక్షను ప్రచురిస్తున్నాం."

- సం॥

**ఇది** సమాజ పురోగమనాన్ని అడ్డుకొనే శక్తుల సింహాసనాల క్రింద డైనమెట్లు ప్రేలుతున్న కాలం. పాత సామాజిక శక్తులు గుండెలు పగిలి రక్తం కక్కుతుంటే – నూతనశక్తులు విప్లవజ్వాలల్ని విరజిమ్ము కుంటూ విజృంభిస్తున్న కాలం.

సమాజంలో దోపిడీగర్భం నుండే హింస పుట్టింది. అన్ని కాలాల్లోనూ దోపిడీ శక్తులు హింసను ఒక కళగా అభివృద్ధి పరిచాయి. దీనికి విరుగుడుగానే, దీని నుండే ప్రతిహింస పుట్టింది. హింసను ప్రతిఘటించే క్రమంలో, అది అభివృద్ధి చెందుతూ వచ్చింది.

విశాల జనంపై హింసను రుద్దే అల్పసంఖ్యాకులను, 'అహింసామూర్తులు'గా వారిని ప్రతిఘటించే ప్రజలను 'హింసావాదులు'గా కొందరు చిత్రించడం. అదే సందర్భంలో ప్రజల ప్రతిఘటనను విప్లవపంథాగా, వారిపై సాగే దాడిని విప్లవ ప్రతీఘాతక చర్యగా గుర్తించడం చరిత్ర పుటల్నిండా కనిపిస్తుంది.

ఈ రెండూ భిన్నదృక్పథాలుగా వుండడం,వీటి మధ్య నిర్విరామంగా ఘర్షణ సాగడం, అంతిమంగా ప్రజలపక్షం నెగ్గడం చూస్తాం.

మనదేశంలో, కొన్ని ప్రాంతాల ప్రజలు చేపడుతున్న విప్లవ మార్గాన్ని సమర్థించడానికి సాహితీరంగంలో కొన్ని శక్తులు మనరాష్ట్రంలో గొంతు విప్పుతున్నాయి. జనంలో జ్వలిస్తున్న వీరత్వాన్ని కీర్తించి, వారి విప్లవదంథాకు నైతికపుష్టినిచ్చి ఉత్తేజ పరచడానికి ఈ శక్తులు తమ సృజనాత్మక సాధనాలను సంధిస్తున్నాయి. దీని వెన్వెంటనే ప్రజల విప్లవపంథాను దుయ్యబట్టడానికి, కొత్త గొంతులను నొక్కివేయడానికి కొన్ని కీచుగొంతుకలు రంగంమీదకు వస్తున్నాయి.

ఈ స్థితిలో ప్రజల వైపున వారికొరకు గొంతులువిచ్చే శక్తుల వైపున నిలవడం ప్రగతిశీలుర ప్రాథమిక కర్తవ్యం.

సాహితీరంగంలోని ఈ కొత్త గొంతుకల్లో 'తిరుగబడు' కవులు ఒకరు.

ఇక్కడొక విషయాన్ని గమనించాలి.

ప్రజలకు సంబంధించిన ఒక విప్లవ సిద్ధాంతమూ – ఆ సిద్ధాంతాన్ని అమలు జరపగల నిర్మాణ రూపమూ సామాజిక విప్లవాల విజయానికి కీలకమైనవి. అదేవిధంగా విప్లవ దృక్పథాలనూ, కార్యాచరణలనూ ప్రచారంలో పెట్టి, ప్రజలను వుత్తేజపరచడంలో సాహితీ, సాంస్కృతిక సాధనాలు ముఖ్యపాత్ర వహిస్తాయి. ఈ రెండు రంగాలూ సామాజిక విప్లవాల విజయానికి అత్యవసరమైనవి. ఒకటి కీలకమైనది. రెండవది దానికి సహాయ భూతమైన అత్యవసర సాధనం. ఈ దృష్టితో చూచినప్పుడు 'తిరుగబడు' కవుల కృషికిగల ప్రాధాన్యతను అర్థం చేసుకోగలం. 'తిరుగబడు' కవులు పీడిత ప్రజల కొరకు, వారి విముక్తిని కాంక్షిస్తూ కలం పట్టారన్నది నిర్వివాదాంశం.

సంకలన ప్రవేశికలో యువతరానికి ఇచ్చిన పిలుపులో స్వరాజ్యం, ప్రజాస్వామ్యం, సామాన్యుడు, అతనికి గల స్వాతంత్ర్యం, విద్యావిధానం, రాజ్యాంగం, దోపిడీ, మతం తదితర అంశాల పట్ల వ్యక్తపరచబడిన భావాలన్నీ దేశ విప్లవ ప్రజానీకం యొక్క భావాలకు స్థూలంగా సన్నిహితమైనవి. ప్రవేశికలో 'ప్రజల తిరుగుబాటు తత్త్వాన్ని, వారి గెలుపు అనివార్యతను స్పష్టంగా చూశారు'. 'అరణ్యాల్లో, కొండకోనల్లో, చెట్లల్లో, పొదల్లో కార్చిచ్చులా రాజుకుంటున్న జ్వాలల్ని' చూడడం ద్వారా సమకాలీన పరిస్థితుల పట్ల వాస్తవిక దృక్పథాన్ని ప్రదర్శించారు. విప్లవ జ్వాలల్ని పంచడానికి హస్తాలు చాచడం ద్వారా విప్లవ మార్గం పట్ల స్పష్టంగా commit అయ్యారు.

పీడిత ప్రజల కొరకు రాయబడిన ఈ కవితలు ఈ వర్గాలకు చేరతాయా! అన్న అంశాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉంటుంది. ఈ పరిశీలన వీరికి మాత్రమే పరిమితం కాదు. విప్లవ పోరాటాలను, భావాలను బలపరుస్తూ నేడు వస్తున్న కవితలన్నింటిలోనూ ఒక లక్షణం కనిపిస్తున్నది. అది, ఆ కవితలు, ప్రధానంగా పీడితవర్గాల గురించి

వుంటాయి. సరిగ్గా ఈ వర్గాలకే కవితలు చేరవు. కనీసం సాధారణ రాజకీయ కార్యకర్తలకైనా అవి చేరవు. ఈ కవితలను ప్రజలకు ఎవరో చదివిపెట్టినప్పటికీ, ఆ కవితల్లోని భావాలను అర్థం చేసుకొనడానికి ప్రజల సాధారణ భాషాపరిజ్ఞానం చాలదు. అందితే – అవి ప్రజలకు ఆకర్షణీయమైన రూపంలో (Form) ఉండవు. ఇది నేడు విప్లవ సాహిత్యానికీ – ప్రజలకూ మధ్య నున్న ప్రధాన వైరుధ్యం. ఈ అంశాన్ని ఆత్మ విమర్శనాదృక్పథంతో పరిశీలించడం విప్లవకవుల కర్తవ్యం.

రచనావిధానం(Form) సమస్య ముఖ్యాంశం. వచన కవితా రూపం అత్యంత ప్రజాస్వామిక విధానంగా నేడు ముందుకొచ్చింది. ఐతే – ఈ విధానానికి ప్రజాబాహుళ్యంలో నేడు పునాదులు లేవు. జనంలో, ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లోని పీడితజనంలో పాటలు, బుర్రకథలు, గొల్లసుద్దులు నేటికీ బాగా ప్రచారంలో వున్నవి. గ్రామీణ శ్రమజీవులు, మహిళలు నేటికీ మోటకాడ పాటలు, కోలాటం పాటలు, బతుకమ్మ పాటలు పాడుకొనడం చూస్తాం. ఈ స్థితిలో విప్లవకవులు తాము చెప్పదలుచుకున్న భావాలు విశాల ప్రజానీకానికి చేరాలంటే అందుకు అనుగుణమైన రూపాలను గణనంలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజల స్థాయిని, వారికి బాగా కరతలామలకమైన శైలులను, రూపాలను చేపట్టాల్సి ఉంటుంది. ఈ రూపాల్లోని (popular forms) అశాస్త్రీయఅంశాలను తొలగించి, నూతనరూపాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా మాత్రమే విప్లవసాహిత్యం లోతుగా పీడితవర్గాలలోకి చొచ్చుకొని పోగలుగుతుంది. వచన కవితారూపం చేబట్టిన 'తిరుగుబాటు' కవులు ఈ అంశాన్ని పరిశీలించాలి.

'సాహిత్యం సామాన్యుడికి నేరుగా చేరడం సాధ్యపడదు!' అన్న వాదనలు తరచుగా అభ్యుదయవాదుల నుండి కూడా వింటాం. సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని ప్రజలకందకుండా చరిత్ర నిండా నిర్మించబడిన బారికేడ్లలో ఈ వాదం ఒక ఆధునికరూపం మాత్రమే. కవిత్వానికీ – ప్రజలకూ మధ్య ఒక బ్రిడ్జ్ ఉండాలనడం ప్రజావ్యతిరేకవాదం. నిజానికి ఈ బారికేడ్లను తొలగించుకుని సాహిత్యం ఇదివరకే ప్రజల దగ్గరకు వెళ్ళింది. పొట్ట చీల్చితే అక్షరం ముక్క రాని గ్రామీణ శ్రామిక జనం సృష్టించిన సాహిత్యం సమృద్ధిగా ఉన్నది. వీరు తమ ఆలోచనల్ని నోటికే పాటలుగా అల్లి పాడడం చూస్తాం. ఎక్కడో, ఎప్పుడో విన్న పాటలను పాడుకొనడం చూస్తాం. ఇదంతా ప్రజల్లో ఉన్న సాహిత్య సంపదకు, సాహిత్యాభిలాషకు చిహ్నం కాదా! ఈ అంశాన్ని విప్లవ కవులు పరిశీలించాలి.

నేటి విప్లవ సాహిత్యం యొక్క జనరల్ స్వభావాన్ని ఈ కోణం నుండి పరిశీలిస్తూనే (దీనిలో 'తిరుగబడు' కవులు చేరతారు) 'తిరుగబడు' కవితాసంకలనంలోని కొన్ని కవితల్ని దిగువ పరిశీలిస్తాను.

వరవరరావుగారు 'ఆపరేషన్'లో మధ్యతరగతి వర్గాల బలహీనతలను వారి జీవన పరిస్థితులను చిత్రించడానికి మంచి ప్రయత్నం చేశారు. అయితే "శత్రు శిబిరం లాంటిదాన్ని గర్భాన్ని చీల్చి.. చూడాలనిపిస్తుంది...." అన్న నాల్గు పంక్తులూ భావరాహిత్యాన్ని చూపుతాయి. అదేవిధంగా.... "అటాక్ చేసే సాహసమేదీ?" అనడంలో, మొదటి నాల్గు పంక్తులకూ – ఈ నాల్గు పంక్తులకూ మధ్య గల సంబంధం ఏమిటో, ఈ అటాక్ ఎందుకో అర్థం కాదు. "నిండు బుక్క నోట్లో పెట్టుకోబోతే.... జర్దా కంపు వస్తుంది" అనడం బాగుంది.

'చెయ్యి'లో 'బలసిన కండల్ని కాల్చి – భవిష్యత్తు దీపాల్ని వెలిగించు' అన్న విప్లవాత్మక ప్రబోధం వున్నది.

"పంజా ఎత్తు" బాగున్నది.

లోచన్‌గారి "ట్రిగ్గర్ పై వేళ్లతో" అన్న కవితలు సమాజ వ్యవస్థపై నిశితమైన, సూటైన విమర్శ ఉన్నది. ప్రబోధం ఉన్నది.

"బానిస జాతి"లో 'గడ్డి కరిచి ప్రభువుల ముడ్డి కడిగే జాతి' అన్న దూషణ సరైంది కాదు. పేద వర్గాలు నేటి సామాజిక వ్యవస్థలో బ్రతకాల్సిన పరిస్థితుల్లో సంతరించుకున్న కొన్ని అవలక్షణాల్లో బానిస వృత్తి ఒకటి. వారిని ఓపిగ్గా సరైన మార్గంలోకి తెచ్చుకోవడానికి యత్నించాలి. మొత్తంగా తిట్టడం పరిష్కారం కాదు. ఆ లెక్కన పీడిత వర్గాలు అన్ని దశల్లోనూ పీడక వర్గాల దాస్యం చేస్తూనే వస్తున్నారు. ఒకానొక దశలో తిరుగబడి పీడకులను కూల్చుతున్నారు. అదే సమయంలో పీడక వర్గాల ఏజెంట్లుగా మారి, పోరాటాల్లో కలిసిరాక ప్రజావ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనేవారు కూడా పేద వర్గాల్లో ఉంటారు. వీరు శత్రువర్గాల్లో చేరతారు. ఐతే మొత్తంగా ప్రజల పట్ల వారి లోపాల పట్ల సరిదిద్దే వైఖరి తీసుకోవాల్సిందే గాని శత్రువు వైఖరి కాదు.

అశోక్ గారి "పీడకలలు", "సాధు సర్ప విశ్వాలయాలు" అన్న కవితలు బాగున్నాయి.

"నేల కొరుగుతున్న ధ్వజస్తంభము"లో సంజీవరావు గారు దేవుడి పొత్తికడుపులో, ఆయనకు ప్రాణప్రతిష్ట చేసిన వాడి చేతనే, చురకత్తి దించారు. దేవుడి మానభంగం జరిగిన పద్ధతి సమర్ధవంతంగా ఉన్నది.

"కుక్క బ్రతుకు" అర్థరహితంగా ఉన్నది. కవి ఏం చెప్పదలచు కున్నాడో అర్థం కాదు.

సుధాకర్‌గారి "రౌడీ", "గుడి, బడి, గడీ"లో ఫ్యూడల్ లక్షణాలు చక్కగా చిత్రించారు.

"రాజీ అసంభవం" అన్న యాదగిరిరావుగారి కవిత నిండా పొడి మాటలు కనిపిస్తాయి. "కాగడా", "దీపావళి" బాగున్నాయి.

కిషన్‌గారు "కుళ్ళిన అన్నానికేముంటుంది రుచి"లో – 'నాకన్నా వయసులో చిన్న / నాకన్నా అనుభవంలో చిన్న / నాకన్నా ఆలోచనలో చిన్న' అనడంలో reasoning సరిగా లేదు. పై మూడిట్లో ఏవీ ఒకరి ఆధిక్యతకు నిదర్శనాలు కాజాలవు. శ్రమజీవి ఆధిక్యత సమాజ సంపదల్ని సృష్టించడంలోనూ, యజమాని అల్పత్వం ఆ సంపదలను కాజేయడంలోనూ ఉంటుంది. ఈ contrast చూసి ఉంటే బాగుండేది.

"లేవరేం!" అన్న పిలుపు పీడిత ప్రజలకు ఉద్దేశించబడినది. దీనిలో కిషన్‌గారు 'కోరికల చెరసాలలు' లేని.... విశ్వజనీనతకు" వెళ్దాం అంటున్నారు. కోరికలు చెరసాలలు కావు, అవి పురోగమనానికి సోపానాలు కాగలుగుతాయి. అదేవిధంగా తిరోగమనానికి దారితీస్తాయి. ఐతే – వాటి స్వభావాలను బట్టి ఫలితాలుంటాయి. కిషన్‌గారు చేరుకొనగోరుతున్న లోకంలో కూడా కోరికలుంటాయి. దోపిడీ వర్గాల కోరికలను చెరసాలల్లో బంధించి, పీడిత వర్గాల కోరికలకు రూపకల్పన చేయడమే కిషన్‌గారు కోరుతున్న విప్లవ సమాజ నిర్మాతల లక్ష్యం. విప్లవ పోరాటల్లో ప్రజలు చేసే రక్తతర్పణను, ప్రాణ త్యాగాలను "గత్తర్లతో" కిషన్‌గారు పోల్చారు. ఇది ప్రజల బలిదానాలను కించపరుస్తుంది.

సుదర్శన్‌గారు "కవిత్వం కాదిది" అన్న కవితలో "జడంగా పడి ఉన్న జాతి.... తాటాకు చప్పుళ్ళకి.... మేలుకొన్న 'దురాశ'ని త్రుంచెయ్!" అని యువతరానికి పిలుపునిస్తున్నారు.

నేటి పరిస్థితుల పట్ల బాగా విసిగి, విప్లవ పంథాలో తప్ప మరో మార్గంలో విముక్తి సాధ్యం కాదన్న నిర్ణయానికి వచ్చిన యువతరం, అదే తీవ్రతలో ప్రజలు విప్లవపంథా చేపట్టడం లేదని విసిగి, తిట్టిపోయడం అక్కడక్కడా నేడు చూస్తాం. దీనిలో రెండు లక్షణాలు ఉన్నాయి. 1) ప్రజల విప్లవ స్వభావాన్ని చూడలేకపోవడం. 2) ప్రజల కంటే తామే నిజమైన విప్లవకారులమని చాటుకోజూడ్డం. ఈ రెండూ విప్లవకారుల్లో వుండకూడని లక్షణాలు. సుదర్శన్‌గారి పై కవితలో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

ప్రజల్లో జడత్వం పేర్కొనడానికి కారణం ఆ ప్రజల్లో విప్లవ చేవ లోపించి ఉండటం కాదు. చరిత్ర పొడుగునా పరివర్తనావాదులు, ప్రజల విప్లవచైతన్యం పెరగకుండా చేయడానికి, అది కార్యరూపం తీసుకొనకుండా అదిమి పెట్టడానికి యత్నిస్తున్నా, నిర్బంధాలూ, హింసాకాండ స్వైర విహారం చేసినా ప్రజలు వీటి నెదిర్చి, విప్లవ లక్షణాలను ప్రదర్శించిన సందర్భాలున్నాయి. నేటి దశకు వృద్ధి చెందిన మానవసమాజంలో వివిధ కాలాల్లో, దశల్లో ప్రజలు చేపట్టిన, చేపడ్తున్న పోరాట రూపాలు ఎవరో గదుల్లో కూర్చుని ప్రయోగాలు చేసి గానీ, పుస్తకాలతో తల బ్రద్దలు కొట్టుకొని గానీ రూపొందించినవి కావు. వివిధ దశల్లో ప్రజలు తమ్ము తాము కాపాడుకోవడానికి, శత్రు దాడిని తిప్పి కొట్టడానికి ఆయా పోరాట రూపాలను చేపట్టాల్సిన ఆవశ్యకతను గుర్తించి, చేపట్టారు. ఈ విధంగా ప్రజల పోరాటాల అభివృద్ధి క్రమంలోనే వివిధ పోరాట రూపాలు పుట్టి అభివృద్ధి చెందినవి. అన్ని సందర్భాల్లోనూ ప్రజలే నిజమైన విప్లవకారులు, మార్గదర్శకులు. ప్రజల విప్లవ స్వభావం చూడ నిరాకరించినవారు, ప్రజల కంటే తామూ ముందున్నామనీ, వుండగలమనీ అనుకున్నవారూ ప్రజలను వదిలి, కొన్ని సాహస చర్యలకు పూనుకొని, విప్లవాలను తుదికంటా తీసుకుపోవడంలో విఫలమైన ఉదాహరణలు చరిత్రలో కనిపిస్తాయి. అదే సమయంలో ప్రజలపై విశ్వాసముంచినవారు ఒకానొక సందర్భంలో ప్రజల్లో కనిపించే అచేతనత్వాన్ని చూసి విసిగిపోకుండా, వారి విప్లవ శక్తులను జాగృతపరిచి విజయవంతంగా పోరాటాలకు నాయకత్వం వహించినట్లు ప్రపంచ విప్లవ చరిత్ర చెప్తుంది.

ఈ వాస్తవాన్ని పరిశీలించాలన్నది సుదర్శన్‌గారికి నేను చేయగల సూచన. "అజ్ఞానం + భయం = మతం" అన్న నిర్వచనం బాగానే వున్నది. ఐతే – ఇది అసంపూర్ణ నిర్వచనం. ప్రజలకు సంబంధించి నంతవరకు మత భావాలకు అజ్ఞానం, భయం మాత్రమే కారణం. దోపిడీ వర్గాలకు సంబంధించినంతవరకు ఇవి కారణాలు కావు. ప్రజల్ని అజ్ఞానంలోకి, భయంలోకి, మైకంలోకి త్రోసే ఈ నల్లమందు వ్యాపారులు చేస్తున్నది పెద్ద కుట్ర. దానికి ఉన్న ఈ దోపిడీ వర్గ ప్రయోజనాన్ని ఈ నిర్వచనంలో తప్పనిసరిగా చేర్చాలి. అప్పుడే దాని దుష్ట స్వభావం పూర్తిగా స్పష్టమవుతుంది.

"త్యాగాలు..... పంట పొలాలకు తెచ్చే నెత్తురు కాల్వలు" అన్న ఎక్స్ రే గారి నిర్వచనం నూటికి నూరుపాళ్ళు సరైనది.

ప్రణాళికల పాత్రలను, పాలకవర్గాల, వారి రాజ్యాంగ స్వభావాన్ని, ఓట్ల ప్రయోజనాన్ని "రాజూ – రాణీ" చక్కగా బయట పెడ్తున్నది.

"దప్పిక ఎరుగని ప్రభుత్వం గుర్రాన్ని / సోషలిజం తటాకం ఒడ్డున వదులు" అంటే ఏమిటి? దప్పిక లేని గుర్రాన్ని సోషలిజం తటాకం (నీరులేని తటాకం) వద్ద వదిలినా, నీరున్న తటాకాల దగ్గర వదిలినా ఒక్కటే. ఇచట భావ వ్యక్తీకరణలో లోపం కనిపిస్తున్నది.

"దేవుడా నువ్వొక ప్లేగువి" నీ పుట్టలోంచి పెరిగిన పాములు.. విషం కక్కుతున్నాయి అనడం బాగుంది.

'ఐ' గారు 'గురి'లో సగభాగంలో ప్రజల అచేతనత్వాన్ని వివరించడానికి – మిగతా సగభాగంలో ఈ అచేతనత్వాన్ని పెంచడానికి, వినియోగించడానికి, మొత్తంగా ప్రజల్ని హత్య చేయడానికి అవకాశవాదులు చేస్తున్న యత్నాలను వివరించడానికి యత్నించారు. మొదటి భాగంలోని భావాల్ని అంతకంటే తక్కువ మాటల్లో చెప్పివుంటే బాగుండేది. రెండవ భాగం బాగానే ఉన్నది.

"ఒంటరి గుంపు" తేలికైన భాషలోనే వున్నా, భావవ్యక్తీకరణలో perfection లేదు. దానివల్ల పాఠకుల గుండెల్లో అది కల్గించగల ప్రభావం అతి స్వల్పం.

"తిరుగబడు"లో దశాబ్దం కింద చచ్చిన శవానికి తిరుగబడు!' అని 'ఐ' గారు ప్రబోధించడం విచిత్రంగా ఉన్నది.

కొన్ని కవితలను మాత్రమే నేనిక్కడ పరిశీలించడానికి యత్నించాను. సంకలనంపై స్థూలంగా అభిప్రాయం చెప్పాలంటే.... పీడిత జన విముక్తికి విప్లవమే మార్గమన్నది 'తిరుగబడు' కవులందరి అవగాహన. భావాల వ్యక్తీకరణలో అక్కడక్కడా కొద్దిపాటి అస్పష్టతలు కనిపించినా వాటినధిగమించడం సాధ్యం. ఈ అస్పష్టతలను మైక్రోస్కోపుల్లో చూడనవసరం లేదు.

పీడితప్రజల వాస్తవజీవితాలకు సంబంధించిన లోతైన అవగాహన లోపిస్తున్నది. ముఖ్యంగా ఫ్యూడల్ సమాజ లక్షణాలను వీరు మరింత నిశితంగా పరిశీలించాలి. సమాజంలోని వివిధ వర్గాలను, ఆ వర్గాల ఆలోచనావిధానాలను – ఆ వర్గాల మధ్య వున్న సంబంధాలను బాగా అధ్యయనం చేసినప్పుడే కవితల్లో జీవం ఉట్టిపడుతుంది. భావాలు సంపన్నంగా, సక్రమంగా ఉంటాయి.

కవితల్లో చాలాచోట్ల పొడిపదాలు, నినాదాల రూపంలో భావ ప్రకటనలు కనిపిస్తాయి. సాహిత్య ప్రక్రియకిది సరిపడని లక్షణం. కవిత్వంలో భావాలు అస్పష్టంగా ఉండడం ఎంత నేరమో, కళాత్మక విలువలు లోపించడం అంతే హానికరం. ఒక కవితలో మంచి దృక్పథం లోపించి, ఎంత గొప్ప కళాత్మక విలువలను సింగారించుకున్నా అది శవాలంకరణంగానే ఉంటుంది. అదేవిధంగా కళాత్మక విలువలు లోపించి, పొడి నినాదాలుగా దృక్పథాలు కవితల్లో ప్రకటిస్తే అవెంత మంచివైనప్పటికీ అవి సజీవంగా ఉండవు. దీన్నిబట్టి దృక్పథాలను కళాత్మక విలువలతో సమర్థవంతంగా ఐక్యపర్చడంలోనే కవుల విజయం ఉన్నది. ఈ సామర్థ్యాన్ని 'తిరుగబడు' కవులు పెంచుకోవాలి. వచన కవితకు తోడుగా, popular formsలో సాధన చేయాలి. ఆ రూపాల్లో విరివిగా కవితలు వ్రాయాలి.

సంకలనంలో విప్లవ పోరాటాలకు సంబంధించిన లోతైన అవగాహన లోపించింది. ఈ లోపాలు లేకుండా విప్లవ కవులు సజీవమైన రచనలు చేయాలంటే – పుస్తక పరిజ్ఞానం చాలదు. దానివల్ల ప్రజలనుసరించే పోరాటరూపాలనూ, క్రమాన్నీ, నిత్య జీవితంలోనూ, పోరాటక్రమంలోనూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారు అర్థం చేసుకోలేరు. రచనలు పాక్షిక వాస్తవాలపైనా, అసమగ్ర వివరాలపైన ఆధారపడ్తాయి. కనుక కవులు ప్రజల్లోకి వెళ్లి సమస్యలను, పోరాటానుభవాలను స్వయంగా పరిశీలించాలి. అప్పుడే వారి పరిజ్ఞానం సమగ్రం కాగలుగుతుంది.

రాష్ట్ర వ్యాపితంగా వున్న విప్లవ కవుల కృషిని సమన్వయపరిచి, విప్లవోద్యమ అవసరాలను గుర్తించి, దాని పురోగమనానికి తోడ్పడే పద్ధతుల్లో కార్యకలాపాలను మేళవించి, విస్తృతం చేయాలి. ఈ కర్తవ్య నిర్వహణలో 'తిరుగబడు' కవులు చొరవ తీసుకోవాలి.

ప్రజల పట్ల – ప్రజాశత్రువుల పట్ల తీసుకోవాల్సిన వైఖరిపట్ల స్పష్టత వుండాలి. వెనుకబాటు చైతన్యం గల ప్రజల్ని ఓపిగ్గా educate చేసి ముందుకు నెట్టడం, విప్లవపంథా చేపట్టిన ప్రజల్ని దృఢంగా సమర్థించి, మరింత వుత్తేజపరచడం ప్రజలపట్ల తీసుకోవాల్సిన జనరల్ దృక్పథం. ప్రజాశత్రువుల ముసుగుల్ని లాగివేసి, వారిని ఎండగట్టడం, ప్రజల శక్తిని, పురోగమనాన్ని చిత్రించి, శత్రువుల గుండెలదరగొట్టి, వారి పతనం అనివార్యమని మళ్లీమళ్లీ చాటి చెప్పడం ప్రజా శత్రువుల పట్ల తీసుకోవాల్సిన దృక్పథం.

విప్లవలక్ష్యంతో, నేటి చారిత్రకకర్తవ్యాన్ని గుర్తించి, ఈ మార్గం ఎంత కంటకావృతమైనదో, ఎన్ని తుపానులను ఎదుర్కొని నిలబడాల్సి వుంటుందో తెలుసుకొని పీడిత ప్రజల పక్షాన నిలవడానికి ముందుకు వచ్చిన 'తిరుగబడు' కవులకు విప్లవాభినందనలు తెల్పడం, వారి లోపాలను స్నేహపూరితంగా విమర్శించి, తిరుగుబాటు హస్తాన్ని అందుకొనడం వెన్నెముకా, ముందుచూపూ వున్న ప్రతివాడూ చేయాల్సినది. ఈ హస్తాన్ని అందుకొనడంలో యోగ్యత సంపాదించడానికి యత్నిస్తానని చెప్తూ ముగిస్తాను. ✦

కవిత

# కొత్తగుంటే ఎంత బావుండు!?

**- సహచరి**

బడిపోరగాళ్ళు....
డబ్బులు కూడేసి కేకులు కోసి
కోకులు మూతలు పీకేసి తాగి
చిందులేసిన్రు....
ఏం కొత్తగుంటదో
దెల్వదు గాని....
ప్రతీ ఏడులాగా
ఈ ఏడు కూడా వద్దన్నా
పోరగాళ్ళు కొత్త సంవత్సరం
వచ్చిందని అర్థమరాతిరి
దాకా ఏదో బద్దలయి
కొత్తదేదో పుట్టుకొచ్చినట్లు
ఆడపిల్లలు కొత్త బట్టలు ముగ్గులు
ముచ్చట్లు లైట్లార్పేసి
హాపీ న్యూ ఇయర్ గోల
నన్నెందుకో ఎప్పటిలాగే
చిరెత్తుస్తున్నాది.....
నిజంగానే పోరగాళ్ళు
పెద్దోళ్ళు ఆడపోరగాళ్ళు
ఆరాపడుతున్నట్లు
కొత్తేడు కొత్తగుంటే
ఎంత బావుండు....?

చదువుకోవాల్సిన
పిలగాండ్లు కరోనా కాటుకు
బళ్ళు కాలేజీలు బంద్దై
చదువులు ఆగమై ఫెయిలైన
పోరగాళ్ళు సచ్చిపోవడం
ఆగిపోతే ఎంత బావుండు!
ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ క్లాసులకు
బతుకు ఆగమై ఫోన్లు నెట్లు
సైట్లలో ఆగమైన బతుకులు
చెడు తిరుగుళ్ళు తిరగడం
బ్యాడ్‌బాయ్స్ రౌడీగర్ల్స్‌గా మారడం
పదమూడేళ్ళకే టీనేజ్ ప్రపోజల్స్
తరగతి గదుల్లో ముద్దు ముచ్చట్లు
ఆగిపోయి రేపటితరం
తరాల మత్తును వదిలించుకొని
ముందడుగు వేస్తే ఎంత బావుండు!
ఇప్పుడు పండుగులు పెళ్ళిళ్లా
ఎన్నికలప్పుడూ ఊళ్ళన్నీ
మద్యం మత్తు బిర్యానీ పొత్తిళ్లో
తులతూగుతూ నోట్ల కట్టలకు
ఊళ్ళను రాష్ట్రాలను దేశాన్ని

తాకట్టు పెట్టకుండా
యువతరం గళమెత్తితే
ఎంత బావుండు!
కొత్త సంవత్సరం కొత్తగుంటే
ఎంత బావుండు.
ఎవసాయం చేసోటోళ్లు
మగ్గం నేసేటోళ్ళు తాళ్ళు, బీళ్ళు
చాకలి మంగలి వడ్రంగి పలుగు పార
నాట్లు వరికోతలు గడ్డి గాసం
పశువులు ఎప్పటిలాగా
ఊరంతా సకల జనుల బతుకు
బాగుపడితే
ఎంత బావుండు -
ఆజాదీకి అమృతోత్సవ్‌ల పేర
బ్యాంకులు కొలువులు చదువులు
వైద్యం అన్నీ ప్రైవేటీంచడం మాని
మానిటైజేషన్‌తో పైప్‌లైన్లో
ప్రజల రక్తమాంసాల్ని
కార్పోరేట్లకు తరలించడం
ఆపగలిగితే ఎంత బావుండు....

– నూతన సంవత్సరం (2022) సందర్భంగా! ✦

# తెల్లచీర, రక్తంతో ఎరుపెక్కింది

- ఆర్. ఉమామహేశ్వరి

"2016లో ఈ రచయిత్రి ఇంగ్లీషులో రాసిన ఈ వ్యాసం 'సెమినార్'.... సంచికలో ప్రచురించారు. దానిని ఆ రచయిత్రే సంక్షిప్తంగా తెలుగులో రాసిన వ్యాసం ఇది.

కొండమొదలు గిరిజన రైతాంగం తమకు కేటాయించిన పునరావాస ప్రాంతానికి తరలి వెళ్ళాల్సి వచ్చిన సందర్భంగా ఈ వ్యాసాన్ని అందిస్తున్నాం". - సం ॥

*"కొండమొదలులో **1969** ప్రతిఘటనా కాలంలో కుంజ రాజులన్న, మాది లచ్చుమయ్య పోలీసు కాల్పులలో మరణించారు. 'తెల్లచీర రక్తంతో ఎర్రనవ్వద్ధి' అంటే మన రక్తం చిందందే మన భూములు మనకు తిరిగి రావు అని అర్థం. చీర రక్తంతో ఎరుపెక్కడం అంటే అమరత్వం అని అర్థం. ఇక్కడ మేము కొన్ని గ్రామాలలోనైనా పాఠశాలలుగానీ, విద్యుత్తుగానీ సాధించుకున్నామంటే అవి ఎవరి దయా దాక్షిణ్యం వల్ల వచ్చినవి కావు. మా సమష్టి పోరాటం వల్ల వచ్చినవే. ఇదే ఈ సామెతకు అర్థం. కనుక మన భూములు మనం నిలబెట్టుకోవాలంటే నిరంతరం పోరాడాల్సిందే".* - మాది ముత్తెమ్మ

**2016** శీతాకాలంలో ఒకనాటి నులివెచ్చని ఉదయం గోదావరి తల్లి ఒడ్డున, ప్రకృతి ఒడిలో, పచ్చటి పంటపొలాలు, చెట్లు, సజీవ స్రవంతి (ప్రవాహం) గోదావరి సమక్షంలో కొండలు మధ్యనున్న కొండమొదలు కొండరెడ్ల మహిళల నృత్యాలతో మార్మోగుతోంది. వారు వృత్తాకారంలో చేయి చేయి పట్టుకుని లయబద్ధంగా కదులుతూ "రేలా రేలా కొండమొదలు వస్తా నీలో" అంటూ పాడుతున్నారు. పాట సాగే క్రమంలో కొత్తవారు వచ్చి కలుస్తున్నారు, పాతవారు వెళ్తున్నారు. ఇలా స్వేచ్ఛగా వస్తూ, వెళ్తూ ఉండడం వల్ల పాటకు, నృత్యానికి ఆటంకం కలగడంలేదు. వారి నృత్యంలో ఒక సామూహిక భావన ఉంది. (వారి సంస్కృతిలో భాగమైన ఈ సామూహిక భావన పునాదిగానే అక్కడ ఒక చారిత్రక దశలో ఒక రాజకీయ భావన వచ్చి చేరింది. అదే కమ్యూనిజం.) పాటలో క్రమం తప్పకుండా కొండమొదలు పేరును వారు స్మరిస్తూ ఉన్నారు. గతంలో అదే రోజున జరిగిన ఒక ప్రతిఘటనా సంఘటనను, అందులో అమరులైనవారిని స్మరించుకుంటూ చేస్తున్న నృత్యం ఇది. ఇది స్వేచ్ఛారహితమైన నిర్బంధాల మధ్య ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమం వంటిది కాదు.

ఆరోజు అక్కడ రెండు రకాలైన నృత్యాలు, పాటలు సాగాయి. ఒకటి సంప్రదాయ పాటకు అనుగుణ్యమైన నృత్యం. రెండవది ఎర్రని చీరలతో ప్రగతిశీల విప్లవ గీతాలకు అనుగుణ్యమైన నృత్యం. ఇది కొండమొదలు సమకాలీన ఉద్యమానికి ప్రతీక. కొండమొదలు ప్రజల ప్రతిఘటనా చరిత్ర గురించి ఇప్పటివరకు అధ్యయనం జరగలేదు. గతంలో జరిగిన, ఇప్పుడు జరుగుతున్న ఆదివాసీల విప్లవ వారసత్వాన్ని విస్మరించి అల్లూరి సీతారామరాజును ప్రధాన స్రవంతి మీడియా పైకెత్తింది. వాస్తవానికి ఆదివాసీల అండదండలు లేకుండా ఆయన పోరాటం విజయవంతమయ్యేది కాదు.

ఆరోజు నృత్యం చేసిన యువ ఆదివాసి స్త్రీలలో ఎక్కువమంది వామపక్ష పార్టీలు ఇక్కడ ప్రవేశించిన తరువాత పుట్టినవారే. 1950ల నాటి తెలంగాణ సాయుధ పోరాటం, 1960లలో వచ్చిన శ్రీకాకుళ గిరిజన వామపక్ష ఉద్యమాల తరువాత వీరు మూడవతరంవారు. కొన్ని వందల సంవత్సరాల కాలంలో ఇక్కడి ప్రజలు వారి ఉనికి కోసం చేసిన పోరాటాల, త్యాగాల చరిత్ర యొక్క రాజకీయ ప్రదర్శనే ఈ నృత్యాలు, ఈ పాటలు.

## జీవనాధారమైన గోదావరి నది

అడవులు, పంటపొలాలు, కొండపోడు సాగును రక్షించుకోవడం కోసమే వారి పోరాటం. ప్రస్తుత ఇందిరాసాగర్ పోలవరం డ్యాం వీటిని నాశనం చేస్తున్నది. కనుక వీరి పాటలు, నృత్యం వారి హక్కుల సాధనకు జరిగే ప్రదర్శనే తప్ప జాతీయ పర్వదినాల్లో ప్రభుత్వం చేసే వినోద ప్రదర్శన కాదు.

## కొండమొదలు : భౌగోళిక విశేషాలు

దేవీపట్నం మండలంలో, పాపికొండలు – గోదావరి నదికి మధ్యలోనున్న సుందరమైన ప్రాంతం కొండమొదలు. పడవ ప్రయాణం ద్వారా కొండమొదలు ప్రాంతానికి చేరుకోవచ్చును. రోజుకు రెండు సార్లు మాత్రమే బస్సులు తిరుగుతాయి. ప్రయాణికులను బట్టి సర్వీసు ఆటోలు రోజుకు మూడుసార్లు తిరుగుతాయి. వర్షాకాలంలో ప్రయాణం చాలా కష్టం. ఇక్కడి ప్రజలు కష్టాలకోర్చి, తమ జీవితాలను నిలబెట్టుకోవడానికి ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా వివిధ కాలాల్లో చేసిన పోరాటాలు మరువలేము. పోలవరం డ్యాం వారిని ఎప్పుడైనా ముంచేయవచ్చు. అయినా వారు పంటపొలాలను అంటిపెట్టుకుని సాగుచేస్తూనే ఉన్నారు.

కొండమొదలు గూర్చి చారిత్రకంగా వివిధ రకాలుగా వర్ణించారు. వలసకాలపు గెజిటీర్‌లో ఈ విధంగా ఉంది. "చోడవరంకి పశ్చిమంగా 27 మైళ్ళ దూరంలో 332 మంది జనాభాతో ఉంది. మోఖాస ఎస్టేట్‌కు కేంద్రముగా ఉంది. గోదావరి నది నుంచి కొండల మధ్య సన్నని



మార్గం ద్వారా ఇక్కడకు ప్రవేశించాలి. లింగారెడ్డి మనవడు ప్రస్తుతం ఎస్టేట్ యజమాని. రంప తిరుగుబాటు సమయంలో లింగారెడ్డి వలస పాలకులకు సహకరించాడు. గోదావరి నదిలో సరుకు రవాణాపై పన్ను వసూలు చేసే హక్కు వదులుకున్నందుకుగాను అతనికి నెలకు 50 రూపాయల భత్యాన్ని పరిహారంగా, కొన్ని షరతులతో కేటాయించారు. అతని సహచరుడు సుబ్బారెడ్డి చేసిన పితూరీకి లింగారెడ్డి దూరంగా ఉండటం ద్వారా ప్రభుత్వ అభిమానాన్ని పొందాడు. నాలుగు గ్రామాలతో కూడిన కొండమొదలు పోలవరం జమిందారుకు సాలుకు 110 రూపాయలు పన్ను చెల్లించేవారు. ఈ విషయం ఈ రోజుకు కోర్టు వివాదంలో ఉంది". (1915)

## కొందరు పరిశోధకుల నివేదిక

1940 ప్రాంతంలో కొండమొదలుపై పరిశోధన చేసిన హైమన్ డార్ఫ్ ఈ విధంగా రాశారు. "ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీ తెగలలో కొండరెడ్ల తెగ ఒకటి. వీరు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. సాంప్రదాయకంగా వీరు అడవిని నరికి తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, జొన్నలు, కూరగాయలు పండించేవారు. వీరు చేసే పోడు సాగు పద్ధతి మొరటు పద్ధతిగా ఏషియాటిక్ ప్రధాన ప్రాంతాల్లో అన్ని చోట్ల కనిపిస్తుంది. ఆహారం కోసం విల్లు, బాణాలతో వేటాడుతారు. అలాగే గోదావరి ఒడ్డున నివసించేవారు. చెట్ల మ్రానులను తొలిచి చేసిన పడవలతో గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్తారు. చేపలు వీరి ఆహారంలో ఒక భాగము. భూములపై వీరిది సమష్టి యాజమాన్యం. అట్టి సమష్టి యాజమాన్యం నుండి వచ్చిన ఐక్యతే వారు సమష్టిగా జరుపుకునే సంప్రదాయ కార్యక్రమాలలో వ్యక్తమవుతూ ఉంటుంది."

వారి ప్రతిఘటన చరిత్రను ప్రస్తావిస్తూ జయప్రకాశ్‌రావు ఇలా రాశారు : "నక్సలైట్లు ఈ ప్రాంతంపై ప్రభావాన్ని పెంచుకోవడం ప్రారంభం కావడంతో ఈ ప్రాంతంలో ఆదివాసుల కోసం రక్షణ చట్టాలను అమలుపరచాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. 1969లో 13 కొండమొదలు శివారు ప్రాంతాలలో గిరిజనేతరుల అధీనంలో ఉన్న భూములలో వరి సాగుచేయాలని కొండరెడ్లు, కోయలు, కొండకమ్మరులను నక్సలైట్లు ప్రోత్సహించారు. ఈ వెంటనే ఆదివాసీలు ఆ పనికి పూనుకొని 680 బస్తాల వరిధాన్యాన్ని తీసుకెళ్లిపోయారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఎందరో ఆదివాసీలపై కేసులు పెట్టారు, అరెస్టు చేశారు, జైళ్లలో కుక్కారు. 1976 వరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా చట్టానికి వ్యతిరేకంగా ఆదివాసీల భూములను ఆక్రమించారని గిరిజనేతలరుపై కూడా ప్రభుత్వం సుమోటోగా కేసులు పెట్టింది".

ఒక పురావస్తు పరిశోధక బృందంతో 1984లో అధికారిక పర్యటన జరిపిన తెగల పురావస్తు పరిశోధకుడు ఎం.యల్.కె. మూర్తి ఈ విధంగా చెప్పారు. "మేము రెయిన్ ఫారెస్ట్ యెడాప్టేషన్ కనుగొన్నాము. క్రీస్తుపూర్వం ఐదువేల నుండి ఇక్కడ వరి వాడకంలో ఉన్నట్లు గుర్తించాము. 1.5 లక్షల సంవత్సరాల పూర్వం నుండి ఇక్కడ మానవ జీవనం ఉంది. వీళ్ళు పాటిస్తున్న ప్రాచీన జీవన విధానం, సాగు పద్ధతుల వల్ల ఇక్కడ జీవిస్తున్న ఆదివాసీలకు ఎంతో ప్రాధాన్యత ఉంది".

ఈ నివేదికలు అన్నీ ఈ తెగల గూర్చి చారిత్రకంగా వర్ణించాయి. కానీ డ్యాం వల్ల జరుగుతున్న వినాశనాన్ని గూర్చి ప్రశ్నించినవారు లేరు. డ్యాం వల్ల వీరి జీవనానికి ఆధారమైన అడవుల అందుబాటు తగ్గిపోతున్నది. వీరి రక్షణ కోసం అంటూ ప్రభుత్వం తెచ్చిన భూ క్రమబద్ధీకరణ విధానం వీరి కష్టాలను మరింత పెంచింది. దీనికితోడు 2016లో ప్రభుత్వం చేసిన పెద్ద నోట్ల రద్దు వల్ల కష్టాలు మరీ పెరిగాయి. డబ్బు తెచ్చుకోవడానికి రంపచోడవరం పోవాల్సి వచ్చేది. అక్కడకు వెళ్లాలంటే కొండమొదలులో పడవెక్కి శివగిరిలో దిగాలి. అక్కడ మరలా పడవెక్కి దేవీపట్నంలో దిగాలి. అక్కడ నుండి బస్సులో రంపచోడవరం వెళ్ళాలి. ఉదయం బయలుదేరితే సాయంత్రం 5 లేక 6 గంటలకు ఇంటికి చేరతారు. సుమారు 200 రూపాయలు ఖర్చు అవుతుంది. వలసపాలన కాలం నుండి నేటివరకు ఈ పరిస్థితుల్లో మార్పులేదు. ఐటిడిఎ ఏర్పడిన తర్వాత కూడా ఈ పరిస్థితుల్లో మార్పు రాలేదు. ప్రస్తుతం ఐటిడిఏ డ్యాం నిర్వాసితుల లెక్కలు చూసే సంస్థగా మారింది. ప్రతి పనికి చోడవరం వెళ్ళవలసిన విషయంలో మార్పు జరగలేదు.

ఇది పోలవరం డ్యామ్‌కు చెందిన సమకాలీన ప్రతిఘటన, చరిత్ర కాదు. ఈ సమకాలీన పరిస్థితులలోనే నేను నా కొండమొదలుకు పాత్రికేయ ప్రయాణాన్ని సాగించాను. అనేకమందిని విచారించి, సమాచారాన్ని సేకరించాను. చాలామంది మాటల్ని రికార్డ్ చేశాను. ఈ ప్రతిఘటన ఫలితాలను ఇస్తుందని వారు ఇప్పటికీ నమ్ముతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన చరిత్ర అంటే గతంలోని కొన్ని పథకాల తేదీలు, సంవత్సరాలు, సంఘటనలుగా చూశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత, ఏర్పడక పూర్వం ఈ ప్రాంతంపై వలస పాలకులు; కమ్మ, కాపు, రాజుల పెత్తనానికి చెందిన చరిత్రగాను, ఆదివాసీలకు సంబంధంలేని చరిత్రగా చెప్పారు. కోయ, కొండరెడ్డి, కమ్మర, ఇతర దళితులకు సంబంధించిన చరిత్రగా చూస్తే పరిస్థితి భిన్నంగా ఉండేది. ఇక్కడి ఆదివాసీలు తమని తాము గుర్తించుకోవడం కోసం బయట నుండి వచ్చిన వారిని గిరిజనేతరులుగా పిలిచారు. గిరిజనేతరులు అంటే భూస్వాములు. వీరి చరిత్రను ఆదివాసీల చరిత్రతో ముడివేశారు.

## పోలవరం డ్యామ్ పట్ల వ్యతిరేకత

2004-05 ప్రాంతంలో పశ్చిమ గోదావరి జిల్లా పోలవరంలో డ్యామ్‌కి వ్యతిరేకంగా ప్రజాఉద్యమం ఉండేది. తమ జీవితాలు ప్రమాదంలో పడుతున్నందున కోయ, కొండ రెడ్డి, ఇతర దళితులు ఈ ఉద్యమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. 2004కి ముందు వేసిన అంచనాల ప్రకారం 276 గ్రామాలు, 3000 ఎకరాల అటవీ ప్రాంతం, వేల ఎకరాల సారవంతమైన పంటభూమి ముంపుకు గురవుతుంది. ఇందులో 270 గ్రామాలు 5వ షెడ్యూల్ గ్రామాలు. తెలంగాణ రాష్ట్రం

ఏర్పాటు ముందుకు రావడంతో ముంపు ప్రాంతాలను తిరిగి అంచనా వేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో డ్యాం జాతీయ ప్రాజెక్టుగా మారింది. 2006 నుండి నేను తరచూ వెళ్తూ, వస్తూ ఉన్న గ్రామాల్లో నాలుగు గ్రామాలు 2016 నాటికి లేకుండా పోయాయి. ఆ గ్రామాల ప్రజలపై రాజద్రోహం కేసులు పెట్టి వేధించారు. వారు చివరి రక్తం బొట్టు వరకు పోరాడారు. చివరకు వారి పూర్వీకుల ప్రాంతాలను వదిలి వెళ్ళవలసి వచ్చింది. కాలం గడిచేకొద్దీ కొన్ని ఎన్జీవోలు కూడా మెల్లగా వెనక్కు తగ్గాయి. అవి ప్రభుత్వాలకు, ప్రైవేటు సంస్థలకు ప్రాజెక్టులు రూపొందించే, అటవీ భూములు సర్వేలు చేసే సంస్థలుగా మారిపోయాయి. మరికొన్ని ఎన్జీవోలు నిర్వాసితులకు పునరావాసంపై సంప్రదింపులు జరిపే కమిటీలలో చేరాయి. మద్రాస్ ప్రెసిడెన్సీలో గాని, తరువాత ఆంధ్రప్రదేశ్‌గాని, ఆ తరువాత తెలంగాణ ఏర్పడిన కాలంలో గాని కొండరెడ్లను వలసకాలపు ఏజెన్సీ ప్రాంతాల వారిగానే చూశారు తప్ప భారత పరిపాలనలో ఇముడ్చుకోలేదు. పరిపాలనా పరంగా పునరావాసం, పునర్వ్యవస్థీకరణ (Resettlement and Rehabilitation__R&R) పథకం ప్రభుత్వానికి అద్భుతంగా ఉపయోగపడింది. దీని ద్వారా ఆదివాసీలను వారి చారిత్రక ప్రాంతాల నుండి ప్రభుత్వం నిర్ణయించిన ప్రాంతాలకు తరలించే వెసులుబాటు దొరికింది. వీరికి ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారం చెల్లించవచ్చు.

కానీ కొండరెడ్లు తమ సుదీర్ఘ తిరుగుబాటు మార్గాన్నీ, వామపక్ష ఉద్యమాలతో అనుబంధం గురించి చెప్పిన విషయాలు, జ్ఞాపకాలు వేరుగా ఉన్నాయి. మరో ముఖ్యమైన సామాజిక సమస్య ఏమిటంటే కొండమొదలు ఆదివాసీలలోకి, దేశదిమ్మరి జాలర్లలోకి వలస పాలనాకాలంలోనే కులం ప్రవేశించింది. ఇక్కడకు వచ్చిన కులాలకు, రాజ్యాధికారానికి విడదీయరాని సంబంధం ఉంది. ఆనాటి నుండే వీరు ఆదివాసీల భూములను ఆక్రమించడం ప్రారంభించారు. వీరిలో బ్రాహ్మణులు ఉన్నారు. తద్వారా వీరు పరిపాలనలో ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. భూమిని ఆదివాసీల నుండి స్వాధీనం చేసుకుని సాగు చేస్తున్న ఈ అగ్రకులాల వారు లాభాలు గడించారు. మొదట ప్రభుత్వం వీరిని 1/70కి వ్యతిరేకంగా ఉన్నారు కనుక నష్టపరిహారం ఇస్తామని చెప్పి డ్యాంకు భూమిని సేకరించారు. కనుక కులాన్ని విస్మరిస్తే ఈ ప్రాంత చరిత్రను గూర్చి అర్థం చేసుకోలేము. ఈ ప్రాంత చరిత్ర, కులచరిత్రతో ముడిపడి ఉంది. వామపక్షాలు ఈ ప్రాంతానికి రాక పూర్వం నుండే కొండరెడ్లు, విప్లవకారులు, పోలవరం జమీందార్ల అణచివేతకు, వలస పాలకుల రిజర్వ్ ఫారెస్ట్ ఏర్పాటు విధానానికి వ్యతిరేకంగా తమ భూములను, పోడు సాగును రక్షించుకోవడానికి పోరాడారు. 1878లో హెన్రీ మోరీస్ వీరి గురించి ఈ విధంగా వ్రాశారు. “బంగాళాఖాతం పశ్చిమతీరంలో అడవిపైన, సముద్రంపైన, ఆధారపడి జీవిస్తున్న ఈ ప్రాంత శాంతికాముక ప్రజలు తమ స్వంత రాజుల పాలనలోనూ, బ్రాహ్మణ ఆధిపత్యంలోనూ, బౌద్ధుల కాలంలోనూ, మహమ్మదీయుల కాలంలోనూ ఫ్రెంచివారి పాలనలోనూ, ఇంగ్లీష్‌వారి పాలనలోనూ జీవనం సాగించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి గతంలో ఎన్నడూ లేనంత ఉన్నతంగా ఉంది. గిరిజన తెగలు, మెరక ప్రాంతాలవారు కొంత అశాంతిగా ఉన్నారు. ఆ అశాంతికి కారణం నాయకులే. వారు చట్టాలను అమలుపరచకుండా పన్నులు చెల్లించకుండా ఉండడం కోసం అడవులకు పోయి దాక్కోవడం వల్ల ఇది జరిగింది”.

## చరిత్ర పుటల్లో కొండమొదలు

మద్రాసు ప్రెసిడెన్సీలోని ఈ ప్రాంతం ప్రత్యేక చట్టాల పరిధిలోకి వచ్చింది. అందుకు కారణం..... “మద్రాసు ప్రెసిడెన్సీలో గోదావరి జిల్లా 10 తాలూకాలుగాను, 2 తహసీల్దార్ డివిజన్లుగాను ఉంది. వీటిలో ఎల్లవరం, చోడవరం, పోలవరం, భద్రాచలం అటవీ, కొండ ప్రాంతాల్లో అనాగరికులైన ఆదివాసీలు జీవిస్తున్నారు. ఇక్కడ కూడా దేశం మొత్తంలో అమలుచేసే సాధారణ చట్టాలనే అమలుచేయడం అనుభవంలేని పని. షెడ్యూల్ డిస్ట్రిక్ట్ చట్టం 1874 ప్రకారం ఈ ప్రాంతం ‘ఏజెన్సీ’గా మారింది. ఇక్కడ ప్రత్యేక పౌర న్యాయపాలన ప్రత్యేక చట్టాల ద్వారా సాగింది. ప్రభుత్వ ప్రతినిధిగా కలెక్టర్‌కి ప్రత్యేక అధికారాలు ఉన్నాయి. తర్వాత కాలంలో ఈ ప్రాంతం ఏజెన్సీ ప్రాంతంగా స్థిరపడింది”.

“పోలవరం, చోడవరం, ఎల్లవరం, భద్రాచలం డివిజన్లకు చెందిన ఆదివాసీలు ఎక్కడో దూరంగా కొండలు, కోనల్లో జీవిస్తూ ఉంటారు. వీరు మైదాన ప్రాంత ప్రజలచే విస్మరింపబడిన, ప్రపంచజ్ఞానం లేని, నిరక్షరాస్యులైన, వెనుకబడిన, సరైన సమాచారవ్యవస్థ లేని ఆదివాసీలు. తాము నివసిస్తున్న ప్రాంతంలో అనుకూలమైన పరిస్థితులు దెబ్బతిన్నప్పుడు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వలస పోతుంటారు. అట్టివారికి దేశపాలనకు ఉపయోగించే సాధారణ చట్టాలు అనుకూలం కాదు. అందువల్ల ఆ తర్వాత కాలంలో వారికి ప్రత్యేక చట్టాలను ప్రవేశపెట్టారు”.

ఈ ప్రత్యేక చట్టాలు ఏజెన్సీ ప్రాంతాన్ని అదుపు చేయడానికి మంచి సాధనాలుగా బ్రిటిష్ ప్రభుత్వానికి ఉపయోగపడ్డాయి. స్వాతంత్ర్యానంతర కాలంలో ఆదివాసీలు భూముల పరాయీకరణ చెందకుండా రక్షించుకోవడానికి ఉపయోగపడ్డాయి. ఆదివాసీల ప్రతిఘటనను అదుపుచేయడానికి, ఇతరులు ఈ ప్రాంతంలో ప్రవేశించడాన్ని నిరాకరించే పద్ధతిని బ్రిటిష్‌వారు మొదట ప్రవేశపెట్టారు. స్వతంత్ర భారత ప్రభుత్వం ఈ పద్ధతిని అనుసరిస్తూ భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూలు ఏర్పరచి మరింత విస్తృతపరిచింది. ఎంతగా విస్తృతపరిచిందంటే ఆదివాసీలు ప్రధాన స్రవంతికి భిన్నమైన, ప్రత్యేకమైన, ఏ రకమైన మానవ చరిత్ర లేని, ఎట్టి సంబంధాలు లేని, ప్రత్యేక పాలన అవసరమైన తెగలుగా చిత్రీకరించింది. వీరి వృత్తాకార నృత్యాన్ని ఈ పరిస్థితుల్లోనే, ఈ సందర్భంలోనే పరిశీలించాలి.

## కొండమొదలు ఆదివాసీల ప్రతిఘటన

కొండమొదలు ఆదివాసీలకు వారి ప్రతిఘటన చరిత్ర విప్లవకారులుగా ఒక విశ్వాసాన్ని, ఒక ప్రాచీనత్వాన్ని, గుర్తింపును ఇస్తున్నది. హక్కులకోసం పోరాటం అనే విశ్వాసం కలిగిస్తున్నది. అనాదిగా కొండమొదలులో కొండరెడ్లు, కోయలు కొండకమ్మర్లు నివసిస్తున్నారు. కాని చాలా కాలంగా కాపు, కమ్మ భూస్వాములు ఈ ప్రాంతంపై సాంఘికంగా, ఆర్థికంగా పెత్తనం చేస్తున్నారు. తరువాత పల్లి, వడ్డ బల్జి తెగలవారు, చేపలు పట్టేవారు వలస వచ్చారు. వారిని బి సి–డిగా వర్గీకరించారు. వీరు ఆదివాసీలతో కులాంతర వివాహాలు చేసుకున్నారు. అలానే చేపలు పట్టే యానాదులు వచ్చారు. వీరు గతంలో

ఆదివాసీలుగా ఉన్నా, తరువాత వీరిని అధికారికంగా బీసీలుగా వర్గీకరించారు.

ఈ రకమైన సామాజిక పరిస్థితుల్లో కొండరెడ్లను అభివృద్ధి పరచడం పేరుతో ప్రత్యేక నియమాలను రూపొందించడం కోసం వీరిని ఆదిమతెగల సమూహంగాను (ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్ - PTG) ఆ తరువాత పర్టిక్యులర్ వల్నరబుల్ గ్రూపుగా (PVG) భారత ప్రభుత్వం పరిగణించింది. ఇది ఆదివాసులకు సంబంధించి వలసపాలకుల యొక్క భారత ప్రభుత్వం యొక్క బహిర్ముఖం. కొన్ని వేల సంవత్సరాల కాలంలో చారిత్రకంగా వేళ్ళూనుకున్న వారిదైన చరిత్ర మరొకటి ఉంది. అది వారి అంతర్ముఖ చరిత్ర. వారిదైన ఈ ప్రాంతం యొక్క సామాజిక చరిత్రను రెండు కోణాల నుండి పరిశీలించినప్పుడే అది అర్థవంతం అవుతుంది. ఈ సందర్భంలోనే ఒక విషయం చెప్పాలి. గోదావరి 'అచ్చినప్పుడు' అనే పదం విన్నట్లుగానే 'ఇక్కడ' 'అక్కడ' అనే పదాలను కూడా వారితో మాట్లాడేటప్పుడు నేను మరలా, మరలా విన్నాను. 'ఇక్కడ' అంటే ఏ ప్రాంతంలోనైతే వారు చారిత్రకంగా నివసిస్తున్నారో, నివసించారో, నివసించాలని అనుకుంటున్నారో ఆ ప్రాంతం. 'అక్కడ' అంటే ఏ ప్రాంతానికైతే ప్రభుత్వం వారిని పంపాలని అనుకుంటున్నదో, ఆ ప్రాంతం. చారిత్రక అవగాహనపరంగాను కూడా వీరు వలస పాలకుల పట్ల ఇదే దృక్పథాన్ని కలిగి ఉన్నారు.

లిఖిత, మౌఖిక రికార్డుల ప్రకారం ఈ ప్రాంతానికి సంబంధించిన చారిత్రక పునరుల్లేఖనాలలో వలస కాలపు తిరుగుబాట్ల చరిత్రకు, 20వ శతాబ్దపు స్వాతంత్ర్యానంతర ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ప్రతిఘటనల చరిత్రకు మధ్య లింకు తెగిపోయింది. కొండమొదలు ఆదివాసీలతో మాట్లాడుతున్నప్పుడు అగ్రకుల భూస్వాముల ఆధిపత్యాన్ని గూర్చిన ప్రస్తావనలు ఎక్కువగా వచ్చాయి. శివయ్య పాత్రుడు కొండరెడ్ల భూముల్ని గుంజుకోవడానికి అనుసరించిన నీచ పద్ధతుల ప్రస్తావనలు కూడా ఎక్కువగా వచ్చాయి. గత తిరుగుబాట్ల ప్రస్తావన వచ్చినప్పుడు ఎర్రజెండా చేతబట్టి దీర్ఘయాత్రలు చేసిన ప్రస్తావనలు వచ్చాయి. ఈ రోజు రాజశేఖరరెడ్డి పాలన కాలం నుండి జగన్ పాలనాకాలం వరకు నిర్మితమవుతున్న 57940 కోట్ల విలువైన డ్యాంకు వ్యతిరేకంగా కొద్దిమంది ఆదివాసి రైతులు మాత్రమే పోరాటాలు చేస్తున్న ప్రస్తావన వచ్చింది. తమ అడవులను, నదిని రక్షించుకోవడానికి పోరాడుతున్న ఆదివాసి కొండరెడ్లను ప్రభుత్వ అధికారులు అనాగరికులు, తెలివితక్కువవారు, తగాదాకోరులని చెప్తున్నారు. స్వాతంత్ర్యానంతరం వారిని లబ్ధిదారులుగా వర్ణించారు. ఇప్పుడేమో బహిష్కృతులుగా చూస్తున్నారు. విస్థాపనను వ్యతిరేకించేవారు కూడా, వారు వ్రాసే కరపత్రాలలో ఈ మాటలనే వాడుతున్నారు.

**కొండమొదలు ప్రతిఘటన**

స్వాతంత్ర్యానంతర పరిపాలనలో కొండమొదలు పంచాయతీలోని ప్రతిఘటనను ఇతర ప్రాంతాల కంటే భిన్నంగా చూడాలి. కొండమొదలు రాజ్యం యొక్క అభివృద్ధి నమూనాలో ఇమడదు. ప్రతి ఆదివాసీ కుటుంబంలోనూ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఒక అమరవీరుడో లేక పోరాట యోధుడో, ప్రతి దశలోనూ కనిపిస్తాడు. గతం గురించి



వారు చెప్పే ప్రతి మాటలోనూ ప్రతిఘటన ధ్వనిస్తూ ఉంటుంది. వారు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడతారు. వారు ఎప్పుడూ ప్రభుత్వం నుండి లబ్ధి పొందడానికి లేక రాయితీలు పొందడానికి ప్రయత్నించలేదు. ఈ ప్రతిఘటన కాలంలోనే ఇక్కడకు వామపక్ష ఉద్యమం ప్రవేశించి వారిదైన స్వంత చరిత్రను నిర్మించుకుంది. ఈ ఉద్యమం ద్వారానే కొండరెడ్లు, కోయలు తిరిగి వారిదైన స్థానిక ఉద్యమాన్ని వారికోసం వారు నిర్మించుకున్నారు. మహిళలు చేసే నృత్యం సరిగ్గా దీనికి ప్రతీక. తూర్పుగోదావరిలోని కొండమొదలు, పోలవరంతోను, చేగొండపల్లెతోను (ఇది కోయ గ్రామం - ప్రస్తుతం తొలగించబడింది), పోచవరంతోను, దీర్ఘకాలంగా సంబంధం కలిగి ఉంది. ఈ సంబంధం వామపక్షాల సిద్ధాంతాల కారణంగా ఏర్పడిందే. పోచవరంలో కొండరెడ్లు ఉంటారు. ఇక్కడ నేను గంగిరెడ్డి అనే ఒక పెద్దాయనను కలిశాను. అతను పచ్చబొట్టు పొడిపించుకుని నడుముకు గుడ్డ కట్టుకుని ఉన్నాడు. 1960 ప్రాంతంలో ఇతను సాయుధ వామపక్ష రాడికల్ ఉద్యమంతో సంబంధం కలిగి ఉన్నాడు. ఆసక్తికరమైన విషయం ఏమంటే, ఖమ్మం జిల్లాలో ఈ పోచవరం గ్రామం కొండరెడ్లు 2009-2013 మధ్యకాలపు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగస్వాములుగా ఉన్నారు. కొండమొదలు కొండరెడ్లు, పోచవరం కొండరెడ్లు వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఉమ్మడి చరిత్ర కలిగి ఉన్నా తెలంగాణరాష్ట్ర ఉద్యమంలో చేరడం కొండమొదలు కొండరెడ్లు సరికాదు అనుకున్నారు. గోదావరి నదికి చెరో ఒడ్డున ఉన్న ఈ రెండు ప్రాంతాల మధ్య సాంస్కృతికంగా, భౌగోళికంగా పరస్పర సంబంధాలు ఉన్నా తెలంగాణరాష్ట్ర ఉద్యమం విషయంలో ఒకరికొకరు వ్యతిరేకంగా ఉన్నారు.

ఈ రకమైన చారిత్రిక పరిస్థితులలోనే ఆదివాసీల జీవనాలు భిన్న చారిత్రక మార్గాల్లో నిర్మితమైనవి. ఈ రకమైన చరిత్ర పట్ల వారు స్పృహతోనే ఉన్నారు. ఆయా కాలాల ఉద్యమాల నుండి చరిత్ర నిర్మితమైంది. ఉదాహరణకు రంప తిరుగుబాటు, సుబ్బారెడ్డి తిరుగుబాటు, ఆర్థర్ కాటన్ ఆనకట్ట నిర్మాణం, డెల్టా ప్రాంత అగ్రకులాల భూ ఆక్రమణ, ప్రస్తుత పోలవరం ప్రాజెక్ట్ వ్యతిరేక ప్రతిఘటన ఈ చరిత్రకు

ఉదాహరణలే. ఇవన్నీ ప్రజల జ్ఞాపకాల్లో ఉన్నాయి. ఉదాహరణకు గంగరాజు (2016లో చనిపోయాడు) ఇల్లా రామిరెడ్డి, మాది ముత్తమ్మ మాటల్లో ఈ విషయాలు వ్యక్తమయ్యాయి.

## రెడ్డి పోలవరం – పోలవరంగా మారిన వైనం

గంగరాజు మాజీ ఎం.పి.టి.సి. అతని మాటల్లో : "పోలవరాన్ని గతంలో రెడ్డి పోలవరం అని పిలిచేవారు. కొండరెడ్లు గ్రామ పంచాయితీకి నాయకత్వం వహించేవారు. ఉదాహరణకు నడుపురు రామిరెడ్డి, లచ్చిరెడ్డి పంచాయితీ సర్పంచులుగా ఉన్నారు. హుకుంపేట జమీందారు ఇక్కడి భూములన్ని ఆక్రమించడంతో రెడ్డి పోలవరం కాస్త పోలవరంగా మారిపోయింది. 1960లలో మేము భూస్వాముల, ప్రభుత్వ అటవీశాఖ అధికారుల మధ్య నలిగిపోయాయి. పశువులను మేపుకోవడంపై, అడవులను వాడుకోవడంపై నిషేధం విధించారు. అప్పుడు మా పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలాగా తయారైంది. జమీందార్లు, ఎస్టేట్లు రావడంతో మా అదృష్టం తలకిందులైంది. బ్రిటిష్‌వారి కాలంలో మేము కొండపోడు కొరకు ఎకరాకి.... 5 రూపాయలు పన్ను కట్టేవారము. కర్ణాలు, మున్సిఫ్‌ల ద్వారా ముత్తెదార్లకు బీడా కట్టాము. తర్వాత 2 రూపాయలు దస్తు పన్ను కట్టాము. మా ప్రజల మధ్య అల్లూరి సీతారామరాజు పనిచేశారు. మా పెద్దలు ఆయనకు మద్దతు ఇవ్వకపోయి ఉంటే ఆయన విజయం సాధించగలిగేవారు కాదు".

కొండమొదలు మాజీ సర్పంచ్ ఇల్లా రామిరెడ్డి ఈ విధంగా చెప్పారు. "వలసపాలన కాలంలో ప్రభుత్వం పోడుసాగుపై నిరంతరం ఆదివాసీలతో గొడవ పడింది. వాళ్లు రిజర్వ్ ఫారెస్ట్ విధానాన్ని తెచ్చారు. సరిహద్దులు నిర్ణయించి, వాటిని దాటకూడదని నిషేధం విధించారని మా పెద్దలు మాకు చెప్పారు. ప్రజలు దాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అనేకమంది కొండరెడ్లు దానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. ఉదాహరణకు కురుకుంట్ల వెంకటసుబ్బారెడ్డి. 19వ శతాబ్దంలో 7 నెలలపాటు తిరుగుబాటు చేసినట్లు మేము విన్నాము. చద్దూరు, తుటిగుంట మధ్య ప్రయాణించే బ్రిటిష్ దళాలకు నిత్యావసర సరుకుల సరఫరాను సుబ్బారెడ్డి నిలువరించారు. చివరికి సుబ్బారెడ్డిని అతని సహచరులను పట్టుకుని పోలవరం దగ్గర, బుట్టాయిగూడెం దగ్గర కాల్చి చంపేశారు. వేట్ల సుబ్బారెడ్డిని పోలవరంలో కాల్చి చంపారు. జమిందారీ ఎస్టేట్లు ఏర్పడి పోలవరం గిరిజనేతరుల చేతుల్లోకి పోయేంతవరకు రెడ్డి పోలవరంకు కొండరెడ్లు నాయకులు".

ఈ సంఘటనలలో ఒక దానిని గూర్చి వలస పాలనాకాలం నాటి గెజిటర్లో ఈ విధంగా వ్రాశారు. "ఇటీవల కాలం వరకు ఈ ప్రాంతంలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు యొక్క భయంకరమైన జ్ఞాపకం ఏమంటే 1858 తిరుగుబాటు నాయకులైన సుబ్బారెడ్డి, కొమ్మిరెడ్డిలను ఉరితీయడం". ఇక్కడికి సమీపంలోని కొరుటూరులో సుబ్బారెడ్డి వారసులు ఇప్పటికీ జీవించే వున్నారు.

ఇల్లా రామిరెడ్డి ఇంకా ఇలా చెప్పారు : "19వ శతాబ్దంలో ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు తాము త్రాగడానికి చేసుకున్న విప్పసారా, కల్లుపై పన్ను కట్టేవారు. దీన్ని చిగురు పన్ను అనేవారు. రిజర్వ్ ఫారెస్ట్ నుండి ఇళ్ళు కట్టుకోవడానికి, వంటకోసం కలప తెచ్చుకోనిచ్చేవారు కాదు. తెచ్చుకుంటే మాపై కేసులు పెట్టేవారు. కేసుల కోసం మేము కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగాల్సి వచ్చేది. రిజర్వ్ ఫారెస్ట్ అంటే ఆదివాసులకు అడవులను అందుబాటులో లేకుండా చేయడమే".

## మద్రాస్ ఫారెస్టు చట్టం – 1883

1877లో డాక్టర్ బ్రాండిష్ అనే ప్రభుత్వ సలహాదారు, ఆదివాసీలు విచక్షణారహితంగా అడవులు నరికి, పోడుసాగు చేస్తూ, వంటకు కలప వాడుతూ, పశువులను మేపుతూ అడవుల్ని నాశనం చేస్తున్నారు. కనుక ఒక అటవీ విధానం అవసరం. అందుకోసం విస్తృతమైన అటవీ ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటిస్తూ చట్టం తేవాలని ప్రభుత్వానికి సలహా ఇచ్చారు. దీని ఫలితంగా 1883 జనవరిలో మద్రాస్ ఫారెస్ట్ చట్టం వచ్చింది. ఈ చట్టం ద్వారా 1891–1900 మధ్య కాలంలో అనేక అటవీ ప్రాంతాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించారు. కొండపోడు సాగుకు ఒక రూపాయి పన్ను వసూలు చేసేవారు. గతంలో మేము రెండు అణాలు చెల్లించేవారం. మా భూములపై మేము వ్యవసాయ కూలీలుగా మారాము. మేము కొండ పోడుసాగు చేస్తే మమ్ములను అటవీశాఖ అధికారులు వేధించేవారు". స్వాతంత్ర్యానంతరం కూడా ఈ విధానాన్ని కొనసాగించారని రామిరెడ్డి చెప్పారు.

## ఈ నాటి పరిస్థితి

ప్రస్తుత పరిస్థితి గురించి రామిరెడ్డి ఇలా అన్నారు. మాకు ఆర్ అండ్ ఆర్ కాలనీలు అవసరంలేదు. మాకు సాగు చేసుకోవడానికి భూమి కావాలి. ఆ భూమిపై యాజమాన్య పట్టాలు కావాలి. బ్రతకటానికి తిండి లేకుండా కాలనీలు ఎందుకు? మా ఇళ్ళల్లో ఇప్పుడు మాకు, మా పశువులకు, కోళ్లకు, మేకలు, గొర్రెలు, అన్నింటికీ సరిపోయినంత స్థలం ఉంది. నగరాల్లో ఉండే మురికివాడల వంటి ప్రభుత్వ కాలనీలు మాకెందుకు? ఆయుధాలు లేకుండా శాంతియుతంగా చాలాకాలం పోరాడాము. మా కోసం చేసిన చట్టాలను అమలుచేయాలని మేము కోరుకుంటున్నాము".

ఒకరకంగా డ్యాం అనివార్యమైతే బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఆదివాసీలు జరిపిన పోరాట పద్ధతులకు ప్రభుత్వం తిరిగి వారిని నెడుతున్నది. ఆదివాసీల సొంతమైన, చట్టవిరుద్ధంగా అగ్రకులాల చేతుల్లోకి వెళ్ళిన భూములను తిరిగి తమకే కావాలని ఆదివాసుల చేస్తున్న డిమాండ్ మరియు నష్టపరిహారం కోసం చేస్తున్న డిమాండ్ త్రిశంకు స్వర్గంలో ఉన్నాయి. ఆదివాసీల పోరాటం దయనీయ స్థితికి దిగజారింది. ఆదివాసీలకు జీవనాధారమైన సాగుభూములు, అడవులు మొదలగు వాటిని గౌరవంగా అడగడానికి బదులు ప్రభుత్వం తమకే వాటిపై హక్కు ఉన్నట్లు అధికారికంగా నిర్ణయిస్తున్నది.

మాది ముత్తెమ్మ నాతో మాట్లాడుతూ ఇలా అన్నారు : "ఇది ఏజెన్సీ. ఇక్కడ మాకు అన్నీ ఉన్నాయి. కేవలం ఉప్పు కొనుక్కుంటే చాలు. అది మా గ్రామ సంతలో దొరుకుతుంది. మేము మైదాన ప్రాంతాల్లో బతకలేము. అక్కడ కూరగాయలు, చింతపండు, ఆకుకూరలు, పండ్లు, అన్నీ కొనుక్కోవాలి. వాళ్ళు ఇల్లు కడతారంట. ఎక్కడ కడతారో చెప్పరు. మేము చెబితే కడతారంట. సామర్లకోట, తుని నుండి గిరిజనేతరులు మొదట ఇక్కడకు వచ్చారు. ఇక్కడ షాపులు

పెట్టారు. తరువాత వడ్డీ వ్యాపారులుగా మారారు. చిన్న చిన్న అప్పులు ఇచ్చి, అవి తీర్చలేదని మా భూములు లాగేసుకున్నారు. శివయ్యపాత్రుడు మా వాళ్ళను భోజనానికి పిలిచాడు. భోజనం పెట్టినందుకు బదులుగా 15 ఎకరాల భూమిని లాగేసుకున్నాడు. మెల్లగా 300 ఎకరాల భూస్వామి అయ్యాడు. నెలకు పదికి, పరక్కి భూస్వాముల భూముల్లో పనిచేయాల్సిన దుస్థితికి కొండరెడ్లు నెట్టబడ్డారు. ఆ భూస్వామి, వడ్డీ వ్యాపారి కూడా అయితే అతనికి చాకిరీ కూడా ఉచితంగా చేయాలి."

ముత్తెమ్మ వ్యక్తిగతంగానూ, రాజకీయంగానూ, చారిత్రకంగానూ ప్రాధాన్యత గల మూడు అంశాలను గూర్చి మాట్లాడింది. అంటే డ్యామ్ వల్ల మునిగిపోతున్న ప్రాంతం గూర్చి, గ్రామం గూర్చి, ఆర్థిక నిర్మాణాల గూర్చి చెప్పింది. ఆమె మాటల్లో అక్కడికి (గ్రామం ఖాళీ చేసి) వెళ్ళడము, ఇక్కడ (ఆదివాసీ ప్రాంతంలో) ఉండటము అనే మాటలు కూడా వచ్చాయి. అయితే సాపేక్షంగా చూసినప్పుడు అక్కడికి వెళ్లి, వారితో కలిసి బ్రతకడంకంటే ఇక్కడ జీవించడమే మెరుగని అభిప్రాయపడింది. కొండమొదలు చరిత్రలో ప్రతిఘటనతో పాటు గుర్తింపును, గౌరవాన్ని, తాము నివసిస్తున్న వ్యవస్థనే నిలబెట్టుకోవాలనే తపన కూడా ప్రజల్లో బలీయంగా ఉంది. ఒకవైపు ప్రభుత్వం నుండి వచ్చే తీవ్ర ఒత్తిడి, రెండోవైపు అంతర్గతంగా పునరావాసం పొందుదామనే ఆలోచన కారణంగా, స్వాతంత్ర్యానంతరం కొండమొదలు ఆదివాసీలు ప్రభుత్వానికి పెట్టుకునే పిటీషన్లలో భాష మార్చుకోవాలనే ఒత్తిడికి గురయ్యారు. ఎంతో దూరం కాకపోయినా, నదికి ఆవలి వైపునే అయినా కుల సమాజంతో కలిసిపోవాలనే ఒత్తిడి పరిస్థితులలో ఆదివాసీల వ్యక్తీకరణలు మార్పులకు గురయ్యాయి. అయినప్పటికీ వారి ప్రాంతం పట్ల వారికి స్పృహ పెరిగిందే తప్ప తగ్గలేదు. రాజమండ్రి వద్ద ఆర్థర్ కాటన్ ఆనకట్ట నిర్మాణం వల్ల పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. వలసవాదం, కులము, స్వాతంత్ర్యానంతర అభివృద్ధి ఆర్థిక విధానాలు భూమిపట్ల ఆపేక్షను మరింత పెంచాయి. ఇల్లా రామిరెడ్డి ఇలా అన్నారు. "ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కాలంలో భూమిపై గిరిజనేతరుల యాజమాన్యం కొనసాగింది. మేము బొంగులు ఏరుకుంటూ, రోజు కూలీలుగా అతి తక్కువ సంపాదనతో బ్రతకాల్సి వచ్చింది".

## గిరిజన రైతాంగ ఉద్యమం : సిపిఐ(ఎం-ఎల్)

సిపిఐ(ఎం-ఎల్) ప్రచురించిన పుస్తకంలో 1969 గిరిజన రైతాంగ ఉద్యమం గురించి రికార్డ్ చేశారు. దాంతోపాటే కమ్యూనిస్టుల మధ్య, కమ్యూనిస్టు విప్లవకారుల మధ్య ఉన్న సైద్ధాంతిక విభేదాల గురించి కూడా రికార్డ్ చేశారు. ఆ విషయాలను నా మాటల్లో చెప్తాను.

"కామ్రేడ్స్, మేము పంపుతున్న ఈ నివేదిక తూర్పు గోదావరి జిల్లా ఏజెన్సీ ఉద్యమంపై కొండమొదలు ప్రాంతానికి చెందిన ఒకే ఒక నివేదిక. కొండమొదలు ఉద్యమం భూమి స్వాధీనపరచుకునే స్థాయికి వచ్చింది. భూస్వాములను, ప్రభుత్వ యంత్రాంగాన్ని ధిక్కరించి ఉవ్వెత్తున తరలి భూములను ఆదివాసీలు స్వాధీనపర్చుకున్నారు. గతంలో భూస్వాములు ఆక్రమించుకున్న పంటలను తిరిగి ప్రజలు స్వాధీనపర్చుకున్నారు. ఇప్పటివరకు దున్నని భూములను దున్ని విత్తనాలు వేశారు. 1969లో ఆదివాసీలు వేసిన పంటలను నాశనం చేయడానికి భూస్వాములు పూనుకున్నప్పుడు ఆదివాసీలు వ్యవస్థీకృతంగా నిలబడి ప్రతిఘటించారు. భూస్వాములు తోక ముడిచారు. ఆ వెంటనే పోలీసులు రంగప్రవేశం చేశారు. కాని ప్రజలు, పార్టీ సలహా ప్రకారం, అడవుల్లోకి వెళ్లి దాక్కున్నారు. దిక్కుతోచని పోలీసులు ప్రజలను చర్చలకు పిలిచారు. నలుగురైదుగురు పెద్దవారు చర్చలో పాల్గొన్నారు. పోలీసులు తిరిగి వెళ్ళిపోయారు".

ఏ.పీ.ఆర్.సి.సి. రాష్ట్ర కమిటీ తరపున వి. రామలింగాచారి ఈ ముందుమాట రాశారు. "శ్రీకాకుళంజిల్లా, పార్వతీపురంలో ఆదివాసీ ఉద్యమం వర్గపోరాటంగా పురోగమిస్తున్న సమయంలో తూర్పుగోదావరి జిల్లా గిరిజన సంఘ నిర్మాణం ప్రారంభమైంది. ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఒక సమగ్ర ఆలోచనతో రాష్ట్రకమిటీ తీసుకున్న చర్యల్లో భాగంగానే కొండమొదలులో కార్యక్రమాలు మొదలయ్యాయి. గోదావరి జిల్లాలోని కొండమొదలు ప్రాంతంలో పనిచేయడానికి కామ్రేడ్ సింహాద్రి సుబ్బారెడ్డిని ఆర్గనైజర్‌గా పంపారు. 1970 నవంబర్ - డిసెంబర్ నెలలలో సికింద్రాబాద్ జైలులో ఉన్న కాలంలో మేము ప్రచురిస్తున్న ఈ నివేదికను ఆయనే వ్రాశారు".

## కొండమొదలు ఆదివాసి రైతాంగ ఉద్యమం నివేదిక

అటవీ అధికారుల వేధింపులు, భూస్వాముల, వడ్డీ వ్యాపారుల దోపిడీ ఇక్కడ ప్రధాన సమస్య. ఇప్పటివరకు అటవీ అధికారుల కేసులకు భయపడే ఆదివాసీలు, గిరిజన సంఘం ఇచ్చిన చైతన్యంతో ధైర్యాన్ని ప్రదర్శిస్తూ అధికారులకే వార్నింగ్‌లు ఇచ్చారు. పోడుసాగు చట్ట వ్యతిరేకమని ఒకవైపు అటవీ అధికారులు మరోవైపు చట్టప్రకారం పన్నులు చెల్లించాలని రెవెన్యూ అధికారులు ఆదివాసీలను వేధించేవారు. 1969 ఉద్యమ కాలం తర్వాత ప్రతిఘటన పద్ధతులపై పార్టీలో విభేదాలు పెరిగాయి.

విప్లవమార్గంలోనే ప్రతిఘటించాలనే పద్ధతిని ఆదివాసీలు ఎందుకు ఎంచుకున్నారు? వామపక్షాలలోని భిన్న లైన్స్‌కి చెందినవారు, కార్యకర్తలు, మేధావుల వాదనలు క్యాజువాలిటీ చుట్టూ తిరిగాయి. ఆర్థిక వెనుకబాటుతనం, పేదరికం, వనరులను ఇతరులు స్వాధీన పరచుకోవడమే విప్లవమార్గాన్ని ఎంచుకోవడానికి కారణాలు. కానీ, నేను మరోచోట వాదించినట్లుగా బయటనుంచి వచ్చిన కేంద్రీకృత నాయకత్వం ఈ సమూహాల కోసం పనిచేయకపోతే ఉద్యమం నిలబడగలిగేది కాదు. విప్లవకారుల రాకపూర్వం నుండి ఆదివాసీలలో ఉన్న సామాజిక యాజమాన్య భావన ఉద్యమానికి పునాదిగా ఉంది.

కొన్ని ప్రధాన స్రవంతి మీడియా చర్చలు ఆదివాసి తెగలు శాశ్వతంగా దోపిడీకి అనుకూలమని, వారు స్వయంగా ప్రతిఘటన పద్ధతులు గూర్చి ఆలోచించలేరని, అందువల్ల వారు శాశ్వతంగా దోపిడీ వర్గాలకు, విప్లవకారులకు మధ్య నలిగిపోతున్నారని తెలుపుతున్నాయి. నది, అడవులు విప్లవంలో ఉపయోగపడిన తీరు, వలస పాలన తరువాత భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపిన గెరిల్లా పోరాటాలు ఉద్యమ చరిత్ర రచనలో చోటుచేసుకోకపోవడంవల్లే ఈ పరిస్థితి. విప్లవోద్యమాన్ని ముందుకు నడిపించడంలో వీటి పాత్రను వాదనలో ముందుకు తేవాలి.

ఇల్లా రామిరెడ్డితో మాట్లాడుతూ "వన్యప్రాణులపై, ప్రకృతిపై డ్యాం యొక్క ప్రభావం గూర్చి మీరు రాసే పిటిషన్లో ఎందుకు రావడంలేదు,

రాజకీయ చర్చలు ఎందుకు చోటుచేసుకోవడం లేదు" అని అడిగాను. ఆయన, "అడవులు, జంతువులు, పక్షులు కొండరెడ్ల జీవితంలో భాగం. వాటిని మా నుండి విడదీసుకోలేము. డ్యాంకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నామంటే ఇవన్నీ అందులో భాగమే అని భావిస్తాము. అవన్నీ వేరు అనే భావన పట్టణ మధ్యతరగతి వారిది. ప్రతి పండుకు, చెట్టుకు, కాయకు మేం పండగ చేసుకుంటాం. మేము అరుదుగా వేటాడతాం. అదే సమయంలో మేము వాటిని ఆరాధిస్తాం. అవి మా జీవితాలలో భాగం కనుక వాటిని గుర్చి ప్రత్యేకంగా వ్రాయాలని అవసరంలేదు," అన్నారు. కనుక కొండరెడ్లు మరియు ఇతర ఆదివాసీ తెగలు, దళితులకు సంబంధించినంతరవకు అడవి, నది వారిలో భాగమే.

కాలక్రమంలో సిద్ధాంతపరంగాను, అవగాహనపరంగాను, కొండమొదలులో వ్యవహరించిన మార్గాలను గూర్చి పునరాలోచన చేయవలసిన ఆవశ్యకత ఉంది. ఈ సిద్ధాంతాలు వారి ప్రాపంచిక దృక్పథాన్ని మార్చాయి. నిరంతరం బయట ప్రపంచంతో, అగ్రకులాలతోనూ, రాజ్యంతోను వామపక్ష ఉద్యమపరిధిలోనైనా జరిపిన మధ్యవర్తిత్వాన్ని గమనంలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రామిరెడ్డి "మార్పు తప్పదు" అంటున్నారు. గతంలోవలే గాక వారిప్పుడు అడవులకంటే వ్యవసాయంపై ఎక్కువ ఆధారపడుతున్నారు. కొండమొదలు పంచాయితీ ఎక్కువ సంఖ్యలో కోర్టులో పిటిషన్లు వేసింది. వివిధ కాలాలలో ఇక్కడి ప్రజలను అరెస్టులు చేశారు. కోర్టులు, జైళ్ళు వారి జీవితాల్లో విడదీయరాని భాగాలుగా చేశారు. 1982 నవంబర్ 29న జరిగిన పోలీసు కాల్పుల్లో ఇద్దరు కొండరెడ్ల పురుషులు చనిపోయారు, అనేకమంది గాయపడ్డారు. అప్పటికి ఇతరులు ఆక్రమించిన 426 ఎకరాల భూమిని పునః స్వాధీనానికి ఆదివాసీలు ప్రయత్నిస్తున్నారు. 1985 నాటికి 150 ఎకరాల బంజరు భూమిని వారు సాగుచేయడం ప్రారంభించారు. సాగుచేసిన భూమిని చట్టబద్ధం చేయించడానికి సంవత్సరాల తరబడి ప్రయత్నించారు. కానీ జరగలేదు. పోలవరం డ్యామ్‌కి వ్యతిరేకంగా స్పిల్ వే ప్రాంతంలో మొదట నిరసన ప్రదర్శనలు జరిగాయి. అరెస్టులు చేశారు. రాజకీయ విభేదాలు, రాజకీయ మార్పులు రావడంతో ఉద్యమం గణనీయంగా తగ్గిపోయింది కానీ కొండమొదలులో ప్రదర్శనలు, నిరసనలు, ఎన్నికల్లో పోటీచేయడం ద్వారా, కోర్టుల ద్వారా నిలకడగా ప్రతిఘటన సాగింది. వారి పిటీషన్లు విస్థాపనను నిలువరించాయి. ఇటీవల వరుసగా వేసిన పిటిషన్లలో ఒక దానిని నేను వివరిస్తాను.

## చేయని తీర్మానం చేసినట్లు ప్రభుత్వ బుకాయింపు

పోలవరం డ్యామ్‌కి భూమిని సేకరించడానికి అనుమతిస్తూ కొండమొదలు గ్రామపంచాయితీ ఒక తీర్మానం చేసిందనే కట్టుకథతో ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ వార్త రావడంతో కొండమొదలు గ్రామ సర్పంచ్ వేట్ల విజయ, గ్రామ కార్యదర్శి సంతకంతో భూమిని సేకరించడానికి వీల్లేదని అట్టి తీర్మానం మా గ్రామ పంచాయితీ చేయలేదని, అభ్యంతరం తెలియజేస్తూ పోలవరం డ్యాం స్పెషల్ కలెక్టర్‌కి ఒక లేఖ రాశారు. ఆ లేఖలో వెంటనే జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ లేఖకు జవాబుగా స్పెషల్ కలెక్టర్ 1-6-2017న ఒక లేఖ రాశారు. (Vide Ref No. 181/2013) అందులో కొండమొదలు గ్రామపంచాయితీ 16-7-2013న పోలవరం డ్యాంకు భూమినిస్తూ తీర్మానం చేసిందని, దానికి సంబంధించిన వార్త ఈనాడు పేపర్‌లో 15-2-2014న మరియు 9-4-2017న వచ్చాయని వ్రాశారు. అదేవిధంగా గ్రామపంచాయితీకి అభ్యంతరం తెలిపే సమయం కూడా ముగిసిపోయిందని రాశారు. దీంతో సర్పంచ్ విజయ పి ఈ ఎస్ ఎ కార్యదర్శి తాటి బుల్లెబ్బాయి హైకోర్టులో పిటిషన్ వేశారు. (డబ్ల్యు పి.నెం. 33452/2015) దీనిపై హైకోర్టు విచారించి, తీర్పునిస్తూ ప్రభుత్వ చర్యలు కాలానుగుణంగా వచ్చిన వివిధ చట్టాలకు వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పింది. తిరిగి గ్రామ పంచాయితీ, మండల పరిషత్తు అనుమతులను తాజాగా పొందాలని ఆదేశించింది. కనుక భూసేకరణను వెంటనే నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీని ఫలితంగా భూసేకరణ అధికారులు దిగివచ్చి మనం ఒక అవగాహన కుదుర్చుకుందామని, మీరు మీ పిటిషన్‌ను ఉపసంహరించుకోండని ఆదివాసులను కోరారు. ఫలితంగా షరతులతో కూడిన ఒక అవగాహన ఒప్పందం జరిగింది. కొండమొదలు గ్రామ పంచాయితీ తరపున గ్రామ సర్పంచ్ విజయ, ఏపీ రైతుకూలీ సంఘం, ఇల్లా రామిరెడ్డి, మరికొంతమందీ, ప్రభుత్వం తరపున భూసేకరణ స్పెషల్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, దేవీపట్నం మండల తహసీల్దార్ పాల్గొన్నారు.

ఒప్పందంలోని 6 షరతులలో ఒకటి భూ కొనుగోలు పథకం క్రింద కొండమొదలు గ్రామంలో విస్తాపనకు గురి అవుతున్న 440 మంది ప్రజలకు భూమిని ఇవ్వడం కోసం గంగవరం మండలంలోని భుజబండా, జియ్యంపాలెం, జగంపాలెం, రాయవరం, నేలదోనెలపల్లె గ్రామాలలో 426 ఎకరాలు, రంపచోడవరం మండలంలోని ఫోక్స్‌పేట, ఎర్రంపాలెంలో (భూ విస్తీర్ణం చెప్పలేదు) ముసురుమిల్లి ప్రాజెక్టు కెనాల్ కింద కొనుగోలు చేయాలి.

ఉజ్జాయింపుగా లెక్కలు వేసినా పై షరతు ప్రకారం కొనుగోలు చేసే భూమి ఆదివాసులు పోగొట్టుకునే భూములకు నష్టపరిహారంగా సరిపోదు. 426 ఎకరాలను మినహాయిస్తే మిగిలిన భూములన్నీ చట్టపరమైన వివాదాలకు అతీతమైనవి కాదు. ఆదివాసుల అనుభవాలు ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి. అంతేగాక పోడు సాగు భూములకు నష్టపరిహారంగూర్చిన ప్రస్తావన అవగాహనాపత్రంలో (యంఓయు) ఎక్కడా లేదు. ఎంఓయు ప్రకారం ఆ భూకొనుగోలు కమిటీకి ఇద్దరు వ్యక్తులను ఎంపిక చేయాలి. ఈ ఇద్దరిని ఎవరు, ఎలా ఎంపిక చేస్తారు అనే విషయాన్ని ఎంఓయులో ప్రస్తావించలేదు. ఇవిగాక బంజరు సాగుదారులకు నష్టపరిహారం ఇవ్వాలి. ఎంఓయుకు అనుగుణంగా హైకోర్టులో ఒక అఫిడవిట్‌ను ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి దాఖలు చేశారు. కొండమొదలు సర్పంచ్ వేసిన పిటిషన్‌ని వాసప్ తీసుకున్నారు. ఇదంతా జరిగేటప్పటికి అధికారంలో ఉన్న ప్రభుత్వం మారిపోయింది. ప్రభుత్వంతోపాటు అధికారులు మారిపోయారు. దీని ఫలితంగా ప్రతిష్టంభన తిరిగి తలెత్తింది. ఈ పరిస్థితులలో ఎంఓయు అమలు పరచాలని డిమాండ్ చేస్తూ 2020 నవంబర్ 30, డిసెంబర్ 1వ తేదీలలో, 1982 నాటి అమరత్వాన్ని స్మరించుకుంటూ, ఆ సంఘటన జరిగిన తేదీన, మూడు వేలమంది ఆదివాసీలు రంపచోడవరం ఐటిడిఏ

ఆఫీస్ ముందు మాస్కులు ధరించి కోవిడ్ పాండమిక్‌ని ధిక్కరిస్తూ పెద్దఎత్తున ధర్నా చేశారు.

**ఆదివాసీలు : వారి రాజకీయ అవగాహన**

ఆదివాసీల చరిత్రను వ్రాసేటప్పుడు వారిపై అధికారం చెలాయించడం కోసం వారికి ఒక రాజకీయ అవగాహన వుందనే విషయాన్ని మానవశాస్త్రపరంగా నిరాకరించారు. ఒక రాజకీయ సిద్ధాంతం వారిదైన ప్రాపంచిక దృక్పథానికి దగ్గరగా ఉన్నా, లేకపోయినా, ఆ రాజకీయ సిద్ధాంతాన్ని ఎంపిక చేసుకునే సామర్థ్యం లేక విభేదించే సామర్థ్యము వారికి ఉంటుందనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. రాజ్యము ఆదివాసీ ప్రాంతాలను తన స్వీయపరిపాలన, రాజకీయ, ఆర్థిక, తదితర ఆలోచనల నుండి చూస్తుంది తప్ప ఆదివాసీల స్వీయ జీవన విధానము నుండి అంటే వారు ఎవరు, ఎలా ఉన్నారు, ఎలా జీవిస్తున్నారు, వారిని ఎలా చూడాలి అనే దృక్పథంతో ఆలోచన చేయడంలేదు. ఆదివాసులు తమను తాము ఎలా చెప్పుకుంటున్నారు, ఎలా వ్యక్తీకరించుకుంటున్నారు అనేది చాలా సంక్లిష్టమైన ప్రశ్న. ఎందుకంటే శతాబ్దాల కాలంలో వారి జీవనం గణనీయంగా మారింది. అంతేగాక వారిని గూర్చిన వివరణ ఆ సమూహాల నుండి రావడంలేదు. ఈ సమస్య ఎల్లప్పుడు ఉందని అనలేము. ఎందువల్లనంటే ఈ సమాజంలోకి బయటివారు వచ్చారు, వీళ్ళు బయటికి వెళ్ళారు, వివిధ రకాల జాతీయతను వీరు కలుపుకున్నారు, ఒక ఆదివాసీ తాను ఒక చారిత్రక పరిస్థితులలో జీవించడానికి, అతను రాజ్యం సృష్టించిన మార్కెట్ మనిషిగా మారటంతో పోల్చి చూస్తే 'ఇక్కడ' 'అక్కడ' అనే విషయాలు వస్తాయి. 'అక్కడ' అంటే భూమికి దూరమైన ఆదివాసి. 'ఇక్కడ' అంటే తాను నివసిస్తున్న ప్రాంతానికి చెందిన ఆదివాసి. 'ఇక్కడ'లోనే వారు బ్రతుకుతారు, చస్తారు. పోలవరం ప్రాజెక్టు కోసం అధికారులు 'ఇక్కడ'ను గూర్చి చేస్తున్న ప్రచారాన్ని నేను పదే పదే విన్నాను. వారి ఉద్దేశ్యంలో ఇక్కడ అంటే ఇక్కడ మీరు ఏంచేస్తారు కనుక ఇక్కడ నుండి బయటికి వెళ్ళండి అని అర్థం. ఇక్కడ మిమ్మ ఉద్ధరిస్తామని ఆదివాసుల కోసం తెచ్చిన ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. కొండమొదలు నుండి తమ అవసరాల కోసం రంపచోడవరం వెళ్లడానికి పడే కష్టాలలో నాటికీ, నేటికీ ఎట్టి మార్పులేదు. యథాతథస్థితి అనేది సాధారణంగా గొప్ప భారతీయ సంప్రదాయం. ప్రభుత్వం, దాని ఏజెంట్లు ఆదివాసీల ప్రాంతాలపై వారి శవాలపై ఆటలాడుకున్నారు. వారి దాడి భౌతికంగా కంటే సాంస్కృతికమైనది. అగ్రకులాలు తమ ఆధిపత్యాన్ని స్థిరీకరించు కోవడానికి చేసిన దాడులకు ఆదివాసీలు నిరంతరం గురయ్యారు. ఆధిపత్య స్థిరీకరణ, ఆధునికత సాధన కోసమంటూ రాజ్యాంగపరమైన చట్టపరమైన భాష ద్వారా వ్యక్తీకరించారు.

ఆదివాసీలు, వారి పెంపుడు కుక్కలు వెంటరాగా, ఉల్లంగి పిట్టలు నిరాటంకంగా ఎగురుతూ ఉండగా, పెంపుడు జంతువులు మోరలు ఎగబెట్టి దూరం నుండి చూస్తూ ఉండగా, అందమైన పచ్చటి పొలాల్లో వారు, తాము ఇప్పటికీ నమ్ముతూ వున్న వామపక్ష సిద్ధాంతాలకు చెందిన ఎర్రజెండాలు చేతపట్టి చేస్తున్న దీర్ఘయాత్ర వెంట నడుస్తూ నేను చివరిసారిగా 2016లో వారిని ఫోటోలు తీశాను, రికార్డ్ చేశాను. ఇదంతా గతం యొక్క కొనసాగింపు అనిపించింది. ప్రస్తుతం కొన్ని మార్పులు జరిగి ఉండవచ్చు. కానీ ఇది అసంపూర్ణ చరిత్ర. బాధిత గతాన్ని గూర్చిన చరిత్ర కాదు. భిన్నమైన భవిష్యత్తు కోసం జరగబోయే చరిత్ర. ✦

## ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

### 1992 ఏప్రియల్ - సంపుటి : 15 - సంచిక : 8

**జ్యోతిరావు** పూలే – డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ల ముఖచిత్రంతో వెలువడిన ఈ సంచికలో "ఏ మనుధర్మశాస్త్రపు నీతుల్ని డా॥ అంబేద్కర్ తీవ్రంగా ఖండించి, వ్యతిరేకించాడో అటువంటి మనువు పేరుతో ఆయన్ని 'అభినవ మనువు' లాంటి బిరుదులిచ్చి బ్రాహ్మణీకరించే సంస్కృతి నుండి దళితులూ, ప్రజాస్వామికవాదులూ జాగ్రత్తవహించాలి అని తెలియచేస్తూ 'దళితుల పోరాటం – నూతన ప్రజాస్వామిక విప్లవంలో అంతర్భాగం' – అనే సంపాదకీయం రాశారు. ప్రసాద్ రాసిన "జోతిరావు పూలే – డా॥ అంబేద్కర్", ఎం. నిర్మల రాసిన 'అలెక్స్ హేలీ సంస్మరణ', డా॥ సంపత్‌కుమార్ రాసిన 'మతోన్మాదంపై ఉరిమిన కళాకాహళి', ధారావాహికగా 'సంస్కృతి : ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమ స్వరూప స్వభావాలు" అనే వ్యాసాలను ప్రచురించారు. పంజాబ్ సంచిక కోసం సేకరించగా మిగిలిన రచనలను దర్బర్ సింగ్ ఖట్కర్ రాసిన 'ఉత్తరం రాస్తూ ఉండు' కవిత, సిమరన్ జీత్‌కౌర్ మహిల్ రాసిన 'భయోత్పాతం నీడలో', నూర్ సంతోఖ్‌పురి రాసిన 'ఎన్‌కౌంటర్', పుప్పాల కృష్ణమూర్తి రాసిన 'సెన్స్ ఆర్ బోర్డు' గల్పికలను, జగతార్ రాసిన 'ఉచిత సలహా', పి. చంద్రశేఖర్ అజాద్ రాసిన 'ఓ వేకువ కోసం – ఓ వెన్నెల కోసం', కందుకూరి శ్రీరాములు రాసిన 'గోదారి రహదారి' కవితలను ప్రచురించారు. హర్బన్స్ ముఖియా రాసిన 'పంజాబు సమస్య (ఒక అవగాహన), జూలూరి గౌరీశంకర్ చేసిన 'ఇంకా వుంది' పుస్తక సమీక్ష, 'సాహిత్యంలో క్షుద్రం అక్షుద్రం అనేవి లేవా?' అనే స్పందనలతో పాటు గోదావరిఖని రాష్ట్ర సదస్సు నివేదిక, కాకరాలగారు చేసిన ప్రారంభోపన్యాసం, హరి పురుషోత్తమరావు ప్రసంగవ్యాసం – 'భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతి; సినిమా', నారాయణస్వామి చేసిన ప్రసంగవ్యాసం, 'సామ్రాజ్యవాద సంస్కృతి : విద్య', అరుణోదయ రామారావు రాసిన 'సాంస్కృతికోద్యమ కర్తవ్యాలు', రాష్ట్ర సదస్సు తీర్మానాలు, పిల్లల ప్రపంచం, పి. చంద్రశేఖర్ 'చెప్పక తప్పదు (వాయిస్ ఆఫ్ చిన్ని), చైతన్యవాహినులను ప్రచురించారు. తిరుపతిలో కాంగ్రెస్ 79వ ప్లీనరీ సెషన్స్ సందర్భంగా : 1908లో మద్రాస్ కాంగ్రెస్ మీద గురజాడ అప్పారావు రాసిన వ్యంగ్య కవిత 'ప్సామవేదం', 2, 3 కవరు పేజీల్లో, వెంకటయ్య రాసిన జనంపాట 'నీ పాట ఎటుబోయెరో'ను 4వ కవరు పేజీలో ప్రచురించారు. 1/8 డెమ్మీలో 72 పుటలు. వెల : రూ. 4/– ✦




# అర సత్యానికి అరవై అబద్ధాలు జోడించి తీసిన
# 'ది కశ్మీరీ ఫైల్స్'

– **బాలాజీ** (కోల్‌కతా)

**ఐదు** రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన మర్నాడే మరో ఎన్నికల సన్నాహంలా విడుదలైంది 'ది కశ్మీర్ ఫైల్స్' సినిమా. 1990లో కశ్మీరీ పండితుల హత్యలు, వలసల నేపథ్యంలో తయారైన ఈ సినిమాను స్వయంగా ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు ప్రమోట్ చేస్తున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పన్ను రాయితీ ప్రకటించాయి. సినిమా చూడమని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు హాఫ్–డే సెలవులు మంజూరు చేశాయి. తటస్థంగా ఉండాల్సిన పోలీసులు ముస్లిం విద్వేషులుగా మారాలని వారినీ ప్రోత్సహించాయి. రామమందిర వివాదం ఎలానూ లేదు కనుక 2024 సార్వత్రిక ఎన్నికలు కశ్మీర్ కేంద్రంగా జరగబోతున్నాయా అన్న అనుమానాన్ని స్వయంగా జమ్మూ శరణార్థి శిబిరంలోని ఒక కశ్మీరీ పండితుడే వ్యక్తం చేశాడు. ఈ సినిమా దర్శకుడే కాక ప్రధాన నటీనటులంతా బిజెపి సమర్థకులు లేక పార్టీ సభ్యులు కావడం మరో విశేషం.




## సినిమా కథ

1990 కశ్మీరు లోయ సాయుధ పోరాటంతో వేడెక్కి వుంది. శ్రీనగర్ నగరంలో శివ అనే పదేళ్ల పిల్లాడు అబ్దుల్ అనే స్నేహితుడితో క్రికెట్ ఆడుతూ వుంటాడు. పక్కన రేడియోలో క్రికెట్ కామెంటరీ నడుస్తోంది. సచిన్ సెంచురీ సంగతి విని, 'సచిన్ – సచిన్' అని అరుస్తాడు ఆ పిల్లాడు. అక్కడున్న కొందరు ముస్లింలు ఆ పిల్లాడ్ని 'ఇండియన్ డాగ్' అని తిడుతూ కొడతారు. ఆరంభమే విషపూరిత క్రికెట్ నేషనలిజంతో భయం గొల్పుతుంది. శివ తాత పుష్కర్‌నాథ్ పండిత్ (అనుపమ్ ఖేర్) కశ్మీరీ పండితుడు. ఉపాధ్యాయుడే కాక సాంస్కృతిక కార్యకర్త కూడా. ఆయన కొడుకు కరణ్‌ను భారత గూఢచారిగా అనుమానించి మిలిటెంట్లు వారింటికి వస్తారు. కరణ్ బియ్యం డబ్బాలో దాక్కుంటాడు. మిలిటెంట్ల నాయకుడు ఫరూక్ మలిక్ బిట్టా. (ఫరూక్ అహ్మద్ దర్ లేదా బిట్టా కరాటే, యాసిన్ మలిక్‌ల ఆధారంగా) అతడు పుష్కర్ శిష్యుడే. బియ్యం డబ్బాపై గుళ్ల వర్షం కురిపిస్తాడు. భర్త నెత్తురుతో తడిసిన బియ్యాన్ని గర్భిణీగా వున్న అతడి భార్య శారద చేత తినిపిస్తాడు.

'రలీవ్ గలీవ్ యా చలీవ్' ("ఇస్లాంలోకి మారిపోండి, ఇక్కడ్నుంచి వెళ్లిపోండి లేదా చచ్చిపోండి") అనే నినాదాలు మార్మోగుతున్నాయి. ముస్లిం పెద్దవాళ్లే కాదు పిల్లలు కూడా హిందువుల శత్రువుల్లా ప్రవర్తిస్తున్నారు. (సినిమా ప్రకారం) వేలాది కశ్మీరీ పండితులు చనిపోగా, లక్షలాది మంది రాత్రికి రాత్రి లోయను విడిచి జమ్మూలోని శరణార్థి శిబిరాల్లో తలదాచుకున్నారు. ఆ శిబిరాల్లో వారి బాధ వర్ణనాతీతం. క్లైమాక్సులో మరో భయంకర హత్యాకాండ చూపాలి కాబట్టి శారదకు లోయలో నదీమార్గ్ అన్న చోట ఉద్యోగం దొరుకుతుంది. అక్కడికి బిట్టా తదితరులు మిలిట్రీ యూనిఫార్మ్‌లో వస్తారు. గ్రామంలోని కశ్మీరీ పండితులను వేరు చేస్తారు. శారదను అర్ధనగ్నంగా ఊరి ముందు వివస్త్రను చేయడమే కాక, రంపపు యంత్రంతో ముక్కలుగా నరికేస్తారు. (సెన్సారు వారు కళ్ళు మూసుకుని చూశారా?) పండితులందరినీ ఒకే వరుసలో నిలబెట్టి కాల్చేస్తారు. వారిలో శివ ఆఖరివాడు. వాట్సాప్ పాఠాలకు ప్రాక్టికల్ క్లాసులా ప్రేక్షకుల్లో ముస్లింల పట్ల అత్యధిక విద్వేషం కలిగేలా అదే చిన్న పిల్లాడి చావు దృశ్యంతో సినిమాను ముగిస్తాడు దర్శకుడు.

## కట్ చేస్తే...

కథ మధ్య మధ్యలో వర్తమానంలోకి వస్తూ వుంటుంది. శారద చిన్న కొడుకు కృష్ణ తాతయ్య దగ్గరే పెరుగుతాడు. తల్లిదండ్రులు ప్రమాదంలో చనిపోయారని నమ్ముతున్నాడు. అతడిప్పుడు ఢిల్లీ ఎఎన్‌యూ విద్యార్థి. అక్కడ రాధికా మెనన్ అనే తన ప్రొఫెసర్ బ్రెయిన్ వాషింగ్‌తో 'కశ్మీర్ ఆజాదీ' గురించి నినాదాలు చేస్తుంటాడు. అతడి మీద 'దేశ ద్రోహం' కేసు కూడా నడుస్తోందిట. (కన్హయ్యా కుమార్ మాదిరి!) ఎఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నాడు. తాత పుష్కర్ చనిపోతాడు. అతడి చివరి కోరిక ప్రకారం అతడి స్నేహితులతో పాటు కశ్మీర్‌లోని తన పూర్వీకుల ఇంటికి వెళ్లి, ఆ చితాభస్మాన్ని వెదజల్లాలి. ఆ స్నేహితులు ఎవరంటే – బ్రహ్మ (మిథున్ చక్రవర్తి) అనే పూర్వ ఐఏఎస్ ఆఫీసర్, విష్ణు అనే దూరదర్శన్ న్యూస్ రీడర్, డాక్టర్ మహేష్, హరి అనే డిజీపీ. వీరితో కలిసి మాట్లాడడం ద్వారా, ముఖ్యంగా బ్రహ్మ దగ్గరి పేపర్ కటింగ్స్ ఫైల్స్ ('ది కశ్మీర్ ఫైల్స్'!) ద్వారా తన తల్లిదండ్రులు, అన్నయ్య హత్యల గురించి, కశ్మీరీ పండితుల 'జాతి సంహారం' గురించీ తెలుసుకుంటాడు. ఎఎన్‌యూ ప్రెసిడెన్సియల్ స్పీచులో తను తెలుసుకున్న కశ్మీరు చరిత్రను దంచేస్తాడు. అందులో కశ్యపుడి పేరు వుంటుంది గానీ, సుదీర్ఘ రైతాంగ పోరాటాల సంగతి ఉండదు.

"నాలుగున్నర యేళ్ల పరిశ్రమ, 5 వేల గంటల రీసెర్చి, 5 వేల పేజీల డాక్యుమెంట్లు, అవి కూడా బాధితులు, ప్రత్యక్ష సాక్షుల నుండి

క్రాస్ చెక్ చేసుకుని తీసిన సినిమా" అని దర్శకుడు చెప్పుకుంటున్నాడు. కానీ మొత్తంగా చూస్తే, కల్పనల్ని వాస్తవాలుగా, పుకార్లని చరిత్రగా నమ్మించే ఐటీ సెల్ వాట్సప్ యూనివర్సిటీ దాడికి పెద్దతెర రూపమే ఈ సినిమా. ఇప్పుడు పాయింట్ల వారిగా సినిమాను వాస్తవ చరిత్రతో పోల్చి చూసుకుందాం.

## కశ్మీరీ పండితులది జాతి సంహారమా?

ఐక్యరాజ్యసమితి నిర్వచనం ప్రకారం జెనోసైడ్ అంటే 'సమూలంగా గానీ, పాక్షికంగా గానీ ఒక జాతిని భౌతికంగా నిర్మూలించే జీవిత పరిస్థితులు కల్పించడం'. అయితే వాస్తవాలు అలా వున్నాయా? పి.పి. కపూర్ అనే సమాచార హక్కు కార్యకర్త అడిగిన ప్రశ్నకు శ్రీనగర్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇచ్చిన సమాధానం ప్రకారం 1990 ఘర్షణల్లో 89 కశ్మీరీ పండితులు చనిపోతే, ఇతర మతస్తులు 1635 చనిపోయారు. ప్రభుత్వం ఇచ్చిన లెక్క వద్దనుకున్నా పండితుల హక్కుల కోసం పనిచేస్తున్న 'కశ్మీరీ పండిట్ సంఘర్ష్ సమితి' లెక్క ప్రకారం 1990 నుండి 20 ఏళ్ల కాలంలో చనిపోయిన పండితులు 650 మాత్రమే. శిబిరాల్లో తలదాచుకున్న పండితులకు జగ్మోహన్ పునరావాసం ఏర్పాటు చేయలేక, సరియైన వసతులు కల్పించలేక ఆ తర్వాతి కాలంలో వేల మంది పండితులు జమ్మూను విడిచి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ రోజుకీ కశ్మీరులో ఎనిమిది వందల కుటుంబాలు ఉంటున్నాయి. పరివారానికి ఐదుగురు లెక్క వేసుకున్నా నాలుగు వేల మందికి పైగా పండితులు అక్కడ నివసిస్తూనే ఉన్నారు! ఆనాడు కశ్మీరీ పండితుల కంటే చాలా రెట్లు ఎక్కువమంది ముస్లింలే చనిపోయారు.

## వలసలకు పూర్వాపరాల చర్చే లేదు!

కొన్ని షరతులతో భారతదేశంలో విలీనమైన కశ్మీరులో, షేక్ అబ్దుల్లాను జైల్లో పెట్టడం దగ్గర్నుంచి, కశ్మీరీల కనీసపు కోర్కెలు భగ్నమైన ఎన్నో చారిత్రిక అంశాలు ఉన్నాయి. (ప్లెబిసైటు విషయం వదిలేద్దాం.) ఫరూక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్సుతో కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకున్న తర్వాత జెకెఎల్ఎఫ్‌తో కలిపి చాలా కశ్మీరు పార్టీలు 'ముస్లిం యునైటెడ్ ఫ్రంట్'గా పోటీ చేశాయి. కానీ 1987 నాటి ఎలెక్షన్లలో భారీ రిగ్గింగు జరిగింది. ఎన్నికల్లో గెలవాల్సిన మొహమ్మద్ యూసుఫ్ షాను ఓడించి, అతడు ప్రశ్నించినందుకు ఇరవై నెలలు జైల్లో పడేయగా, అతడు విడుదలయ్యాక నేరుగా పాకిస్తాన్ అధీన కాశ్మీరుకు వెళిపోయి హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ సయ్యద్ సలాహుద్దీన్‌గా తిరిగివస్తాడు. కొందరు కశ్మీరీ యువకులు ఆయుధాన్ని ఎంచుకున్న నేపథ్యం ప్రసక్తే ఈ సినిమాలో లేదు. కశ్మీర్‌లోని అన్ని రకాల రాజకీయాలనూ ఒకే గాటకట్టి చరిత్రను ఓవర్ సింప్లిఫై చేసి చూపించారు. కశ్మీరు చరిత్ర సినిమా వాళ్లు చెప్పినంత సరళంగా వుండదు.

## జగ్మోహన్ మల్హోత్రా పాత్ర

ఎన్నికల రిగ్గింగుల కాలంలోనే కాదు, పండితుల వలసలు జరుగుతున్న కాలంలోనూ గవర్నర్‌గా వున్నవాడు జగ్మోహన్. అప్పుడు కేంద్రంలో విపి సింగ్ సంకీర్ణ ప్రభుత్వం బిజెపి మద్దతుతో మనుగడ సాగిస్తోంది. హోమ్ మంత్రి ముఫ్తీ మొహమ్మద్ కుమార్తె అపహరణ, ఆమెను విడిపించడానికి ఐదుగురు మిలిటెంట్లను విడుదల చేయడం వంటి సంఘటనలన్నీ బిజెపి మద్దతు సాగుతున్న రోజుల్లోనే జరిగాయి. 1984 ఏప్రిల్ నుండి 1989 జులై వరకూ గవర్నర్ జగ్మోహనే. మధ్యలో ఆర్నెళ్లు కె.వి.కృష్ణారావు వచ్చాక, మళ్లీ బిజెపి తన అభిమాన జగ్మోహన్‌ను గవర్నర్‌గా వేయించుకుని 1990 జనవరి 19 న లోయకు పంపింది. పరిస్థితి అర్థమై ఫరూక్ అబ్దుల్లా రాజీనామా చేశాడు. పూర్తి అధికారాలతో వచ్చిన గవర్నర్ శీతాకాలపు రాజధాని జమ్మూకు చేరిన వెంటనే పండితులకు రక్షణ కల్పిస్తామన్న హామీ ఇవ్వకుండా వాళ్లను భయపెట్టేలా రేడియో ప్రకటన చేసి, ఆర్మీని పంపించి, బస్సుల్లో జమ్మూకు తరలించాడు. లోయను విడిచి వెళ్లడం ఇష్టంలేని కొంతమంది ఆర్మీ నుంచి తప్పించుకుని ముస్లిం మిత్రుల ఇంట్లో దాక్కున సంఘటనలు కూడా చాలా వున్నాయి. జగ్మోహన్ తన రెండో హయాంలో ఆర్మీ సాయంతో గౌ కదల్ నుండి మీర్వాయిజ్ శవయాత్ర మీద కాల్పుల వరకు ఏడు కుఖ్యాత హత్యాకాండలు సాగించాడని చరిత్రకారుడు, కశ్మీరుపై విస్తృతంగా గ్రంథరచన చేసిన అశోక్ కుమార్ పాండే చెబుతున్నారు. చివరికి విపి సింగ్ అతడ్ని ఆఘమేఘాల మీద వెనక్కి పిలిపించాల్సి వచ్చింది. ఆ రోజుల్లో బిజెపి ప్రాధాన్యతలు మరో రకంగా వున్నాయి. వారు అయోధ్య కోసం రథయాత్రల్లో బిజీగా వున్నారు. ఆ యాత్ర సమన్వయకర్త స్వయానా మోదీజీ. ఈనాడు పండితుల కోసం మొసలి కన్నీళ్లు కారుస్తున్నవారు ఆనాడు వలసలు జరుగుతున్నప్పుడు ఏం చేశారు? కశ్మీరీ పండితుల పునరావాసం కోసం మన్మోహన్ సింగ్ హయాంలోనే ఎక్కువ ప్రయత్నాలు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. బిజేపీకి సినిమాను ప్రమోట్ చేయడమే పెద్ద ఘనకార్యం!

## కశ్మీరియత్

కశ్మీర్‌ది చాలా సుదీర్ఘ చరిత్ర. ఎన్నో జీవనధారల సంగమ స్థలం కశ్మీరు లోయ. సూఫీయిజం, బౌద్ధం, మతాలకతీతంగా కశ్మీరీలందరికీ ఆరాధ్యురాలైన లల్లాదేవి లేదా లాల్‌దెడ్ భావాల సమన్వయంగా ఏర్పడిన జీవన విధానమే 'కశ్మీరియత్'. మతాలు వేరైనా, వారికి కొన్ని కామన్ ఆచారవ్యవహారాలుంటాయి. ఇప్పటికీ చాలామంది కశ్మీరీ పండితుల, ముస్లిముల కుటుంబాల మధ్య రాకపోకలు, ఇచ్చి పుచ్చుకోవటాలు జరుగుతున్నాయి. పండితులు విడిచి వెళ్లిన చాలా ఇళ్లు ఇప్పటికీ తాళాలు వేయబడి ఖాళీగానే పడివున్నాయని కశ్మీరు పండితులపై పుస్తకం కోసం లోయలో పర్యటించిన అశోక్ పాండే చెబుతున్నారు. ఆనాడు శ్రీనగర్ – జమ్మూ హైవే మీద నిల్చుని బస్సుల్లో వెళుతున్న పండితులను వెళ్లవద్దంటూ వారించిన కశ్మీర్ నాయకుల గురించి ఏ మీడియాలోనూ ప్రస్తావన ఉండదు. 'అగర్ కశ్మీరీ హిందూ–ముస్లిం హై భాయీ భాయీ, తో భారత్ కి సేనా కహా సె ఆయీ' అనే స్లోగన్ అప్పట్లో ప్రాచుర్యం పొందినదే. ఇటీవల చనిపోయిన రియాజ్ నైకూ, బుర్హాన్ వాని లాంటి కశ్మీరీ మిలిటెంట్లు కూడా కశ్మీరీ పండితులను లోయకు తిరిగి రావాలని వాళ్ల వీడియో సందేశాల్లో కోరారు. బిజెపి భాషను ఎరువు తెచ్చుకున్న కశ్మీరీ పండితుల సంఖ్య చాలా తక్కువే. తాము హిందుత్వ కుట్రలను అర్థం చేసుకోలేకపోయామనీ, లోయను విడిచి పెద్ద తప్పుచేశామనీ అదే యేడాదిలో 23 మంది ప్రముఖ కశ్మీరీలు లోయలోని ముస్లింలను ఉద్దేశించి రాసిన ఉత్తరం ప్రత్యేకించి గమనించదగ్గది.

## ఆర్టికల్ 370

షరతులతో విలీమైన కశ్మీరుకు దొరికిన కనీస హక్కులు ఆర్టికల్ 370, 35 ఎ. సుదీర్ఘ ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాల చరిత్ర కలిగిన కశ్మీరులో, షేక్ అబ్దుల్లా నాయకత్వంలో 'కశ్మీరియత్'కు గట్టి పునాది పడడం, ఆర్టికల్ 370 కారణంగా భూసంస్కరణలు విజయవంతంగా అమలు కావడం ఒకేసారి జరిగాయి. దేశం మొత్తం మీద చూస్తే సామాజిక వైషమ్యాలు కశ్మీరులో చాలా తక్కువ. ఇది ఆర్ఎస్ఎస్‌కు ఆనాటి నుండీ నచ్చని విషయం. అందుకే కశ్మీరు చరిత్రను వక్రీకరించి మతతత్వ సమస్యగా చూపడం దాని రాజకీయ అవసరం. ఆ విధంగా వారికి 'ది కశ్మీర్ ఫైల్స్' ఒక పెద్ద ఆయుధం. కశ్మీరు పండితులకు లోయలో పునరావాసం కల్పించడానికి ఆర్టికల్ 370 ఎక్కడా అడ్డురాదు. కానీ పుష్కర్‌నాథ్ '370 ఆర్టికల్‌ను రద్దుచేయండి' అనే బిజెపి (ఎ)జెండా పట్టుకుని సినిమాలో చాలాసార్లు కనిపిస్తాడు. ఈనాడు కశ్మీరులో భారీ ఎత్తున ప్రవేశించాలనుకుంటున్న బడా కార్పొరేట్లకు ఆర్టికల్ 370 అడ్డుగా వుంది. అందుకే ఈ ఆర్టికల్ తొలగింపును కశ్మీరీ బ్రాహ్మణుడి కన్నీటి కథతో ముడిపెట్టి చూపారు.

## నదీమార్గ్ హత్యాకాండ

2003 మార్చి 23 న నదీమార్గ్ అనే దక్షిణ కశ్మీరు గ్రామంలో ఒక హత్యాకాండ జరిగింది, ఆర్మీ డ్రెస్సుల్లో వచ్చిన సాయుధులు 24 మంది కశ్మీరీ పండితులను హత్యచేశారు. అయితే ఈ సంఘటన కూడా వాజ్‌పేయి హయాంలోనే జరిగింది. (వంధామా, నదీమార్గ్, ఛత్తీసింహపురా వంటి ఒక లిస్టు ఇస్తూ బిజెపి హయాంలోనే ఇలాంటివి జరుగుతాయెందుకు అని ప్రశ్నిస్తున్నాడు అశోక్ పాండే.) లస్కరే తోయబా కమాండర్ జియా ముస్తఫా ఈ హత్యలకు ప్రధాన బాధ్యుడు అని పోలీసులు అరెస్టు చేశారు. కేసు 18 ఏళ్లుగా సాగింది. సరైన ప్రత్యక్ష సాక్షులను పోలీసులు ప్రవేశపెట్టలేక పోవడంతో కేసు వీగిపోయే దశలో ఉండగా గత ఏడాది అక్టోబరులో జియా ముస్తఫా ఎన్కౌంటర్‌లో చనిపోయాడు. పోలీసు కస్టడీలో వున్న చాలా ముఖ్యమైన ఖైదీని అడవిలో ఉగ్రవాదుల స్థావరాలు కనిపెట్టడం కోసం తీసుకుపోగా జరిగిన ఎదురుకాల్పుల సమయంలో జియా గాయపడ్డాడనీ, ఆ తర్వాత గాలింపుల్లో తూటాలు తగిలిన అతని మృతదేహం దొరికిందనీ పోలీసుల కథనం! జియా లాయరు మొహమ్మద్ ముబాషిర్ గట్టూతో పాటు, కశ్మీరీ పండిట్ సంఘర్ష్ సమితికి చెందిన సంజయ్ టిక్కూ కూడా ఈ మొత్తం హత్యాకాండ, ఎదురుకాల్పులపై అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నాడు. అప్పటికి తాజాగా 370 రద్దు జరిగి కశ్మీర్ కేంద్ర ప్రభుత్వ పాలనలో వుంది. ఆ సమయంలోనే 'ది కశ్మీర్ ఫైల్స్' నిర్మాణం సాగుతోంది. ఎన్నో అనుమానాలు వ్యక్తమౌతున్న ఈ ఉదంతాన్ని క్లైమాక్సుగా ఎంచుకుని అందులో 'బ్యాండిట్ క్వీన్' మాదిరి దృశ్యాన్నీ, కలప యంత్రంతో నరికే దృశ్యాన్నీ చొప్పించి, అందులో బిట్టాను కూడా బిగించడం విశేషం. ఒకే బిట్టా ఎన్నెన్ని సంస్థల్ని నడపాలి? (వికీపీడియా నదీమార్గ్ పేజీని సినిమాకు ముందూ, సినిమా చూసిన తర్వాతా చూసిన వారు ఆశ్చర్యపోతున్నారు.)

## హాస్యాస్పద సన్నివేశాలు

ఎన్నో కష్టాలు పడి భర్తను పోగొట్టుకుని, జమ్మూ శిబిరాల్లోకి వచ్చిన తర్వాత శారద మళ్లీ ఉద్యోగం పుచ్చుకుని కశ్మీరు లోయలోకి వెళ్లడమేమిటి? 1990 తర్వాత 13 యేళ్ల వరకూ పిల్లాడి వయసు పెరక్కుండా ఉండడమేమిటి? (లేక నెల రోజులు జమ్మూలో గడిపాక శారద ఉద్యోగంలో జాయినైందా?) బిట్టా ఓ చోట ఫరూక్ అబ్దుల్లా గార్డెన్లో కాఫీ తాగుతూ వుంటాడు. మరోసారి ఆ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అల్లుడి మర్యాదతో దూరదర్శన్‌లో కూర్చుని ఇంటర్వ్యూ ఇస్తుంటాడు. ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ రవి ఖన్నా, అతడితో పాటు మరో ముగ్గురు సైనికుల హత్య దృశ్యం కూడా జరిగినది జరిగినట్టు చూపలేదంటూ రవి ఖన్నా భార్య కోర్టులో కేసు వేసింది. బయట కర్ఫ్యూ వుంటే యూనిఫారం వేసుకుని పిల్లలు స్కూలుకు వెళ్లడమేమిటి అని ఆవిడ ఆశ్చర్యపోతోంది. అంత అల్లర్లలోనూ శివరాత్రికి నెలరోజుల ముందే శివుడి మేకప్ వేసుకుని మరీ రిహార్సల్స్ చేస్తుంటాడు పుష్కర్. రేషన్ పంపిణీలో వివక్ష దృశ్యం కూడా తప్పుగా వుందని అంటున్నారు 'కశ్మీర్ ఔర్ కశ్మీరీ పండిత్' గ్రంథ రచయిత. హిందువులందరూ ప్రమాదంలో వున్నారు అని చెప్పాలి. అందుకే అన్ని అసహజాలు! హిందూ దేవుళ్ల పేర్లనూ, ప్రతీకలనూ విరివిగా వాడారు. శివుడి బొమ్మతో కూడిన శివరాత్రి పోస్టర్ తగలబడిపోతూ వుంటుంది ఓ దృశ్యంలో.

## ఫాసిజానికి శత్రువులు

మైనారిటీలతో పాటు ప్రగతిశీల శక్తులు కూడా ఫాసిజానికి ఉమ్మడి శత్రువులు అని ప్రపంచ ఫాసిజం చరిత్ర చెబుతోంది. ఎ(జె)ఎన్‌యూ విద్యార్థులూ, ఆ క్యాంపస్, ప్రొఫెసర్లు మొత్తం దేశద్రోహుల అడ్డా అన్న మాదిరిగా దృశ్యాలూ, సంభాషణలూ వుంటాయి. ప్రొఫెసర్ నివేదితా మెనన్, అరుంధతీ రాయ్‌ల ఆధారంగా రాధికా మెనన్ క్యారక్టర్‌ను తయారుచేశారు. ఈమె విద్యార్థుల బ్రెయిన్ వాష్ చేస్తున్నట్టు, ఈమెకు టెర్రరిస్టులతో డైరెక్టు సంబంధాలు వున్నట్టు, ఈమె ఫొటో బిట్టా ఇంట్లో వున్నట్టు చూపారు. 'నా పాత్రను ప్రతి భారతీయుడూ అసహ్యించుకోవాలని నేను కోరుకుంటున్నాను' అని దర్శకుడి భార్య అయిన పల్లవీ జోషీ అంటోంది. రేపొద్దున్న లించ్ మాబ్‌లు ప్రొఫెసర్లనూ, మేధావులనూ మొహమ్మద్ అఖ్లాక్ మాదిరిగా హత్యచేసినా మంచిదే అని వీరనుకుంటున్నారా? రాధికా మేడం తన విద్యార్థితో క్యాంపస్‌లో మాట్లాడుతున్నపుడు చాలా క్లియర్‌గా మార్క్స్, లెనిన్, మావో ఫొటోలు ఆ వెనకాల కనిపిస్తూ వుంటాయి. ఇదంతా ఒక సునియోజిత ఎత్తుగడ. 'నేను దర్శకుడిని మాత్రమే కాదు, నాకో ఎజెండా వుంది' అని బాహాటంగానే చెబుతున్నాడు 'అర్బన్ నక్సల్' అన్న మాటను సృష్టించి, దానిపై పుస్తకం రాసిన ఈ దర్శకుడు. కొన్ని అపోహలూ, దుష్ప్రచారాలపై సినిమాలు తీయడం ఇతడికి ఇష్టం అని రుజువు చేస్తాయి ఇతడి 'బుద్ధ ఇన్ ఎ ట్రాఫిక్ జామ్', 'ది తాష్కెంట్ ఫైల్స్' లాంటి సినిమాలు. మిగతావి 'హేట్ స్టోరీ', 'జిద్' లాంటి సాఫ్ట్‌పోర్న్ సినిమాలు.

## చరిత్ర నుంచి నేర్చుకోమా?

'ది ఎటర్నల్ జ్యూ' అనే సినిమా 1940 లో జర్మనీలో తయారైంది. ఈ సినిమా యూదులపై విద్వేషాన్ని తారా స్థాయికి చేర్చేలా నిర్మితమైంది. హిట్లర్‌కు ఈ సినిమా చాలా నచ్చడంతో ప్రజలంతా చూడాలని ఈ సినిమాను టాక్స్ ఫ్రీ చేశాడు. ఆ రోజుల్లో చాలామంది హిట్లర్‌ను దేవుడిలా కొలిచారు. యూదు జాతి సంహారంలో పాల్గొన్నారు లేదా సైలెంట్‌గా సమ్మతి తెలిపారు. అపార ధన, ప్రాణ నష్టాల తర్వాత, 60 లక్షల యూదుల ఊచకోత తర్వాత, యుద్ధంలో జర్మనీ కూడా భారీ మూల్యం చెల్లించుకున్న తర్వాత, హిట్లర్ ఆత్మహత్య చేసుకున్న తర్వాత ప్రపంచ ప్రజలతో పాటు జర్మనీలు కూడా హిట్లర్ను నియంతగా అర్థం చేసుకున్నారు. కళ్లెదుటి చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోమా? పండితుల మీద అన్యాయం జరిగింది నిజమే. కాదనం, తక్కువ చేసీ మాట్లాడం, కానీ అంతకంటే ఎక్కువ అన్యాయాలు ముస్లింలపై స్వతంత్ర్య భారతంలో ఎన్నో చోట్ల ఎన్నో సార్లు జరిగాయి. విద్వేషాలు రెచ్చగొట్టేలా సినిమాలు తీసి, కాషాయ మూకలు సినిమా హాల్లోనే మూకహత్యల కోసం పిలుపు నిస్తుంటే, ఈ సినిమా దురుద్దేశాలను ప్రశ్నించే కశ్మీరీ పండితులనూ బెదిరిస్తుంటే సమయం మించిపోతోందని అర్థం కావడం లేదా? తక్షణమే ప్రజలకు ఇలాంటి సినిమాల హాని గురించి ఎడ్యుకేట్ చేసే అవసరం లేదా? ఇది ప్రగతిశీల శక్తులందరి కర్తవ్యం కాదా? ✦

## Slingshot : *(An Anthology of Translated Poems by Anishetty Shankar)*

**72 మంది** ప్రసిద్ధ, అప్రసిద్ధ తెలుగు కవుల 72 కవితలకు ఇంగ్లీషు అనువాదాల సంకలనం ఇది. అనువాదకులు కవి, రచయిత అనిశెట్టి శంకర్. Slingshot అంటే వడిసెల. వడిసెలతో ఈనాటి వ్యవస్థను కొట్టిన రాళ్ళలాంటి కవితలు ఇవి.

దీనిలో శ్రీశ్రీ, చెరబండరాజు, జ్వాలాముఖి, నిఖిల్, శివసాగర్, దేవిప్రియ, వరవరరావు, శివారెడ్డి, నందిని సిధారెడ్డి, యాకూబ్, హెచ్ ఆర్కే, అరణ్యకృష్ణ లాంటి ప్రసిద్ధ కవుల రచనలతోపాటు వర్ధమాన కవులు మేకా రామస్వామి, ఆప్కారి సూర్యప్రకాశ్, పంచారెడ్డి లక్ష్మణ, డా॥ లచ్చయ్య, గాండ్ల, జి. శ్రీధర్, గఫూర్ శిక్షక్, కన్నెగంటి రవి, హర్షకిరణ్, మొదలగువారి కవితల అనువాదాలు వున్నాయి.

ప్రసిద్ధ అనువాదకులు ఎలనాగ ముందుమాట రాశారు. అనిశెట్టి శంకర్ ఉపాధ్యాయ సంఘ నాయకులుగా, 'ఉపాధ్యాయ' పత్రిక సంపాదకులుగా పనిచేస్తూనే సృజనాత్మక సాహిత్య కృషితోపాటు సృజనాత్మక అనువాద కృషి కూడా కొనసాగిస్తున్నారు. వీరు అల్లం రాజయ్య, సాహు రాసిన 'కొమరం భీం' నవలను ఇంగ్లీషులోకి 2018లో అనువాదం చేశారు. 'కన్నీటి ధారల్లో కాశ్మీర్‌లోయ' పుస్తకాన్ని Kashmir Betrayed అనే పేరుతో అనువదించారు. కరోనా కాలంలో శంకర్ చేసిన ఈ కృషి అభినందనీయం.

కన్నెగంటి రవి (137 పుటలు); గఫూర్ శిక్షక్ (125)ల తెలుగు కవితలు అందుబాటులో లేవు కానీ, వాటికి చేసిన ఈ అనువాదాలు చాల ఉత్తేజకరంగా వున్నాయి. ఇప్పుడు ప్రచురిస్తున్న తెలుగు పుస్తకాలలో ఎన్నో అచ్చుతప్పులు వుంటున్నాయి. రచయితలు, ప్రచురణకర్తలు తగు జాగ్రత్తలు తీసుకోకపోవడమే కారణం. అయితే ఈ 160 పేజీల పుస్తకంలో నాలుగు తప్పులు మాత్రమే వుండటం ఆనందించాల్సిన విషయం. అవి : 81 పుట. 7వ లైనులో Old age అనేది Oladage అని అచ్చయింది. 107వ పుటలో Euphrates నదిపేరు Yapratise River గా అచ్చయింది. అలాగే Tigris నదిపేరు Tigressగా అచ్చయింది. 110వ పుటలో aeroplaneను విడదీసి aero plane గా ముద్రించారు.

మొత్తం అన్ని కవితలనూ మూలంతో సరిచూచి అనువాదం గురించి రాయాలంటే, తెలుగులో వున్న 72 కవితలు అందుబాటులో లేవు. మూల కవితలను, వాటి అనువాదాలను పక్కపక్కన అచ్చువేస్తే వర్ధమాన అనువాద కవులకు అనువాద మెళకువలు తెలుస్తాయి. సేకరించడమూ కష్టమే. అనువదించిన ఇంగ్లీషు కవిత్వం చదువుతుంటే ఎక్కడా అన్వయక్లిష్టత కానీ, అర్థం కాకపోవడం కానీ లేదు. క్లిష్టమైన పదాలు లేకుండా శంకర్ జాగ్రత్త తీసుకున్నారు.

ఇతర భాషల సాహిత్యం తెలుగులోకి విస్తృతంగానే వస్తోంది. కానీ మన తెలుగు సాహిత్యం ఇతర భాషలలోకి ఇప్పుడిప్పుడే అనువాదమౌతోంది. తెలుగు కథలు ఇంగ్లీషులో సంకలనాలుగా వెలువడ్డాయి. తెలుగు కవితల ఆంగ్ల అనువాదం మొదట ఒక సంకలనంగా వేగుంట మోహనప్రసాద్ ఏనాడో 'This Tense Time'గా ప్రచురించారు. శీలా సుభద్రాదేవి కవితాసంపుటి 'యుద్ధం ఒక గుండెకోత'ను కూడా ఇంగ్లీషులో అనువదించారు. యాకూబ్ కవితలను టి.ఎస్. చంద్రమౌళి అనువదించారు. కరుణశ్రీ 'పుష్ప విలాపా'న్ని 1993లోనే ఎస్. పూర్ణచంద్రరావు, 1995లో కాంద్రేగుల అంబాప్రసాదరావు అనువదించారు. డా॥ విజయ్, డా॥ పద్మజ కలిసి దేవీప్రియ 53 ప్రేమ కవితలను ఇంగ్లీషులోకి అనువదించి "Sleeping with the Rainbow" పేరుతో 2019లో వెలువరించారు. 2014లో రాజ్, కారంచేడు – వరవరరావు, శివారెడ్డి, ఇస్మాయిల్ కవితలు కొన్ని అనువదించారు. శ్రీశ్రీ తన కవితలను కొన్నిటిని తనే 'Three Cheers for Man'గా అనువదించారు. ఈ జాబితా ఇక్కడ ఆపి, శంకర్ అనువాదానికి వస్తే – ఆయన కరోనా కల్పించిన విశ్రాంతిని చక్కగా ఉపయోగించుకొని ఈ కవితల అనువాదం అందించినందుకు అభినందిద్దాం.

1/8 డెమ్మీలో 160 పుటలు. వెల : రూ. 100/– స్నేహ ప్రచురణగా 20–2–2021న విడుదలైంది. ప్రతులకు : తుర్లపాటి లక్ష్మి, 104 శారద సుందర్ రెసిడెన్సీ, బాపునగర్, చౌడీ దగ్గర, సరూర్‌నగర్, హైదరాబాదు – 500035. మొబైల్స్ : 98666 30739, 97042 25469. ✦

# డిజిటల్ శ్రమ - కార్ల్‌మార్క్స్

సారాంశ సమర్పణ : జి.వి. భద్రం **- Christian Fuchs**

*గతసంచిక తరువాయి..*

## ఫాక్స్‌కాన్ కంపెనీలో శ్రమదోపిడీ

**మనం** చూసే బడా బ్రాండ్లకు చెందిన డిజిటల్ పరికరాలన్నింటినీ ఆ కంపెనీలు తయారు చేయవు. కేవలం ఆ పరికరాలను మార్కెట్లో తమవిగా అమ్ముకొని లాభాలను గడిస్తాయి. వాటి తయారీని, సబ్ కాంట్రాక్టు కంపెనీలకు అప్పగించి, ఆ సబ్‌కాంట్రాక్టు కంపెనీలు తయారుచేసి యిచ్చినవాటిని బడా బహుళజాతి కంపెనీలు అమ్ముకొంటాయి. దీనిని ఆఫ్ షోరింగ్ ఉత్పత్తిగా, ఔట్‌సోర్సింగ్ తయారీగా పిలుస్తారు. యాపిల్ లాంటి బడా కంపెనీలకు, విడిభాగాలను కూర్చి మొబైల్ ఫోన్ల లాంటి పరికరాలను తయారుచేసిపెట్టే అతిపెద్ద సబ్ కాంట్రాక్టర్ కంపెనీలలో ఫాక్స్‌కాన్ కంపెనీ ఒకటి. ఇది తైవాన్ దేశానికి చెందినది. కార్మికులకు ఉద్యోగాలు కల్పించి, ఉత్పత్తిని సాగించే అతిపెద్ద కంపెనీలలో యిది ప్రపంచంలో ఐదవ పెద్ద కంపెనీ. ఈ కంపెనీ తన తయారీ పరిశ్రమను భారీ ఎత్తున నిర్వహిస్తోంది.

చైనాలోని ఫాక్స్‌కాన్ కంపెనీలో చాలా పెద్ద సంఖ్యలో కార్మికులు పనిచేస్తారు. 2012 నాటికి, యీ కంపెనీకి గల ఫ్యాక్టరీలలో 10,00,000 మంది పనిచేస్తున్నారు. ఈ మొత్తం కార్మికులలో మహిళా కార్మికులే ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్నారు. ఒక్క షెన్‌షాన్‌లోని ఫ్యాక్టరీలలోనే 4,20,000 మంది పనిచేస్తున్నారు. చైనాలోని వివిధ ప్రాంతాలలో ఫ్యాక్టరీలు నెలకొల్పి వాటిలో ఫాక్స్‌కాన్ తన తయారీ కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ కంపెనీ ఐపేడ్, ఐమేక్, ఐఫోన్, కిండిల్ తదితర కన్సోల్స్‌ను కూర్చి తయారుచేస్తుంది.

చైనాలోని ఫాక్స్‌కాన్ కంపెనీలో పనిచేసిన కార్మికులందరూ, గ్రామీణ ప్రాంతాల నుండి వలస వచ్చినవారే. ఫాక్స్‌కాన్‌కు చెందిన ఫ్యాక్టరీలు షెన్‌జెన్‌లోని రెండు జిల్లాలలోని చెంగ్డు, చోంగ్ డింక్, గునలాన్, లాంగ్ హువా ప్రాంతాలలోనూ, పోషాన్ నగరంలోని హాంగ్ ఝౌ, కున్షాన్, లాంగ్‌పాంగ్, నానిపి ప్రాంతాలలోనూ, తాయ్‌యువాన్, తియాంజిన్, జింగ్ ఝౌ ప్రాంతాలలోనూ వున్నాయి.

ఇటీవలనే ఫాక్స్‌కాన్ కంపెనీ మనదేశంలోని తమిళనాడులోని చెన్నై సమీపాన గల శ్రీపెరంబదూర్‌లో కూడా ఫ్యాక్టరీని నెలకొల్పి యాపిల్ కంపెనీకి చెందిన క్రొత్త మోడల్ సెల్‌ఫోన్లను కూర్చి తయారుచేస్తోంది.

చైనాలోని ఫాక్స్‌కాన్ కంపెనీలో పనిచేసే కార్మికుల స్థితి, గతులపై అనేక సర్వేలు, అధ్యయనాలు జరిగాయి. వాటిల్లో ఆ కంపెనీలో సాగుతున్న ఘోరమైన శ్రమదోపిడీని గురించిన అనేక వివరాలు వెల్లడయ్యాయి. అక్కడ నెలకొని వున్న అమానవీయ పని పరిస్థితుల వివరాలు బయటపడ్డాయి.

చైనాలో వివిధ ప్రాంతాల్లో కార్మికులు తమ మనుగడ కొనసాగించటానికి అవసరమైన జీవనవేతనం యిలా వుంది : షెన్‌జాన్‌లో 2293 యువాన్లు, కుషాన్‌లో 2000 యువాన్లు, ఊహాన్‌లో 1754 యువాన్లు, టియన్‌జోన్‌లో 1685 యువాన్లు. కానీ ఫాక్స్‌కాన్ కంపెనీ షెన్‌జెన్, హాంగ్ ఝౌ ఫ్యాక్టరీలలో, 2010వ సంవత్సరంలో కేవలం 1200 యువాన్లను మాత్రమే కార్మికులకు మూలవేతనంగా చెల్లిస్తోంది. ఇతర ప్రాంతాల్లో అంతకన్నా తక్కువగా చెల్లిస్తోంది.

ఫాక్స్‌కాన్ చైనా ఫ్యాక్టరీలలో కార్మికులు సగటున నెలకు 120 గంటలు అదనంగా (ఓవర్‌టైంగా) పనిచేస్తారు. ఒక్కోసారి ఆరుమాసాల కాలంపాటు ఆదివారాల రోజున కూడా పనిచేస్తారు. రోజుకు 12 గంటలపాటు పనిచేస్తారు. రెండు వారాలకు ఒకసారి మాత్రమే శెలవు రోజు లభించటం అన్నది సాధారణంగా యిక్కడ జరిగే విషయం. నెలలో 8 గంటలకన్నా అదనంగా పనిచేసిన ఓవర్‌టైం గంటలకు వేతనం చెల్లించరు. చట్టప్రకారం ఓవర్‌టైం పనికి రెండురెట్లు వేతనం చెల్లించాల్సి వుంటే, ఫాక్స్‌కాన్ కంపెనీ ఒకటిన్నర రెట్ల వేతనం మాత్రమే చెల్లిస్తుంది. ప్రతీ షిఫ్టు ప్రారంభం కావటానికి ముందు కార్మికులు వేతనం చెల్లించని పనిని ఒక గంట కాలం పాటు చేయాలి.

కనీసం రోజుకు 10 గంటలు పనిచేయటం తరచుగా కార్మికుల షిఫ్టులు మార్చటం, పని సమయంలో విశ్రాంతి సమయాలు లేకపోవటం, ఎల్లప్పుడూ ఒకే రకమైన పనిచేయాల్సి రావటం బెంజీన్ – సోల్డర్‌పేస్టు లాంటి రసాయనాల వలన భౌతికమైన హానికి గురికావటం, భద్రతా పరికరాలు, భద్రతా ఏర్పాట్లు లేకుండా అభద్రతా పరిస్థితులలో పనిచేయటం, అప్రెంటీసులుగా నియమించుకొన్న విద్యార్థులచేత పూర్తికాలపు ఉద్యోగులతోపాటు సమానంగా పనిచేయించుకోవటం, డార్మిటరీ (బస) గదుల్లో ఆరుగురి నుండి 22 మందిదాకా ఒకే గదిలో వుంచటం, క్యాంటీన్‌లలో సరఫరా చేసే ఆహార పదార్థాలు తినటానికి వీలులేనంతగా వాంతులు తెప్పించేవిగా వుండటం లాంటి పరిస్థితులలో, ఈ ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలలో కార్మికులు పనిచేస్తున్నారు.

ఎక్కువ జీతం యిస్తామని ప్రచారం చేసి, తీరా ఉద్యోగంలో చేరాక తక్కువ జీతాన్నివ్వటం, వేతనాలను తప్పుగా లెక్కించి, తక్కువగా చెల్లించటం అన్నది యీ ఫ్యాక్టరీలలో సాధారణంగా జరిగే విషయం. తిండి, బస అలవెన్సులతో కలిపి నెలకు 2,600 యువాన్లు మూలవేతనాన్ని (ఎంగెల్సు సూత్ర ప్రకారం) చెల్లించాల్సి వుండగా యీ ఫ్యాక్టరీలలో కేవలం 1300, 950 యువాన్లు మాత్రమే చెల్లిస్తారు.

ఐఫోన్ (ఏపికి) ఆర్డర్ల డిమాండును అందుకోవటం కోసం పనిచేసేటప్పుడు కార్మికులకు నెలకు ఒకరోజు కూడా శెలవు యివ్వరు. ఇక శెలవులు పొందటం అన్నది కార్మికులకు అతి దుర్లభం. మిలిటరీ తరహాలో కార్మికులను అజమాయిషీ చేస్తూ పనిచేయించుకొంటారు.

యాజమాన్యం ప్రతిరోజూ జరిపే సమావేశాలకు కార్మికులు తప్పకుండా హాజరుకావాలి. ఈ సమావేశాల్లో, ఉత్పత్తి లక్ష్యాన్ని

చేరుకోవటం కోసం కార్మికులు కష్టించి పనిచేయాలని బోధిస్తారు. కార్మికులు చేసే పని వివరాలను వారు పాత్రికేయులకు కానీ, యితరులకు కానీ చెప్పవద్దని ఆంక్షలు విధిస్తారు.

అసెంబ్లీ లైనులో (విడిభాగాలను కూర్చే లైను)లో కార్మికులకు రోజుకు 14 గంటలపాటు నిలబడే పనిచేయాల్సి వుంటుంది. కార్మికులు ఒళ్ళు విరుచుకోవటానికి కూడా వీల్లేదు. ప్రక్క కార్మికులతో మాట్లాడకూడదు. ఆ విధంగా కార్మికులు చేయకపోతే వాళ్ళకు యాజమాన్యం శిక్షలు వేస్తుంది. కంపెనీ సెక్యూరిటీ గార్డులు కార్మికులను వేధిస్తారు, కొడతారు.

కార్మికులు స్వచ్ఛందంగా విధిగా ఓవర్‌టైం పనిచేయాలి. అందుకు అంగీకరించకపోతే, దాన్ని పనిని నిలుపుదల చేసినట్లుగా పరిగణిస్తారు.

వీరికి యాజమాన్యం సరఫరా చేసే ఆహారం తినటానికి వీలులేనంత ఘోరంగా వుంటుంది. వీరికి కల్పించే డార్మిటీలు (బస గదులు) మిలటరీ పద్ధతుల్లో నిర్వహింపబడతాయి. డార్మిటరీ నిబంధనలను ఉల్లంఘిస్తే, అంటే వసతి గదిలో జుట్టు బ్లో డ్రైయర్‌తో ఆరబెట్టుకొన్నా, రాత్రి 11:30 గం॥లు దాటాక డార్మిటరీకి వచ్చినా – వారి పేర్లు నమోదు చేయబడి, ఆ కార్మికులు డార్మిటరీని ఊడ్చి శుభ్రం చేయవలసి వుంటుంది. 'వలంటీర్లు' అనే పేరుతో వాళ్ళు ఆ పనులు చేయాల్సి వుంటుంది. అంతేకాదు వారు తాము తప్పు చేసినట్లు ఒప్పుకొంటూ లేఖను రాసి యివ్వాలి. ఆ లేఖలో తమ పేరు, గుర్తింపు నంబరు, వర్కర్ కార్డు ఫోటోలు పేర్కొని, యీ విధంగా రాయాల్సి వుంటుంది : "నేను తప్పు చేశాను. ఇంకెప్పుడూ గదిలో బ్లోయర్‌తో జుట్టు ఆరబెట్టుకోను. లేదా రాత్రి 11:30 తర్వాత ఆలస్యంగా డార్మిటరీకి రాను". ఆ లేఖ కాపీని నోటీసు బోర్డుల్లో ప్రదర్శిస్తారు.

అక్కడ పనిలోకి జేరి యీ పరిస్థితులకు తట్టుకోలేక రాజీనామా చేసిన ఒక యువతి యిలా తెలియజేసింది : "అటువంటి స్నేహరహిత వాతావరణంతో కూడుకొన్న పని ప్రదేశంలో పనిచేయాల్సి రావటం నాకు నిరాశ, నిరుత్సాహాలను కలుగజేసింది. నేను మాట్లాడటానికి ఎవరూ లేరు. అక్కడ పనిని కొనసాగించాల్సి వస్తే నేను ఆత్మహత్య చేసుకొని వుండేదాన్నేమో!"

మాక్సియాక్విన్ అనే ఒక కార్మికుడిని అక్కడి సెక్యూరిటీగార్డులు, పనిష్మెంట్‌గా, బలవంతంగా ఫ్యాక్టరీ ఆవరణ అంతటి నేలనూ పాకీదొడ్లనూ ఊడ్పించి, శుభ్రం చేయించారు. ఆ అవమానాన్ని తట్టుకోలేక ఆ కార్మికుడు ఆత్మహత్య చేసుకొన్నాడు.

కార్మికులపై మిలటరీ తరహా నిఘా బలవంతంగా పనిచేయించుకోవటం, వారిని దారుణమైన క్రమశిక్షణలో వుంచటం యిక్కడ జరుగుతోంది. కార్మికుల చేత ఎక్కువ పనిగంటలపాటు పనిచేయించుకోవటమేకాక, వారి పని భారం కూడా క్షణక్షణానికి పెంచబడుతుంది. మరింత వేగవంతంగా పనిచేయాలని సూపర్‌వైజర్లు నిరంతరం ముల్లుగర్రతో పొడిచినట్లు ఒత్తిడి చేస్తారు. సాధారణంగా రోజుకు ఉత్పత్తి లక్ష్యం 5,000 వస్తువులు (పీసెస్)గా వుంటుంది. కానీ ఎక్కువగా ఆర్డర్లు వస్తే అదే లక్ష్యాన్ని 1,000 వస్తువులకు పెంచుతారు. ఒకవేళ కార్మికులు తమకు నిర్ణయించిన లక్ష్యాన్ని పూర్తిచేస్తే, తిరిగి ఆ లక్ష్యాన్ని రోజురోజుకూ పెంచుకొంటూనేపోతారు.

ఇటువంటి పని భారాన్ని పూర్తిచేసుకుని పూర్తిగా అలసిపోయిన కార్మికులు డార్మిటరీలకు వెళ్ళేటప్పటికి కాళ్ళు వణుకుతూ వుంటాయి. వారు నిస్త్రాణలో పడిపోతారు. ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే, షిఫ్టు సమయంలో ముగించబోయే ముందటి ఒక గంట నుండీ సూపర్‌వైజర్లు, కార్మికులను పని వేగంగా చెయ్యమని ఒత్తిడి చేస్తారు.

ఈ దుర్భర, దారుణ పని పరిస్థితులను తట్టుకోలేక 2010 సంవత్సరంలో జనవరి–ఆగస్టు నెలల మధ్య, 17 మంది కార్మికులు ఆత్మహత్యా ప్రయత్నాలు చేశారు. వీరిలో పదిమంది పురుష కార్మికులు ఏడుగురు మహిళాకార్మికులు. వీరందరూ 17 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సువారే. వీరిలో నలుగురు మాత్రమే బ్రతికారు. వీరిలో 16 మంది పలు అంతస్తుల ఫాక్స్‌కాన్ భవనం పై నుండి క్రిందకు దూకి ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఒకరు చేతి మణికట్టును కోసుకొని ఆత్మహత్య చేసుకొన్నారు. లాన్‌ఫాంగ్ ఫ్యాక్టరీలో ఇద్దరు, గునాలాన్ ఫ్యాక్టరీలో నల్గురు, లాంగ్ హువా ఫ్యాక్టరీలో తొమ్మండుగురు, నాన్హీ ఫ్యాక్టరీలో ఒకరు, కున్‌షాన్ ఫ్యాక్టరీలో ఒకరూ ఆత్మహత్య చేసుకొన్నారు.

ఫాక్స్‌కాన్ కంపెనీ చేత తన పరికరాలను తయారుచేయించుకొంటున్న యాపిల్ కంపెనీ, ఆ కార్మికులకు ప్రధాన యజమాని అవుతుంది. ఆ కార్మికులు తయారుచేసి యిచ్చిన వస్తువులను అమ్ముకొని సూపర్ లాభాలను గడిస్తున్న ఆ కంపెనీ (యాపిల్) యీ ఆత్మహత్యలకు నైతిక బాధ్యతను వహించాల్సి వస్తుంది. కానీ యాపిల్ కంపెనీ అందుకు అంగీకరించక, ఆ బాధ్యతను తనకు సరుకులు తయారుచేసిన సబ్ కాంట్రాక్టరు కంపెనీపైకి నెట్టేస్తుంది. ఆ సరఫరాదారు కాంట్రాక్టరు కంపెనీ, తాను నిర్దేశించిన "సప్లయర్ ప్రవర్తనా నియమావళి"ని ఉల్లంఘించాడు. ఆ కంపెనీపై చర్య తీసుకొంటానంటూ ప్రకటిస్తుంది.

అయితే యాపిల్ కంపెనీ ఉత్పత్తుల తయారీలో కార్మికులు దారుణ, దుర్భర పని పరిస్థితులలో, అమానవీయంగా శ్రమదోపిడీకి గురవుతున్నారు – అందువల్లనే ఆత్మహత్యలు చేసుకొంటున్నారన్న విషయం ప్రపంచమంతటా వెల్లడయి, యాపిల్ కంపెనీ వినియోగదారుల్లో తన యొక్క బ్రాండ్ పేరుకు చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఏర్పడినప్పుడు, యాపిల్ కంపెనీ తానే ఆ విషయమై దర్యాప్తు జరిపించినట్టు హంగామా చేస్తూ, ఒక బూటకపు రిపోర్టును తయారుచేయించి, విడుదలచేసి, తాను ఏమీ ఎరగని నంగనాచినన్నట్టు నటిస్తుంది. లేదా తప్పు జరిగినది సంబంధిత కార్మికుల వ్యక్తిగత కారణాలవల్లనే అంటూ తేల్చి, ప్రచారం కావించి, తన బాధ్యత ఏమీ లేదన్నట్లు తిరస్కరిస్తుంది.

'సప్లయర్ బాధ్యతారిపోర్టు–2011' పేరిట, ఫాక్స్‌కాన్‌లో జరిగిన ఆత్మహత్యలపై ఒక నివేదికను యాపిల్ కంపెనీ ప్రకటించింది. ఆ రిపోర్టులో యికముందు ఎటువంటి చర్యలను ఫాక్స్‌కాన్ కంపెనీ చేబట్టి కార్మికుల ఆత్మహత్యలను నివారించాలో సూచన చేస్తూ, "పెద్ద సంఖ్యలో మానసిక కౌన్సిలర్‌లను నియమించాలనీ", "హాట్ లైన్ కార్మికులకు చక్కటి శిక్షణను అందించాలనీ", అంతేకాక "ఫాక్స్‌కాన్ భవనాల చుట్టూ గట్టి వలలు బిగించాలనీ (భవనంపై నుండి దూకినా క్రింద పడకుండా)" సిఫార్సులు చేసింది. అంటే యాపిల్ కంపెనీ పరోక్షంగా "ఆత్మహత్య చేసుకొన్న కార్మికులందరూ మానసిక కారణాల వల్లనే

ఆత్మహత్యలు చేసుకొన్నారు తప్ప, దుర్భర పని పరిస్థితుల కారణంగా మాత్రం కానే కాదన్నట్లు "సమస్యను తేల్చివేసి బాధ్యతను కార్మికులపైకి నెట్టివేసింది.

ఇదే విషయంపై ఫాక్స్‌కాన్ కంపెనీ అధినేత అయిన స్టీవ్ జాబ్స్ మరొక అడుగు ముందుకుపోయి యిలా ప్రకటించాడు : "వాళ్ళు (చైనా దేశంవారు) మరీ పేదరికంలో మ్రగ్గిపోతున్న గ్రామీణ ప్రాంతాల నుండి వలసకు వచ్చే కార్మికులను ఎక్కువ సంఖ్యలో కలిగి వున్నారు. వారు తమ యిళ్ళ నుండి యీ ఫ్యాక్టరీల్లో పని కోసం రావటం యిదే మొదటిసారి కావటంతో, 19 సంవత్సరాల వయసున్న ఈ యువత బహుశా యిక్కడకు రావటానికి సంసిద్ధపడి వుండరు". "మేము (యాపిల్, ఫాక్స్‌కాన్) మంచి ఫ్యాక్టరీలను యిక్కడ నెలకొల్పాము. వీటిలో కార్పొరేట్ సామాజిక నివేదికలు, రిపోర్టు చేయబడతాయి. కానీ వాళ్ళు (కార్మికులు) తక్కువ వేతనాల వలన గానీ, పనిలో బాధలు పెట్టడం వలన కానీ, తమను తాము చంపుకోలేదు" అంటూ ప్రకటించాడు. ఆ రకంగా అతడు ఆ తెలివితక్కువ గ్రామీణ యువకులైన నిరుపేద కార్మికులే ఆత్మహత్యలు చేసుకొన్నారు అని అన్యాపదేశంగా ప్రకటించాడు.

ఇటీవల మనదేశంలోని కర్నాటక రాష్ట్రంలోని విస్ట్రన్ కంపెనీ (యాపిల్‌కు సబ్ కాంట్రాక్టు తయారీ కంపెనీ)లోని కార్మికులు అమానుష దుర్భర పని పరిస్థితులను తీవ్రంగా ప్రతిఘటించిన సందర్భంలోనూ, తమిళనాడులోని శ్రీ పెరంబదూర్ ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో మహిళా కార్మికులు యాజమాన్యం తినటానికి వీలులేని ఆహార పదార్థాలను తమకు సరఫరా చేస్తుందని ప్రతిఘటించిన సందర్భంలోనూ, యాపిల్ కంపెనీ యిదే రకమైన బూటకపు తతంగాలు నడిపి, ప్రకటనలు చేస్తూ, ప్రపంచ ప్రజలందరి కళ్ళుగప్పే ప్రయత్నం చేసిన అనుభవం, మనం ఎరిగున్నదే!

"సరఫరాదారు ప్రవర్తనా నియమావళిపేరిట, యాపిల్ కంపెనీ తనకు తానే ఏకపక్షంగా కార్మికుల పని పరిస్థితుల ప్రమాణాన్ని నిర్ణయించి ప్రకటించింది. ఈ 'ప్రమాణాలు' ఎంతో గొప్పవన్నట్టు ప్రచారం చేస్తూ, ప్రపంచ ప్రజలందరి కళ్ళలో దుమ్ముకొట్టే ప్రయత్నం చేసింది.

యాపిల్ యొక్క నియమావళి ప్రకారం, వారంలో ఒక కార్మికుడు గరిష్టంగా పనిచేయవచ్చునట! ప్రత్యేక, అత్యవసర పరిస్థితుల్లో అంతకన్నా ఎక్కువ గంటలు పనిచేయవచ్చునట! ఇది అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ) నిర్ణయించిన పనిగంటల ప్రమాణానికి పూర్తిగా విరుద్ధ మయినది. ఐ.ఎల్.ఒ ప్రమాణం ప్రకారం వారానికి 48 గంటలు మించకుండా పనిచేయాలి. ఒకవేళ ఆ వారంలో పనిగంటలు సర్దుబాటు చేయాల్సివస్తే ఒక రోజుకు 10 గంటలు పనిని మించి చేయించు కోకూడదు. కానీ యాపిల్ మాత్రం తాను నిర్ణయించిన పనిగంటల ప్రమాణమే గొప్ప విషయం అన్నట్లు నిస్సిగ్గుగా, ఘనంగా ప్రకటించుకొంటోంది.

ఇక బాల కార్మికుల చేత ఎందుకు పనిచేయించుకొన్నారని ప్రశ్నిస్తే, యాపిల్ కంపెనీ అందుకు తాను బాధ్యురాలిని కాననీ, తమ మధ్యవర్తులుగా (దళారీలుగా) వున్న కార్మికుల సరఫరాదారు కంపెనీలదే బాధ్యత అంటూ, బుకాయించి తప్పించుకొంటుంది.

ఫాక్స్‌కాన్ కంపెనీ జరుపుతున్న దారుణ, అమానవీయ శ్రమ దోపిడీని ప్రతిఘటిస్తూ 2012 అక్టోబరు నెలలో, జెంగ్ ఝౌ ఫ్యాక్టరీలోని 4000 మంది కార్మికులు సమ్మె జరిపారు. 2012 సెప్టెంబరులో ఫాక్స్‌కాన్ కంపెనీకి చెందిన సెక్యూరిటీగార్డులు ఒక కార్మికుడ్ని కత్తితో పొడిచినందుకు నిరసనగా, తైయువాన్ ఫ్యాక్టరీల్లో 2000 నుండి 10000 దాకా కార్మికులు దొమ్మీ జరిపి (అల్లరి చేసి) ఫ్యాక్టరీని విధ్వంసం చేశారు.

అంతర్జాతీయ పెట్టుబడి (సామ్రాజ్యవాద పెట్టుబడి) నయా ఉదార విధానం పేరిట కార్మికుల శ్రమశక్తిని దారుణ, అమానవీయ, దుర్భర పని పరిస్థితుల ద్వారా ఎలా దోపిడీ చేస్తోందో తెల్సుకొనేందుకు యీ ఫాక్స్‌కాన్ కంపెనీలో జరిగే శ్రమదోపిడీ విధానాలు చక్కగా ఉపయోగపడతాయి.

వచ్చే సంచికలో....

**నూతన సామ్రాజ్యవాదం యొక్క శ్రమవిభజన :**
**భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో పని** ✦

కవిత

## ఐదు నాలుగులు....

**- కొత్తపల్లి రవిబాబు**

ఆకులపై బడి జారిపోతున్న మంచు బిందువులు
మన నాయకుల వాగ్దానాలు
దున్నపోతుపై వర్షాలు మన హాహాకారాలు
చెవిటి వాని ముందు శంఖారావాలు మన విమర్శనాస్త్రాలు
ఇక మనకు చివరగా మిగిలింది విప్లవ మార్గమే!

అవును దాక్కున్నాం ఇంట్లోనే సూక్ష్మక్రిమి కళ్ళబడకుండా
ఆత్మసంరక్షణే ప్రధానంగా వదిలేశాం బంధుమిత్రులను
ఇప్పుడు సభలూ లేవు, ఉపన్యాసాలూ లేవు
ఈడుస్తున్నాం రోజులూ, నెలలూ ఈసురోమంటూ!

చిత్తు కాగితాల బుట్ట ఆబగా ఎదురు చూస్తోంది
రాసి నలిపేసిన కాగితాల వుండల కోసం
ఏం రాసినా ప్రశంసల జల్లులు సామాజిక మాధ్యమాలలో
అందుకనే చి.కా.బు. ఆకలి తీరడంలేదు.

కరోనా కబంధ హస్తాలలో అర్ధాయుష్కులైపోయారు
మిత్రులు, సన్నిహితులు, బంధువులు, ఆత్మీయులు
కార్పొరేట్ వైద్యం ఆస్తుల హరాయింపే, వైకుంఠయాత్రే
ఉచిత విద్య, వైద్యమే ఏకైక పరిష్కారమార్గం.

పుట్టినరోజు వస్తోందంటే భయమేస్తుంది నాకు
చావు దాపుకు పోతున్న భావం తొలిచేస్తుంది నన్ను
అందుకే త్వరపడాలి లక్ష్యసాధనకు, కాలం వృథా చేయక
ప్రతిక్షణం అంకితం కావాలి సమసమాజ స్థాపనకై! ✦

## జాతీయ అక్షరయోధులు



# సఫ్దార్ హష్మీ

**( 1954 - 1989 )**

**3**

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# విప్లవ రశ్మి

## జననాట్యమంచ్ వ్యవస్థాపక సఫ్దార్
## కమ్యూనిస్టు ఉద్యమ విద్యల సర్దార్
## వీధి నాటకాలతో నేతల నాటకాలను
## వీధులలోకీడ్చిన ప్రజాకళల ఖబడ్దార్

**"నాటకం ఎక్కడ ప్రదర్శింపబడిందనేది కాదు సమస్య. ప్రధాన సమస్య ఏమిటంటే-కళావీక్షణ అనేది బూర్జువా వ్యక్తివాద కళాదృక్పథానికీ, ప్రజల సామూహికవాదానికీ మధ్య పరిష్కరించలేని ఖచ్చితమైన వైరుధ్యం. వీధి నాటకరంగం అనేది కళను ప్రజలకు అందుబాటులో ఉండేలాచూసే ఒక ప్రక్రియ మాత్రమే." అని చెబుతున్న సఫ్దార్ హష్మీ వామపక్ష కళాకారుడు. నాటక రచయిత, దర్శకుడు,నటుడు, గీత రచయిత, సిద్ధాంతకర్త, వీధి థియేటర్ ప్రయోక్త.**

ఢిల్లీలో పాఠశాల విద్యచదివి, స్టీఫెన్ కాలేజీనుండి ఆంగ్లసాహిత్యంలో పట్టాపొంది, ఢిల్లీ యూనివర్సిటీ నుండి ఆంగ్లంలో ఎం.ఏ. పూర్తి చేశారు. ఆ కాలంలోనే యస్.యఫ్.ఐ.లోనూ, ఇప్టాలోనూ చురుకుగా పాల్గొన్నారు. అనేక ఐ.పి.టి.ఏ, ప్రజానాట్యమండలి నాటకాలలో పనిచేశారు.

కమ్యూనిస్టు భావజాలంతో పదునెక్కిన హష్మీ భారతప్రధాని ఇందిరాగాంధీ ఎన్నికల రిగ్గింగ్ వివాద ప్రతిస్పందన(కుర్సీ..కుర్సీ..కుర్సీ)గా అనే వీధి నాటకాన్ని రూపొందించి ప్రదర్శించారు. ఇది రోజూ ప్రదర్శింపబడుతూ సంచలనమైంది.ఇది జనమ్(జన నాట్యమంచ్) గుర్తింపుకు పెద్ద మలుపు. జనమ్ 24 వీధినాటకాలను నాలుగువేల సార్లు ప్రదర్శించింది.

1973లో జననాట్య మంచ్ (పీపుల్స్ థియేటర్ ఫ్రంట్..సంక్షిప్తంగా'జనమ్')కి హష్మీ వ్యవస్థాపక సభ్యుడు.ఇది 'ఇప్టా'నుండి పెరిగింది.హష్మీ థియేటర్ కళాకారిణి 'మలయశ్రీ'ని వివాహం చేసుకున్నారు. ప్రముఖ హిందీనటి సబా ఆజాద్ ఆయన మేనకోడలు.

1975 వరకు జనమ్ ద్వారా సామాన్య ప్రేక్షకుల కోసం విస్తృతంగా వీధినాటకాలు వేసిన హష్మీ ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి విధించి రాజకీయ నాటక ప్రదర్శనలను కష్టతరం చేసినప్పుడు తప్పనిసరై గర్వాల్, కాశ్మీర్, ఢిల్లీ యూనివర్శిటీల్లో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేశారు.

1989 జనవరి 1న స్థానిక పురపాలక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఘజియాబాద్ జిల్లాలోని ఝుండాపూర్ గ్రామంలో 'హల్లా బోల్' (రైజ్ యువర్ వాయిస్)అనే వీధినాటికను ప్రదర్శిస్తుండగా కాంగ్రెస్ గూండాల దాడిలో ప్రాణాంతకంగా గాయపడిన హష్మీ మరునాడు మరణించారు.

అయినా గూండా సంస్కృతికి తల ఒగ్గేది లేదంటూ మరణించిన రెండు రోజుల అనంతరం హష్మీ హత్య వలన నిలిచిన ప్రదర్శనను అదేచోట ఆయన భార్య మలయశ్రీ ఆధ్వర్యంలో జనమ్ ప్రదర్శించింది. 'కామ్రేడ్ హష్మీ చావలేదు', 'ప్రజాకళాకారులకు చావులేదు' అనే నినాదాల హోరులో ఆ ప్రదర్శన సాగింది.

న్యూఢిల్లీలోని మండీహౌస్ లోని ఒక వీధికి సఫ్దార్ హష్మీ పేరుపెట్టారు.

పీడిత ప్రజలసమస్యలే ఇతివృత్తాలుగా,కష్టించి పనిచేసేవాడే కథానాయకుడిగా వీధి నాటకాలకు ప్రాణాలుపోసిన కమ్యూనిస్టు కళాకారుడు, శ్రామికవర్గ కళవాలం కామ్రేడ్ సఫ్దార్ హష్మీ 1954 ఏప్రిల్ 12న ఢిల్లీలో హనీఫ్, ఆజాద్ హష్మీ దంపతులకు జన్మించారు. 1989, జనవరి 2న ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో తన 35వ ఏట కన్నుమూశారు. ✦

సి. రామ్మోహన్ సంస్మరణలో....

# కథలే మిగిల్చి కరగిపోయిన 'రాచకొండ'కు కలాల నివాళి

**"అన్యాయానివి** కోరల కరువులే; ఊరుకోలేక ఉండబట్టలేక వడివడిగా తడబడుతూ వెళ్ళి చూస్తే

మిల్లు చుట్టూ మర తుపాకులే; వాటికెడంగా జన ప్రవాహమే.... రోడ్డు నిండా ఉడుకు రక్తపు

మడుగులే మడుగులే; అందులో ఎర్రనెర్రని వెన్నెలే తడి వెన్నెలే; నెత్తురంతా చిమ్మి

అరవై మందొక్కసారి కూలినపుడు నెత్తురంతా ఒకటే; అవును తల్లీ ఒక్కటే మా నెత్తురంతా ఒక్కటే"

ఇదీ సంతకం అక్కరలేని వచనం; ఉవ్వెత్తున లేచి ఎగసిపడే కెరటం వెనుక కెరటం, వుపమానం వెంట వుపమానం, విశాఖ సంద్రంలా హోరెత్తుతూ, చదువరులను ఉక్కిరి బిక్కిరి చేస్తూ పరవళ్ళ గోదారిలా సాగే శైలిలో, రావిశాస్త్రి, తప్ప మరెవరూ వ్రాయలేరన్నది "నిజం." ఆధునికాంధ్ర సాహిత్యాకాశంలో ప్రచండ భాస్కరుడై సముజ్జ్వలంగా ప్రకాశించి, తెలుగు కథకు, నవలకు అనితర మార్గం నిర్దేశించి, మనకు కథలే మిగిల్చి కరిగిపోయాడు రాచకొండ. విశాఖ సముద్రంలో ఎగసిపడే కెరటాలను సముదాయించలేక ఏరాడకొండ ఎంత అవస్థ పడిందో! నవంబరు పదవ తేదీ ఉదయం 9 గం॥ 45 ని॥లకు విశాఖలో కన్నుమూసిన రాచకొండ విశ్వనాధశాస్త్రి, మరణవార్త సాహిత్యాభిమానులను దుఃఖంలో ముంచి వేసింది. ఏడవ చంద్రుడు – ఒకే విశ్వంతో మానవ జీవన భూగర్భం ఛేదించి, వీక్షించి, సమీక్షించి తన సాహితీ శైలి నైపుణ్యంతో మన ముందుంచబోయే అద్భుత సత్యాలను, అనుభవాలను తెల్సుకొనే అదృష్టాన్ని తెలుగు పాఠకులు కోల్పోయారు; "నాకు మృత్యువు ఆసన్నం అవుతోంది. నేను ఎవ్వర్నీ మోసం చేసి అబద్దాలు ఆడి మూటకట్టుకొని మోసుకుపోవలసింది ఏమీ లేదు" అని చాలా వినమ్రంగా, నిరాడంబరంగా పల్కుతూ మృత్యు శయ్యపై నుండి కూడా విరామ మెరుగక 'ఇల్లు' నవలను పూర్తి చేసిన రావిశాస్త్రికి మరణం లేదు; మరణించినా మన స్మృతుల్లో చిరంజీవిగా నిల్చిపోతాడు.

అభ్యుదయ రచయితలు ఆగిపోయిన చోటు నుంచి రావిశాస్త్రి పయనం ప్రారంభమౌతుంది. "సమాజాన్ని వేయి కళ్ళతో కనిపెట్ట గల్గినవాడే సిసలైన రచయిత. ఆ పని యిదివరకు కొడవటిగంటి చేశాడు. ఇప్పుడు రావిశాస్త్రి చేస్తున్నాడు. కథలు మాత్రమే రాసిన కొడవటిగంటిని ఒకప్పుడు నేను ఛెకోవ్‌తో పోల్చాను. నాటక రచయిత కూడా అయిన రావిశాస్త్రి, ఆ పోలికకు యింకా అర్హుడు–" అన్న మహాకవి శ్రీశ్రీ మాటల్లో తెలుగు వచన సాహిత్య గమనాన్ని నిర్దేశించే అసాధారణ ప్రజ్ఞ, అపూర్వ శైలి, రాజీలేని నిబద్దత గల రచయిత రావిశాస్త్రి, అని చెప్పనక్కరలేదు.

ఆయన అరుదుగానే వ్రాసేవారు. కాని కథ, దాని సంవిధానం, పాత్రల చిత్రణ అద్భుతంగా, సజీవంగా రూపుదిద్దుకునే వరకు వ్రాసేవారుకారు. అయన నాల్గున్నర దశాబ్దాల కాలంలో "భారతి"లో మొదటి కథ ప్రారంభించిన నాటి నుండి 'ఇల్లు' నవల దాకా సృష్టించిన సాహిత్యం తక్కువేమీ కాదు; 'మూడు కథల బంగారం', 'ఋక్కులు', 'ఆరు చిత్రాలు', 'ఆరు సారా కథలు', 'సారో కథలు', 'కలకంఠి', 'రావిశాస్త్రి కథలు' మొదలయినవి కథా సంకలనాలు. 'అల్పజీవి', 'రాజు మహిషి', 'గోవులొస్తున్నాయ్ జాగ్రత్త', 'రత్తాలు–రాంబాబు', 'ఇల్లు' నవలలు. 'నిజం', 'విషాదం', 'తిరస్కృతి' నాటకాలు, అనేక పుస్తకాలకు వ్రాసిన ముందుమాటలూ, వ్యాసాలు 'రావిశాస్త్రీయం'గా ఆయన తెలుగువారి కిచ్చిన అపూర్వ వారసత్వ సంపద. చిత్తశుద్ధి, నీతి నిజాయితీ, విశ్వసనీయత గల ఒరిజినల్ రచయిత రావిశాస్త్రి. ఎవరి కోసం రాస్తున్నాడో, ఎందుకు రాస్తున్నాడో చాలా స్పష్టంగా, బాధ్యతగా రచనా వ్యాసంగం చేశాడు. కీర్తి కండూతికో, పదవులకో, సన్మానాలకో, ఎవరినో సంతోషపెట్టడానికో తన కలాన్ని సారించలేదు; అక్షరాయుధుడై ఆగ్రహంతో, ఆవేశంతో కోర్టుల, జెయిళ్ళ, పోలీసుల, ప్రభుత్వ కార్యాలయాల, సారా కాంట్రాక్టర్ల, పైరవీరాయుళ్ళ, ధన మదాంధుల, భోగలాలసుల, భూ కామాందుల అకృత్యాలను, అన్యాయాలనూ, దౌర్జన్యాలనూ, కపటత్వాన్నీ, చీల్చి చెండాడాడు; కలం కొరడా ఝుడిపించి అక్రమాలపై తిరుగబడమని ప్రబోధించాడు. నిత్య దరిద్రంలో కడుపు నిండక రాక్షస రతికి బలౌతున్న పతితులూ, నేరగాళ్ళూ, జూదగాళ్ళూ, వ్యవస్థ ఉక్కు చట్రంలో నలిగిపోతున్న అధోజగత్ సహోదరులూ, అమాయకులూ, అభాగ్యులూ, అల్పజీవులూ ఆయన కథల్లో, నవలల్లో ప్రాణం పోసుకున్నారు. విశాఖ మాండలికంలో వారంతా సజీవంగా దృశ్యాలై, మన హృదయాలపై చెరగని, మరవని ముద్ర వేస్తారు. "ఈ (భగవత్) సృష్టిలో న్యాయం లేదు; ధర్మం లేదు; సత్యం శివం లేనే లేవు; ఇంతవరకూ కొంతవరకూ సర్వ జీవ జాలాన్నీ సమన్వయపరచి, సమానత్వం సాధించి, న్యాయం నిలబెట్టి ధర్మ సంస్థాపనకు తాపత్రయపడేది మానవుల్లో కోటికి ఒక్కడే; కోటికి ఒక్కడైనా మానవుడే మానవుడే!" (అవి) తన "ఇల్లు" – చివరి నవలలో చివరి సందేశంగా తన ఆచరణగా తన అన్ని రచనల్లోనూ "మానవుడే సందేశంగా" బ్రతుకు రుచి చూపించిన మహా రచయిత ఆయన. మానవ సంబంధాల అంతర్మథనాన్ని ఎంతో చిక్కగా, సున్నితంగా, సుళువుగా, ప్రభావితంగా వీక్షించి, కాంక్షించి రచనలు చేశాడు. తన ప్రాపంచిక దృక్పథపు సునిశితత్వంతో, అద్భుత శైలితో పాఠకులను ఉర్రూతలూగించి, తన్మయత్వంతో తన వెంట లాక్కెళ్ళి, అమోఘమైన తాత్త్వికత ముగింపుతో హృదయాలపై చెరగని ముద్ర వేశాడు. వర్షం, ఆడవి, వెన్నెల, చంద్రుడూ,

సముద్రం, చెట్టూ చేమా, చీమా, నల్లమేక , పులి, పాము, ఇంద్రధనస్సు – ఒక టేమిటి ప్రకృతిలోని సమస్త వస్తువులూ ఆనందం, దుఃఖం కల్గించేవి, మనం ద్వేషించేవి, ప్రేమించేవి. ఆయన ఉపమానాలతో క్రొత్త ఊపిర్లతో మనల్నీ ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. మనిషిని, ప్రకృతిని అర్థం చేసుకోవడానికి, మానవుల మధ్య కోపాలు, తాపాలు, ఉద్రేకాలు, ఆనందాలు, దౌర్జన్యాలు, కుట్రలు, కుహకాలు, త్యాగాలు, చావులూ, సంక్లిష్ట సాంస్కృతిక విలువల్ని సాహిత్య అద్దంలో మనకు స్ఫటికమంత నిర్మలంగా చూపించాడు. తెలుగు సాహిత్యంలో ఏ రచయితా తొంగి చూడని చీకటి కోణాలను వెలికి తీశాడు. మరీ ముఖ్యంగా కోర్టులు, పోలీసులు, చట్టాలు ఎంతగా సంపన్నుల, భూ కామందుల, దళారీల పక్షమో, ప్రజాస్వామ్యమెంత బూటకమో, న్యాయం, ధర్మం, నల్లకోటు రాబందులూ, ఖాకీ లాఠీలు, చట్టాల ఉక్కు చట్రాల క్రింద నలిగి, మూలిగి విధ్వంసం కావించబడుతున్నవో విస్పష్టం కావించిన తీరు అమోఘం. రావిశాస్త్రి, కలం తన వాడిని, వేడిని సంతరించుకునే సమయానికి తెలుగుదేశంలో రాజకీయార్థిక రంగంలో తలెత్తిన మార్పుల ఫలితంగా ఆవిర్భవించిన నూతన దళారీ ధనిక వర్గం, కుహనా మధ్యతరగతి, లంపెన్ ప్రోలటేరియన్ పాత్రలనూ, మానవ సంబంధాలలో పడిపోతున్న విలువల చిత్రణనూ, అనివార్యంగా పోరాటం తప్ప మార్గం లేదని సంఘటిత పడుతున్న చైతన్యాన్ని జీవద్భాషలో రావిశాస్త్రి, కలంలో సజీవతను సంతరించుకున్నవి.

కవిత్వం వ్రాయాలనీ మహాకవుల స్థాయిలో కవిత సాధ్యంకాక వచనంలోకి అడుగు పెట్టాననీ, "తానొక ఫేయిల్డ్ పోయెట్" అని వినమ్రంగా చెప్పుకొన్న రావిశాస్త్రిగారి ప్రతి కథలో, నవలలో కవిత్వం గలగల పారే జలపాతంలా, ఎగిసిపడే సంద్రంలా, ఎర్రని సాయం సంధ్యలా, స్వచ్ఛమైన గాలికి ఊయలలూగే వరిచేనులా మనల్ని ఉద్విగ్నుల్ని, ముగ్ధుల్ని చేస్తుంది. వచనానికి కవిత సొగసు తొడిగి పఠితల హృదయాలకు ఉద్వేగాన్ని, వచన రచనకు సరికొత్త పంథాను అలరించారు. కొందరు ఆధునిక కథా రచయితలు, సాహితీ విమర్శలు ఆయన శిల్పంపై, శైలిపై, భాషపై విమర్శలు కురిపించినా, రావిశాస్త్రి తాను విశ్వసించిన, నచ్చిన పంథాలోనే తన సాహిత్యమంతా సృజించి, అత్యుత్తమ సృజనాత్మక రచయితగా ఆంధ్ర చెహోవ్, మొపాసా, డికెన్స్‌గా కీర్తి గడించాడు. విశ్వ సాహితీ లోకంలో తెలుగు కవితకు శ్రీశ్రీ పట్టం కట్టగా, వచన రచనకు రావిశాస్త్రి, ఆ అపూర్వ స్థానం కల్పించి వచన రచనా మహాశ్రీ మరో శ్రీశ్రీ అనిపించుకున్నాడు.

వ్యక్తిగత జీవితంలో ఎవరి తప్పులెన్నైనా క్షమించే చల్లని చిరునవ్వుల వెన్నెల అతడు. కాని సాహిత్యంలో రచయితగా ఎవరి తప్పుల్నీ క్షమించలేదు. "రచయిత ప్రతివాడూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కల్గిస్తుందో ఏ చెడ్డకి వుపకారం చేస్తుందోనని ఆలోచించ వలసిన అవసరం వుందని నేను తలుస్తాను. మంచికి హాని చెడ్డకి సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను. ఇది తెలుసుకుందికి తెలియజెప్పడానికీ నేనిదంతా రాసేను" – అలా స్పష్టమైన, శాస్త్రీయమైన సామాజిక బాధ్యత రచయితకుండాలని విశ్వసించి రచనలు చేశాడు. వ్యవస్థపై రచయితగా యుద్ధ భేరీ మోగిస్తూ, విప్లవ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా వుండి, ఇందిరాగాంధీ నిరంకుశ పాలనలో అత్యవసర పరిస్థితి కాలంలో రెండు సంవత్సరాలు చెఱసాల జీవితం అనుభవిస్తూ విశాఖ జైలులో "రత్తాలు–రాంబాబు" నవల రచించాడు. తన వ్యక్తిగత జీవితం, యితర కారణాల వలన విరసానికి రాజీనామా చేసినా, భావజాల పరంగా విప్లవ ప్రజాతంత్ర సాహిత్య, సాంస్కృతికోద్యమానికి చాలా ఆప్తుడుగా, ఏరాడ కొండంత అండగా నిలబడిన రచయిత రావిశాస్త్రి, విశాఖ జిల్లా పౌర హక్కుల సంఘం బాధ్యతగా ప్రముఖ విప్లవకారుడు నాగభూషణం పట్నాయక్‌కు డిఫెన్స్ లాయర్‌గా, సికింద్రాబాదు కుట్ర కేసులో ముద్దాయిలైన వరవరరావు, చెరబండరాజు యితర రచయితల పక్షాన కోర్టులో వాదించాడు.

సాహిత్య అకాడమీ అవార్డులనూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదులనూ తిరస్కరించిన రావిశాస్త్రి, తానంగీకరించని ఆలోచనలు, ఆచరణతో రాజీ పడలేదు. వృత్తి రీత్యా క్రిమినల్ న్యాయవాదిగా విశాఖపట్నంలో ఏ దిక్కూమొక్కు లేని అమాయకులకు, రాజకీయ ఖైదీలకు అండగా నిలిచాడు. కోర్టు చుట్టూ, జైళ్ళ చుట్టూ, సారా కొట్ల చుట్టూ, పోలీసు స్టేషన్‌లో విధి వంచితులు, బాధా సర్పద్రష్టులే ఆయన క్లయింట్స్. వారితో మాట్లాడి, వారి భాషతో తాను తాదాత్మ్యం చెంది ఆ ఉత్తరాంధ్ర అట్టడుగు వర్గాల భాషను అంత సొగసుగా, పదునుగా, శక్తిగా స్వంతం చేసుకుని కథలల్లాడు. తెలుగు కథలో, నవలలో సామాన్యునికి మాన్యుడిగా స్థానమిచ్చిన రావిశాస్త్రి, నిజంగానే ధనస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించాడు, తిరస్కరించాడు, విధ్వంసం కావించండని పిలుపిచ్చాడు. విప్లవం తప్ప మరో మార్గం లేదన్నాడు.

ఆయన పులులను, సింహాలను ద్వేషించాడు. లేళ్ళను, ఉడుతలను ప్రేమించాడు; ఆయన పాములను ద్వేషించాడు, చీమలను ప్రేమించాడు. సంపన్నులను ద్వేషించాడు, లేనివాళ్ళను ప్రేమించాడు. అడవిని ప్రేమించాడు, వెన్నెలను ప్రేమించాడు. ధనస్వామ్య వ్యవస్థను ద్వేషించాడు. సమసమాజాన్ని ప్రేమించాడు. ఆయన 'మానవుణ్ణి' ప్రేమించాడు, వాళ్ళ ఆకాంక్షల్ని, పోరాటాన్ని ప్రేమించాడు. అందుకే రావిశాస్త్రిని, ఆయన కథల్ని తెలుగు ప్రజలందరూ ప్రేమించారు. వాటిని ప్రేమతో వారసత్వంగా స్వీకరిస్తారు. రావిశాస్త్రి ద్వేషించిన వారిని మనం ద్వేషించి, ఆయన ప్రేమించిన వారిని మనం ప్రేమించి, ఆయన తిరస్కరించిన వాటిని మనం తిరస్కరించి, నిక్కచ్చిగా, నిటారుగా ప్రజల పక్షాన నిలబడి రచనలు చేయడమే నేటి ప్రజాతంత్ర సాహిత్యోద్యమ కర్తవ్యం. మరణించి జీవించిన, మన స్మృతులనెన్నడూ వీడిపోని తెలుగువాడి మహోన్నత రావి శిఖరానికి "జనసాహితి", "ప్రజాసాహితి" విప్లవ సాహితీ నివాళులర్పిస్తున్నది; ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నవి.

రాచకొండ అమరుడు.

**('ప్రజాసాహితి' 1993 డిసెంబరు సంచిక రావిశాస్త్రి ప్రత్యేక సంచికగా వెలువడింది. ఆ సంచికకు సి.రామ్మోహన్‌గారు రాసిన సంపాదకీయం ఇది)✦**

# సంతాపాలు

## మార్క్సిస్టు మేధావి ఐజాజ్ అహ్మద్ అస్తమయం

**సాహిత్యం,** సాహిత్య విమర్శ, చరిత్ర, తత్త్వశాస్త్రం, రాజకీయశాస్త్రం, రాజకీయ ఆర్థికశాస్త్రం మొదలైనవాటిలో విశేష కృషి చేసిన మేధావి ఐజాజ్ అహ్మద్ తన 81వ యేట 9-3-2022న కాలిఫోర్నియాలో మరణించారు. ఆయన 1941లో ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఒక సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. దేశ విభజన కారణంగా వారి కుటుంబం లాహోర్‌కు వలస వెళ్ళింది.

లాహోర్‌లో ఎం.ఏ. ఇంగ్లీషు చదివిన ఐజాజ్, 'పాకిస్తాన్ ఫోరం' పత్రికలో వామపక్షాన్ని సమర్థిస్తూ రాయగా, సైనిక నియంత యాహ్యాఖాన్ ఆగ్రహానికి గురై, న్యూయార్క్‌కు తప్పించుకొని పారిపోయారు. ఆ తర్వాత అమెరికా ఫిలిప్పైన్స్, మెక్సికో కెనడాలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో టొరంటోలోని వై.ఎన్.కె. విశ్వవిద్యాలయంలో పనిచేశారు. 1980లలో ఇండియాకు దీర్ఘకాలిక వీసాపై వచ్చి, జె.ఎన్.యు.లో రాజకీయాల అధ్యయన కేంద్రంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. జామియా మిలియా ఇస్లామియాలో ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ పేరుతో వున్న శాఖకు అధ్యక్షులుగా వున్నారు. 2014లో బి.జె.పి. ప్రభుత్వం దీర్ఘకాలిక వీసాకు అనుమతి నిరాకరించినందున కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో తులనాత్మక సాహిత్య విభాగ అధిపతిగా వెళ్ళారు.

ఆయనకు ఉర్దూ కవిత్వమూ, అందులోనూ గజల్స్ అంటే చాలా ఇష్టం. 1971లో 'గాలిబ్ గజల్స్'ను ఇంగ్లీషు ప్రపంచానికి పరిచయం చేశారు. కళలు – సాహిత్యంపట్ల విశేష ఆసక్తి వున్న ఐజాజ్ "వర్గాలు – జాతులు – సాహిత్యం – సిద్ధాంతం" అనే ప్రసిద్ధ గ్రంథం రచించారు. మార్క్సిజంపై ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న దాడిని త్రిప్పికొడుతూ మార్క్సిజం ప్రాధాన్యతను తన వందలాది వ్యాసాల్లో తెలియచేశారు. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికపై అద్భుతమైన వ్యాఖ్యానం అందించారు. 'అనంతరవాదాలు' (Post-isms) అన్నీ అమెరికా గూఢచారి విభాగపు కుట్రే అన్నారు. ఇవన్నీ మార్క్సుకు పూర్వం వున్న భావవాదం తప్ప వేరుకాదన్నారు. మార్క్సిస్టు సిద్ధాంతాలపై ఆధారపడిన విమర్శనాత్మక సాహిత్య విమర్శకునిగా గుర్తింపు పొందారు. ఆధునిక సామ్రాజ్యవాద లక్షణాలను వివరిస్తూ, హిందుత్వ భావజాలంలోనే బీజరూపంలో ఫాసిజం వుందన్నారు.

మార్క్సిస్టు మేధో సంప్రదాయాన్ని తన వ్యాసాలలో గట్టిగా సమర్థించిన ఐజాజ్ రాసిన మరో రెండు ప్రసిద్ధ గ్రంథాలు – 1. 'వారసత్వాలు – వర్తమానం – రాజకీయ వ్యాసాలు'; 2. 'ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, మనకాలపు సామ్రాజ్యవాదం'.

## శ్రీలంక తమిళ మార్క్సిస్టు రచయిత సె. గణేశలింగం మరణం

**మార్క్సిస్టు** భావజాలంతో పలు రచనలు చేసిన సె. గణేశలింగం 04-12-2021న చెన్నైలో తన కూతురి ఇంట్లో 93వ యేట మరణించారు. ఆయన శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని జాఫ్నా జిల్లాలో ఉరుంపిరాయి అనే వూరిలో 09-03-1928లో జన్మించారు.

సాధారణ విద్యనభ్యసించిన గణేశలింగం శ్రీలంక ప్రభుత్వశాఖలో 1950 నుండి 1981 వరకు పనిచేశారు. విద్యార్థిగానే ఆయన మొదటి కథ రాశారు. 1958లో మొదటి కథాసంపుటి వెలువరించారు. 1965లో 'నీందాపయనం' (సుదీర్ఘ పయనం) అనే తన మొదటి నవల కుల అణచివేత వస్తువుగా రాశారు. దానికి ముందుమాట ప్రసిద్ధ తమిళ మేధావి ఎం. వరదరాజన్ (ము.వ.) రాశారు. దీనికి శ్రీలంక సాహిత్య మండలాయవారి బహుమతి లభించింది.

1987–1999 మధ్య ఆయన శ్రీలంకలోని తమిళజాతి సమస్య పైన 10 నవలలు రాశారు. మొత్తం 71 నవలలు, 7 కథాసంపుటాలు, 23 వ్యాస సంపుటాలు, 8 బాలసాహిత్యం, ఎన్నో అనువాదాలు ఆయన సాహిత్య సృష్టి. కచ్చాతీవు వివాదం, వియత్నాం, చిలీ మొదలైనవాటిపై వ్యాసాలు రాశారు.

తిరుక్కురళ్ – 'కౌటిల్యుని అర్థశాస్త్రం'; మాకియవిల్లీ – 'ది ప్రిన్స్' భగవద్గీతలపై తులనాత్మక పరిశీలన చేశారు.

'కుమారన్' అనే పత్రికను మార్క్సిస్టు తత్త్వశాస్త్రం కేంద్రంగా 1971–1983ల మధ్య నడిపారు. ఆయన తమిళభాషా ప్రేమికుడేగాని దురభిమాని కాదు.

శ్రీలంకలో 1983 ప్రాంతంలో తమిళులను వ్యతిరేకిస్తూ మూకుమ్మడి హత్యాకాండ సమయంలో గణేశలింగం కుటుంబానికి ఒక సింహళ కుటుంబం ఆశ్రయం ఇచ్చి రక్షించింది.

## కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు మరణం

**శ్రీ** కాట్రగడ్డ, శ్రీకా అనే కలంపేర్లతో కవితలు రాసిన కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు 17-3-2022న తన 83వ ఏట మరణించారు. ఆయన 1941 జులై 26న కృష్ణాజిల్లా గుడివాడ తాలూకా శేరిదింటికుర్రు గ్రామంలో జన్మించారు.

జమీగొల్వేపల్లి, అడ్డాడ, కొవ్వలిలో విద్యాభ్యాసం తర్వాత కోఆపరేటివ్ సూపర్‌వైజర్ శిక్షణ పొంది 1962లో పోస్టల్ శాఖలో చేరారు. 2001 జులైలో పోస్టుమాస్టర్‌గా రిటైరయ్యారు. ఏలూరు వద్ద పెదపాడు గ్రామంలో స్థిరపడ్డారు.

'కవితాజ్వాల', 'అభినవశ్రీశ్రీ' మొదలగు బిరుదులు పొందిన కాట్రగడ్డ, స్నేహపీఠం పేరుతో నెలకొక కవితాసంపుటి 14 నెలలు ప్రచురించారు. వివిధ కవుల రచనలను అచ్చువేయించి, ఆయా రచయితలకు కానుకగా ఇచ్చేవారు. ఉత్తమ రచయితగా ఎంపిక చేసినవారికి పదివేల రూపాయలు బహుమతి ఇచ్చేవారు.

ఆయన చివరి సంవత్సరాలలో 27 వేల తెలుగు పుస్తకాలను స్పష్టంగా తన కంచు కంఠంతో వాయిస్ రికార్డింగ్ చేసి ఆ రచయితలకు ఉచితంగా అందించారు. వీటిలో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, భారత, భాగవతాలు, ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర – 14

సంపుటాలు, శ్రీశ్రీ సమగ్ర రచనలు, ఇటీవల శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురించిన మొదటి 100 పుస్తకాలు మొదలైనవి వున్నాయి.

## ప్రజాకళాకారుడు డప్పు రమేశ్ మరణం



**నాలుగు** దశాబ్దాలుగా జననాట్యమండలి, ప్రజాకళామండలి గాయకునిగా, డప్పు కళాకారునిగా విప్లవోద్యమంలో కృషిచేసిన పట్టపు రమేశ్ 18-3-2022న తన 62వ యేట విజయవాడలో మరణించారు. ఆయన అసలుపేరు ఎలియాజిర్. ఆయన గుంటూరు జిల్లా అంగలకుదురులో 1960లో జన్మించారు. పిడుగురాళ్ళ దగ్గర జూలకల్లులో స్థిరపడిన రమేశ్ కళాకారునిగా బహిరంగ జీవితంలోనూ, అజ్ఞాతంలోనూ దండకారణ్యం, ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు ప్రాంతం, ఒరిస్సా, జార్ఖండ్, ఆదివాసీ ప్రాంతాల్లో విరివిగా కృషిచేశారు. తెలుగు, మరాఠీ, కోయ, కుయి భాషల్లో పాటలు పాడేవారు. అరెస్టులు, కేసులు ఎదుర్కొన్నారు. గద్దర్‌కూ, వంగపండుకు డప్పు సహకారం అందించారు. 1992 మే 21న జననాట్యమండలిని నిషేధించినపుడు అజ్ఞాతంలోకి వెళ్ళారు. ప్రభుత్వంతో చర్చల సందర్భంగా బహిరంగ జీవితానికి వచ్చారు.

## సాహిత్యాభిలాషి కట్టమంచి అయ్యస్వామి ప్రభావతి మరణం



**జనసాహితి** రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శాంతికుమార్‌గారి జీవిత సహచరి కట్టమంచి అయ్యస్వామి ప్రభావతి తేదీ: 23-03-22న తన 75వ ఏట ఒంగోలులో తుదిశ్వాస విడిచారు. 02-08-1947న చిత్తూరులో ఆమె జన్మించారు. ఒంగోలు మహిళా సమాజం అధ్యక్షులుగా, సమతా మహిళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా మహిళా సమస్యల పరిష్కారానికై తనవంతు కృషి చేశారు. ప్రగతిశీల సాహిత్య ఉద్యమ కార్యకర్తలు ఆ ఇంటిని తమ సొంత ఇల్లు అనుకునేంతగా వారి పట్ల ఆమె ప్రేమగా వ్యవహరించేవారు.

బి.ఏ., బి.యిడి. చదివిన ఆమె ఒంగోలులో రజతోత్సవం జరుపుకున్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ వ్యవస్థాపక ప్రధానోపాధ్యాయినిగా విద్యాలయాన్ని కూడా నిర్వహించారు. ప్రస్తుతం వృద్ధాశ్రమాన్ని నడుపుతూ వున్నారు. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ప్రభావతి మరణానికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబ సభ్యుల బాధలో పాలుపంచుకుంటున్నాం.

## గుమ్మా ప్రసాదరావు

**భార్య** గుమ్మా నిత్య కళ్యాణమ్మ పేరే కలంపేరుగా పెట్టుకుని దాదాపు 250 కథలు రాసిన గుమ్మా ప్రసాదరావు తాను స్థిరపడిన మధ్యప్రదేశ్‌లో తన 84వ యేట 26-2-2022న మరణించారు. ఆయన 16-1-1938లో జన్మించారు.

37 ఏళ్ళపాటు ఆయన మధ్యప్రదేశ్ ప్రభుత్వం వారి డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేశారు. 'సంకల్పం-సంబంధం', 'నింగీ-నేలా' అనే కథాసంపుటాలూ, 'పుత్రేషణ', 'కొమ్మకొమ్మకో సన్నాయి', 'ఈబంధమేనాటిదో', నవలలు రచించారు. వారి వ్యాసాలు, కవితలు, కథలు వివిధ పత్రికలలో ప్రచురితమైనాయి.

## తెలుగు అధ్యాపకులు వుమ్మనేని పాపయ్య మాస్టారు మరణం

**వామపక్షవాది,** భౌతికవాది వుమ్మనేని పాపయ్య 24-3-2022న తన 96వ యేట తెనాలిలో మరణించారు. ఆయన 1926లో ప్రకాశం జిల్లా ధేనువుకొండ శివారుగ్రామం వుమ్మనేనివారిపాలెంలో జన్మించారు.

ఒంగోలు హైస్కూలులోనూ, గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలోను చదివిన పాపయ్య, విశాఖపట్టణం ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో తెలుగు బి.ఏ. ఆనర్స్, ఎం.ఏ. పూర్తిచేశారు. విద్యార్థిగా వున్నపుడు ఏఐఎస్‌ఎఫ్ ఉమ్మడి గుంటూరుజిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 1954 నుండి 1986 వరకు తెనాలిలోని వి.ఎస్.ఆర్. కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా, శాఖాధిపతిగా వున్నారు. రిటైరైన తర్వాత గుంటూరు, విజయవాడలోని గౌతమ్ కళాశాలకు తన సేవలందించారు.

ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యంపైనా, మార్క్సిజంపైనా పట్టు సాధించిన పాపయ్య సమకాలీన తెలుగు సాహిత్యంపైనా, హేతువాద ఉద్యమంపైనా చివరివరకూ చర్చిస్తూ వుండేవారు. ఆయన 'ప్రజాసాహితి' అభిమాని. 'ప్రజాసాహితి' గ్రంథాలయానికి వారి ఇంట్లోని విలువైన చెక్కబీరువాని బహూకరించారు.

వారి మృతికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది.

## డా॥ రాచకొండ (మైనేని) అన్నపూర్ణాదేవి మరణం

రావిశాస్త్రి సోదరుడు డా॥ రాచకొండ నరసింహశర్మ సహచరి మైనేని అన్నపూర్ణాదేవి తన 97వ యేట విశాఖపట్నంలో 08-03-2022న మరణించారు. ఆమె స్వగ్రామం కృష్ణాజిల్లా ఉయ్యూరు సమీపంలోని కుమ్మమూరు గ్రామం.

వారు వైద్యవిద్యార్థిగా విశాఖలో చదువుతున్నప్పుడే తనతోపాటు చదువుతున్న నరసింహశర్మను వర్ణాంతర వివాహం చేసుకున్నారు. అమెరికాలో సుదీర్ఘకాలం పనిచేసి గత మూడు దశాబ్దాలుగా, విశాఖలో వుంటున్నారు. నరసింహశర్మ ప్రముఖ ఇంగ్లీషు కవుల కవితలను తెలుగులోకి అనువదించి ప్రచురించారు. ఆయన 'ప్రజాసాహితి' చందాదారుడు, అభిమాన పాఠకుడు.

## నటుడు, దర్శకుడు, కథ, నవలారచయిత తల్లావఝ్ఝుల సుందరం మరణం

**ప్రముఖ** నటుడు, దర్శకుడు తల్లావఝ్ఝుల సుందరం తన 72వ ఏట 21-3-2022న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు.

ఆయన 29-10-1950న ఒంగోలులో జన్మించారు. బియస్సీ చదివిన సుందరం, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రంగస్థల కళలో పి.జి. డిప్లొమా కోర్సు చేశారు. 1957లో బాలనటుడిగా నటనారంగంలో ప్రవేశించి, దాదాపు 200 నాటికలలో నటించారు. అంతేగాక ఆయన దర్శకుడు, ప్రయోక్త, కథా, నవలా రచయిత కూడా.

'గార్దభాండం', 'కొక్కొరోకో', 'గోగ్రహణం', 'జంబూద్వీపం', 'పోస్టరు', 'ఈహామృగం' వంటివాటిని నూతన ప్రయోగాలతో రూపొందించి ప్రదర్శించారు. పలు వ్యంగ్య, హాస్య నాటికలకు దర్శకత్వం వహించారు. కొన్ని వీధి నాటికలు తయారుచేశారు. నాటక రంగానికి చెందిన పలు అవార్డులు అందుకున్నారు. ✦

కవిత

## జ్ఞాపకాల పుస్తకం

**- ఏటూరి నాగేంద్రరావు**

వాడో జ్ఞాపకాల పుస్తకం
వాడి శరీరం కత్తులతో చీల్చబడింది
కన్నీళ్లను త్రాగుతూ
జీవితంతో కరచాలనం చేస్తూ
అభినయం చేస్తున్న ఒంటరి!

వాడు
కాలం నిర్దాక్షిణ్యంగా నెట్టేసిన శిథిలాల్లో
స్వప్నాన్ని వెతుక్కుంటున్న బేహారి!

నెట్టుకుంటూ
తోసుకుంటూ
తొక్కుకుంటూ
సరికొత్త భాషతో
అంగాంగం ఓ పుర్రగై
ఆయుధాల శిబిరాల నుంచి
వేటగాడి అరుపుతో
ఆయుధాన్ని వాగ్దానం చేస్తున్న
ఈ దేశపు నిత్య దరిద్రుడు వాడు!

వాడు
బ్రతకడానికి అవసరమైన కలల్ని నింపే
ఉత్సాహ గానం!

వాడు
ఆకలి చావా, బుల్లెట్టా అని ఎదురుచూసే
ఆశల చుక్క!

మిత్రమా!
ఆత్మ చివరి క్షణాల పెనుగులాటలో కూడా
మనిషి పాట వినిపించే రాగానివి నువ్వు
చీకట్లను చీల్చుతూ నీపాట ప్రవహిస్తూనే ఉంటుంది. ✦

కవిత

## లైన్ క్లియర్

**-తమ్మినేని అక్కిరాజు**

**లైన్ క్లియర్**
లైన్ క్లియర్
ఐదు రాష్ట్రాల్లో
భారతీయజన
తకు-లైన్ క్లియర్!!

జనారణ్యంలో
పెద్దజంతువుల
క్రూరవిహారం
భవిష్యదృశ్యం
లైన్ క్లియర్!!

రాబందుల
రెక్కలచప్పుడు!
పిల్లకాకుల్ని
పొడుచుకుతిన
లైన్ క్లియర్!!

బ్యాంకులు దివాళా
ఎల్ఐసి బియస్సెన్నెల్
ప్రభుత్వ సంస్థలన్నీ
ఉక్కు ఎలక్ట్రానిక్స్
లైన్ క్లియర్!!

ఏనాడో తలచిన
స్వర్గం-ఈనాడే
ఎదురైవస్తే-వీళ్ల
రియల్ ఎస్టేట్‌కు
లైన్ క్లియర్!!

మూడుచట్టాల
వ్యవసాయ భూమి
మో'ఠి'మాయ!
దృశ్యమానమై
లైన్ క్లియర్!!

చిన్న జీవుల్ని
నోరెత్తకుండా
కిక్కురుమనకుండా
తొక్కిపెట్టేందుకు
లైన్ క్లియర్!!

భారతదర్శనం
చిన్నకమతాలన్నీ
పెద్దల రంగస్థలం
వ్యాపార క్షేత్రాలై
లైన్ క్లియర్!!

మనుస్మృతి
రాజ్యాంగమై
మూతికిముంత
ముడ్డికిచీపురు
లైన్ క్లియర్!!

నీతులగోతుల్లో
పేదలబతుకుల
సమాధికట్టే
షరాబులకు
లైన్ క్లియర్!! ✦




అంతర్జాలం నుండి

# నిబద్ధత, నమ్రత, సంయమనం మూర్తిభవించిన విప్లవ రచయిత
# కామ్రేడ్ సి. రామ్మోహన్‌కు జోహార్లు!

**కామ్రేడ్** చుక్కంభొట్ల రామ్మోహన్ తన 74వ ఏట 8 మార్చి 2022న హైదరాబాదులో క్యాన్సర్ వ్యాధితో మరణించారు. మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లా గోపాలపేట మండలంలోని కదిరిపాడు గ్రామంలో 1948 జూన్ 8న జన్మించారు. వీరు వనపర్తి, మహబూబ్‌నగర్, పాలెం తదితర చోట్ల విద్యనభ్యసించి తొలుత బేసిక్ హైస్కూలు ఉపాధ్యాయునిగా తరువాత జూనియర్ కళాశాలలో సామాజిక శాస్త్రాల బోధకునిగా పని చేసి 2006లో పదవీ విరమణ చేశారు.



మొదటిసారి "పాలమూరు లేబర్" పుస్తకం ద్వారా, మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగం శ్రమజీవులు వలస బాట పట్టడానికి గల కారణాలను 1980వ దశకం నడుమ లోకం దృష్టికి తెచ్చిన వ్యక్తి సి. రామ్మోహన్. రామ్మోహన్ విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు. కామ్రేడ్ రామారావు నాయకత్వాన ఉండిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యకు బాగా సన్నిహితుడు.

రామ్మోహన్ విరసంలో చేరిన 1977 నుండీ చివరిదాకా అందులోనే వున్నారు . కొంతకాలం విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేశారు. కానీ ఒకానొక దశనుండి జనసాహితి మౌలిక అవగాహనతో ఏకీ భావంతో వుండేవారు. 1991ఆగస్టు 6న జరిగిన చుండూరు హత్యాకాండకు వ్యతిరేకంగా విరసం – జనసాహితి – ప్రజారస సంస్థలు ఉమ్మడిగా విడుదల చేసిన కరపత్రాన్ని తయారుచేయడంలో వీరు ముఖ్య పాత్ర నిర్వహించారు. 1992 జూన్ నెల చివర జనసాహితి పునర్నిర్మాణ మహాసభలో ఆమోదించిన నూతన ప్రణాళిక రూపకర్తలలో రామ్మోహన్ కూడా ఒకరు.

"నక్సల్బరీ వెలుగులో" రచయిత, జర్నలిస్టు అయిన సుమంతో బెనర్జీ మతతత్వంపై రాసిన ఒక వ్యాసాన్ని 1991వ సంవత్సరంలో రామ్మోహన్ రవిబాబుగారితో కలిసి అనువాదం చేశారు. అది ప్రజాసాహితిలో ముద్రణయింది. 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చి వేసిన వెంటనే 'ప్రజాసాహితి' వెలువరించిన మతతత్వ వ్యతిరేక రెండవ సంచికలో రామ్మోహన్ మంచి విశ్లేషణాత్మక వ్యాసం (శ్రీకాంత్ పేరుతో) రాశారు. 1993లో నల్లగొండ జిల్లా కోదాడ పట్టణంలో జనసాహితి అరుణోదయ సంస్థల నిర్వహణలో "సంస్కృతి" అనే అంశంపై జరిగిన సదస్సులో రామ్మోహన్‌గారే ప్రధాన ఉపన్యాసకులు. సంస్కృతిని అర్థం చేసుకోవలసిన సామాజిక పునాది – ఉపరితల అంశాలను అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్టు సామాన్యులకు కూడా అర్థమయ్యే విధంగా చెప్పారు. 1993 నవంబరులో మరణించిన రాచకొండ విశ్వనాథశాస్త్రిపై డిసెంబర్ నెలలో 'ప్రజాసాహితి' వెలువరించిన ప్రత్యేక సంచికలో ఆయనపై సంపాదకీయం రామ్మోహన్ రాశారు.

1994 ఏప్రిల్ మొదటి వారంలో జనసాహితి అరుణోదయలతో సహా వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 8 సంస్థలతో కలిసి అఖిల భారత స్థాయిలో "సాంస్కృతిక సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సు" హైదరాబాదు రాణా ప్రతాప్ హాలులో మూడు రోజులపాటు నిర్వహించారు. ఈ సదస్సులో రామ్మోహన్ 'కులం – మతవాదం – సామ్రాజ్యవాదం" అనే పత్రాన్ని సమర్పించారు. ఆ సదస్సు పత్రాలన్నీ కొంతకాలానికి జనసాహితి ఒక పుస్తక రూపంలో తెచ్చింది.

వేషధారణలోనే కాదు మాటలలో కూడా రామ్మోహన్ కు అతిశయం, అభిజాత్యం ఉండేది కాదు! ఇతరులను తక్కువ చేసి మాట్లాడటం లేక కించపరచడం పొరపాటున కూడా పెదవుల నుండి దొర్లేది కాదు. పదాలు ఆచితూచి వాడటం, ప్రతి వాక్యం చాలా భావయుక్తంగా ఉండటం ఆయనలో గమనించదగిన లక్షణం.

సుమారు 19 ఏళ్ల క్రితం జీవిత సహచరిని కోల్పోయిన రామ్మోహన్, గత కొద్ది సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యంతో సతమత మయ్యారు. అది చివరకు క్యాన్సర్గా పరిణమించింది. మొదటి నుండి ఉపాధ్యాయ ఉద్యమంలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ ఏపిటిఎఫ్ నిర్వహించిన అనేక అధ్యయన తరగతులలో, హక్కుల సంఘాల సభలలో ఎన్నోచోట్ల ప్రసంగాలు చేశారు. గత జనవరి నెలలో సంభవించిన ఏపిటిఎఫ్ నాయకులు పరమేశ్వరరావుగారి మరణానికి రామ్మోహన్ చాలా బాధను వ్యక్తం చేశారు.

రామ్మోహన్ సన్నిహితులందరూ కలిసి పాలమూరు అధ్యయన వేదిక నిర్వహణలో ఆయన రచనలతో పాటు మిత్రుల బంధువుల జ్ఞాపకాలను కలిపి 350 పేజీల పుస్తకంగా వెలువరించి రామ్మోహన్ కు అందించారు. దానిని అందుకున్న మరుసటి రోజు 2022 మార్చి 8 ఉదయం హైదరాబాద్ వనస్థలిపురంలో రామ్మోహన్ ఆఖరి శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి బంధువుల ఉద్యమ మిత్రుల నివాళులతో అదే రోజు సాయంత్రం అంతిమయాత్ర నిర్వహించారు. జనసాహితి సంస్థ, 'ప్రజాసాహితి' పత్రిక తరఫున వారికి మా ప్రగాఢ నివాళిని అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు మా సంతాపాన్ని తెలుపుతున్నాము. ✦

సిహెచ్. మధు
మొదటి వర్ధంతి ( 24-4-21)
సందర్భంగా....

# మరో ప్రపంచగీతం

- సిహెచ్. మధు

**మరో** ప్రపంచం గుండెల మీద
మండుతున్న సూర్యున్ని నేను

మరో ప్రపంచం కొరకు
పోరాడుతున్న వీరున్ని నేను

మరో ప్రపంచాన్ని ఆవిష్కరించాలని
మరో ప్రపంచాన్ని ఆహ్వానిస్తున్నాం

పిడికిలిని తూర్పు దిక్కు జెండాగా
ఎగిరేసిన ధీరున్ని నేను
ప్రశ్నను చీకట్లో ధిక్కరణ అస్త్రంగా
మార్చిన వీరున్ని నేను
కన్నీటి జలపాతం నుండి
నిప్పురవ్వను సృష్టిస్తున్న సాహసిని నేను
మరో ప్రపంచం నాప్రాణం
అడుగులేస్తున్నాను
శ్రమైక్య జీవన సౌందర్యం
నా అడుగు
దోపిడిని ఎదిరించే ఎర్రపూల
సౌగంధం నా పాట
ధిక్కరణను నేర్పుతున్న
ఆయుధశాల నా తోట

మరో ప్రపంచం కొరకు
పిడికిలెత్తి నడుస్తున్న
చెమట చుక్కను నేను
నా దారి రహదారి కాదు
పూలదారి కాదు
పోరాటదారి!

నా దారి పూలదారికాదు
వెలుగుదారి కాదు
ముళ్లదారి
నేను నడుస్తుంటాను
మరో ప్రపంచం కొరకు
నా స్వప్నం మరో ప్రపంచం

★ ★ ★

ఆకలి లేని శోకం లేని
లోకం కావాలి నాకు
అంతరాల దోపిడి లేని
ఆకాశం కావాలి నాకు
కులమతాలు బుసలు కొట్టని
తోట కావాలి నాకు
హింస, రాజ్యహింస, మతహింస
మహిళపై హింస, నిర్బంధ విద్యాహింస
మోయలేని గాలి కావాలి నాకు
భయంలేని బ్రతుకునిచ్చే
దారి కావాలి నాకు
రేపు గూర్చి చింతలేని
కవిత కావాలి నాకు
మరో ప్రపంచం నా లక్ష్యం
అడుగులేస్తున్నాను
ఒక ప్రశ్నగా
ధిక్కరణగా
సామూహిక తిరుగుబాటుగా
జనం తోడుగా....

★ ★ ★

మరో ప్రపంచం కొరకు
యుద్ధం
ఎప్పుడో మొదలయ్యింది
కనిపించని యుద్ధం
జనం గుండెల్లో మ్రోగుతున్న శంఖం
జనం కన్నుల్లో సైన్యం
జనం ధిక్కారంలో ఆయుధం
కనిపించని యుద్ధం
రేపు శత్రువును మట్టికరిపిస్తుంది
పడుతున్నాను
లేస్తున్నాను
పరుగుతీస్తున్నాను
ఆగిపోతున్నాను
గెరిల్లా యుద్ధం నాది
మరో ప్రపంచ అడుగులు నావి
రేపటి విజయం నాదేనని
యుద్ధ ప్రారంభం
ఆవిష్కరించిన నిజం
చరిత్ర గతిని నిర్మిస్తుంది
శత్రువు బలగం వున్నా
బలం లేనివాడు
శత్రువు చేతుల్లోని ఆయుధాలకు
చట్టంలేదు నైతికత లేదు
ధర్మం లేదు
ఓడిపోవటానికి ఇది చాలు

పునాది లేని యుద్ధరంగం మీద
శత్రువు నిల్చున్నాడు
చట్టం వాడికి చుట్టంకావచ్చు
కార్పొరేట్ సామ్రాజ్యం
వాడి కన్నులు కావచ్చు
శ్రామిక దోపిడి వాడి రాజ్యతంత్రం కావచ్చు
కుప్పకూలే పెట్టుబడి సామ్రాజ్యం మీద
వాడు నిల్చున్నాడు
ప్రజలను శత్రువుగా చేసుకున్న
వాడికి గెలుపెక్కడిది?
ప్రజలే నా ఆయుధాలు
జయం నాది
మరో ప్రపంచ సృష్టికర్తను నేను

★ ★ ★

తరతరాల చరిత్రలో
నేల నాది గాలి నాది నీరు నాది
నిప్పు నాది అడవి నాది మట్టి నాది
మట్టిలోని బంగారం నాది
ఇపుడు ఏదీ నాది కాకుండా పోయింది

దోపిడీ సామ్రాజ్యం నాకు నీడనివ్వటంలేదు
స్వేచ్ఛలేని రాజకీయం
నన్ను బందీగా మార్చింది
నా రాజ్యాంగం పేరుతో
నన్ను నిలువునా పాతర పెడుతున్నారు
నా భూమి లాక్కొన్నారు
నా కాళ్ళ క్రింద నేల పరాయిదయ్యింది
అంతా చట్టబద్ధమే
నా అడవి నాది కాకుండా పోయింది
అంతటా పరాయి నయ్యాను నేను
ప్రపంచీకరణ వలలో
ప్రజలు ఊపిరిపీల్చుగోవటం కష్టమయి
బ్రతుకు భయం
మాట భయం
పాట భయం
రోడ్డు భయం లాఠీ భయం
ఓటు భయం తూటా భయం
భయం నీడలో బ్రతుకు వద్దు
శాంతిలేని సమాజమొద్దు
సమతలేని తోటవద్దు
నాది కాని పాట వద్దు
ఏదీ నాది కాని ప్రపంచం నాకు వద్దు
నా ప్రపంచం నాకు కావాలి
మరో ప్రపంచం కొరకు అడుగులేస్తున్నాను నేను

★ ★ ★

అడుగు అడుగునా దోపిడీ
అవినీతి దోపిడీ
నీతిలేని దోపిడీ
శ్రమ, చెమట, సంపద దోపిడీ
ఇదొక దోపిడీ వ్యవస్థ
ఓటు దోచుకుంటారు
రైతు పండించిన పంటను
నిలువునా దోచుకుంటారు
సమానత్వ రాజ్యాంగాన్ని
కార్పొరేట్ రాజ్యాంగంగా మార్చిన
నిట్టనిలువు దోపిడీ
ఒకడు కోట్లకు పడగలెత్తుతాడు
లక్షల కోట్లమంది ఆకలి ఆకలి అంటారు
జనం గుండెల్లో రగులుతున్న మంట
జనం కన్నుల్లో పెరుగుతున్న నిప్పు
జనం మరో ప్రపంచం కోరుకుంటున్నారు
కులం లేని, అంతరాలు లేని, మతం లేని,
మోసం లేని, ద్వేషం లేని
మరో ప్రపంచం కోరుకుంటున్నారు
శ్రామిక జెండా నీడలో -
సమతా రాజ్యాన్ని కోరుకుంటున్నారు
రంకు రాజకీయాలు లేని
మరో ప్రపంచం నాకు కావాలి

★ ★ ★

జ్ఞానం వ్యాపార వస్తువయ్యింది
భక్తి వ్యాపార స్వార్ధమయ్యింది
వైద్యం పేదవాడికందిన మరణమయ్యింది
చదువు వున్నోడి సొత్తయ్యింది
ఓటు నాదే కానీ పాట నాది కాదు
రాజ్యం నాదే కానీ రాజు నేను కాదు
తూర్పు నాదే కానీ సూర్యుడు నావాడు కాదు
కనులు నావే కానీ కాంతి నాది కాదు
శ్రమైక జీవన సౌందర్యం నాదే కానీ
ఈ ప్రపంచం నాది కాదు
మానవత్వం వున్నవాన్ని
మంచి కోరుతున్నవాన్ని
దౌర్జన్యం, దుర్మార్గం, గూండాయిజం
రేపిస్టుల మీద రాజ్యహింస మీద
రాయి విసురుతున్నవాన్ని
నాకు మరో ప్రపంచం కావాలి
చీకటి ప్రపంచం ఇది బురదలోకమిది
విషం నిండిన తోట ఇది
నాకు మరో ప్రపంచం, మానవతా ప్రపంచం
సమతా ప్రపంచం కావాలి ✦

# కర్నాటకలో దేవదాసీల నిరసన ప్రదర్శన

**రకరకాల** పేర్లతో దేవదాసి వ్యవస్థ దేశమంతా వుంది. పితృస్వామ్య, భూస్వామ్య సమాజం దళితులపై బలవంతంగా రుద్దిన ఆచారం ఇది. మన రాష్ట్రంలో తెలంగాణలో ఇది జోగిని వ్యవస్థగా వుంటే దీని నిర్మూలనపై ప్రముఖ నాస్తికవాది, సంఘసంస్కర్త ఐన హేమలతా లవణం విస్తృతంగా కృషిచేశారు. 1988లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దీనిని నిషేధించినప్పటికీ, నేటికీ తెలంగాణలో మహబూబ్‌నగర్, నారాయణపేట, నిజామాబాద్, మెదక్, గద్వాల, కర్నాటక సరిహద్దు ప్రాంతంలో ఇది జోగిని, మాతమ్మ, కళావంతులు, అమాబాబాయి జోగిని మొదలగు పేర్లతో కొనసాగుతోంది. స్వచ్ఛంద సంస్థలు వీరిని విముక్తి చేయడానికి ఈనాటికీ కృషిచేస్తున్నాయి.

కర్నాటక రాజ్య దేవదాసీ మహిళావిమోచన సంఘం (KRDMVS) నాయకత్వాన బెంగుళూరులోని ఫ్రీడం పార్కులో 1500 మంది దేవదాసీలు మార్చి 14, 15 తేదీలలో నిరసన ప్రదర్శన చేశారు. 10 జిల్లాలకు చెందిన దేవదాసీలు దీనిలో పాల్గొన్నారు. దేవదాసీ వ్యవస్థ ప్రధానంగా మాల, మాదిగ కులాలవారిపై ఇతర కులాలవారు రుద్దినటువంటిది. ఆ కులాలలో 12 సంవత్సరాల వయస్సు వచ్చిన బాలికను ఎంపిక చేసి ఆమెను 'దేవుడికి సేవకురాలు'గా ప్రకటిస్తారు. కాని ఆమె ఊరిలోవారందరికీ భార్యగా లైంగిక కోర్కెలు తీర్చేదానిగా పరిగణిస్తారు. దళితులపై అణచివేతలో ఇదొక భాగం.

కాలాబుర్గి, విజయపుర, విజయనగర, రాయచూరు, దావనగిరి, బగాల్‌కోట, బళ్ళారి, యాదగిరి, కొప్పోలుకు చెందిన దేవదాసీలు ఈ క్రింది ప్రధాన డిమాండ్లతో ప్రదర్శన చేశారు.

1. నెలవారీ పింఛను రూ. 1500 నుండి 3000కు పెంచాలి.
2. పునరావాసం కల్పించాలి.
3. పిల్లలకు ఉచిత విద్యాసౌకర్యం కల్పించాలి.
4. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్పులు రద్దు చేయాలి.
5. వ్యవసాయం చేసుకోడానికి ఐదెకరాలు భూమినివ్వాలి.
6. వ్యవసాయశాఖ ద్వారా సేద్యానికి సహాయమందించాలి.
7. 300 చ॥ అ॥ స్థలంలో ఇల్లు కట్టి ఇవ్వాలి.
8. నిరుద్యోగ భృతినివ్వాలి.
9. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉద్యోగాలు ఇవ్వాలి.

కర్నాటక రాష్ట్ర మహిళాశిశు అభివృద్ధిశాఖ మంత్రి హలప్ప బసప్ప నిరసనకారులకు వాగ్దానం ఇవ్వడంతో రెండోరోజు రాత్రి 10 గంటలకు నిరసన కార్యక్రమం ముగిసింది. ✦

# పంజాబ్, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రొఫెసర్ చమన్‌లాల్ విజ్ఞప్తి

**ఆమ్** ఆద్మీ తరపున పంజాబ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్నికైన భగవంత్‌మాన్ ఒక ఆసక్తికరమైన, విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం కార్యాలయాలన్నిటిలో గతంలో ముఖ్యమంత్రి ఛాయాచిత్రాలు ప్రదర్శించే పద్ధతిని మార్చి, కేవలం భగత్‌సింగ్, డా॥ అంబేడ్కర్‌ల ఫొటోలు వుంచాలని ఆదేశించారు. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, గత ముఖ్యమంత్రి ఫొటోలు వున్న స్కూలు పిల్లలకిచ్చే సంచులు అలాగే వుంచి, ప్రభుత్వానికి ఎంతో ఖర్చు తగ్గించారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ ప్రొటోకాల్ పేరుతో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు ముద్రించుకునే తాపత్రయం తగ్గించుకోవాలని వీరి చర్యలు ఇతరులకు సందేశాన్నిస్తున్నాయి.

చమన్‌లాల్, జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా రిటైరయ్యారు. భగత్‌సింగ్‌పై విశేష పరిశోధన చేసి ఎన్నో పుస్తకాలు రాశారు. ప్రస్తుతం 2018 మార్చి 23న ఢిల్లీలో ఏర్పరచిన భగత్‌సింగ్ అర్కైవ్స్ అండ్ రిసెర్చి కేంద్రానికి గౌరవ సలహాదారునిగా వున్నారు. ఇటీవల ఆయన ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు ఢిల్లీ ముఖ్యమంత్రికి ఒక లేఖ రాస్తూ, "ఢిల్లీ, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో భగత్‌సింగ్ అసలు ఫొటో పెట్టాలని" కోరారు. ప్రస్తుతం మీడియాలో భగత్‌సింగ్‌వని చెప్పి నకిలీ ఫొటోలు చలామణిలో వున్నాయి. భగత్‌సింగ్‌ను చిత్రించిన కొన్ని చిత్రాలలో ఆయన పసుపుపచ్చని లేక కాషాయరంగు తలపాగా ధరించినట్లు ప్రకటనలలోనూ, ప్రైవేటుగానూ చలామణిలో వున్నాయి. ఇవి నకిలీవి. 1970 వరకూ హ్యాట్ ధరించిన భగత్‌సింగ్ ఫొటో అన్నిచోట్లా వుండేది. 1970లలో అస్తిత్వ రాజకీయాల ప్రభావం వల్ల, ఈ తలపాగా నకిలీ ఫొటోలును ఆయన సిక్కు మతస్తుడని చెప్పడానికి ప్రచారంలో పెట్టారు. నిజానికి భగత్‌సింగ్ 11వ యేట ఫొటోలోనూ, నేషనల్ కళాశాల గ్రూపు ఫొటోలోనూ తెల్లటి తలపాగా ధరించిన అసలు ఫొటోలు వున్నాయి. మూడోది పోలీసు కస్టడీలో తలపాగా లేని ఫొటో ఒకటి వుంది. తలపాగా వున్న ఫొటో ఉపయోగించుకోదలిస్తే, 16వ యేట లాహోర్‌లోని నేషనల్ కళాశాలలో తీసిన గ్రూపు ఫొటో మాత్రమే ఉపయోగించమని చమన్‌లాల్, ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్‌కు విజ్ఞప్తి చేశారు. ✦

# చైతన్యవాహిని

**8 మార్చి, 2022**న విజయవాడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపిటిఎఫ్ మహిళాసదస్సు నిర్వహించింది. ఆ సదస్సులో నిర్వహణను ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ రోహిణీదేవి సభను నిర్వహించగా కృష్ణాజిల్లా ఏపిటిఎఫ్ కార్యదర్శి ఎమ్. అనిత అధ్యక్షత వహించారు. ఆమె తన అధ్యక్షోపన్యాసంలో మార్చి 8 ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ సమాజంలో మహిళలు నిర్వహిస్తున్న పాత్రను వివరించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న జనసాహితి ప్రధాన కార్యదర్శి అరుణ ఏపిటిఎఫ్ ఇంతటి నిబద్ధతతో నిలబడటానికి కొనసాగటానికి అహర్నిశలూ కృషిచేసిన పరమేశ్వరరావు మాష్టారుకు జోహార్లు చెప్పారు. మొదటిసారి అంతర్జాతీయ మహిళాదినంను ప్రకటించుకున్నప్పుడు ఇచ్చిన పిలుపులను వివరించారు. ఆ స్ఫూర్తితో మహిళాదినోత్సవాలను నిర్వహించు కోవాలన్నారు. మహిళలమీద నిరంతరం సాగుతున్న హత్యలూ, అత్యాచారాలకు కారణమైన విషసంస్కృతిని ప్రేరేపిస్తూ, మద్యం వ్యాపారాలను నిర్వహిస్తూ, ఆ ఆదాయాలతో పాలన సాగిస్తూన్న ప్రభుత్వమే ఈరోజు మహిళాదినోత్సవాలను నిర్వహిస్తూందనీ, పాలకుల కపటత్వాన్ని ఎండగట్టారు. నేటి సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటూ సాగుతున్న రైతాంగ, కార్మిక, విద్యార్థి, ఎన్ఆర్సి వంటి ఉద్యమాలను ఉదహరిస్తూ ఉపాధ్యాయ ఉద్యోగసంఘాలు, రివర్స్ పిఆర్సిపై నిర్బంధాలను ఎదుర్కొంటూ పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమాన్ని, అందులో ఏపిటిఎఫ్ నిర్వర్తించిన, నిర్వహిస్తూన్న పాత్రను కొనియాడారు. ఈ కాలంలో పెల్లుబుకుతున్న అన్ని ఉద్యమాలలో మహిళలు ప్రధానపాత్ర వహిస్తున్నారన్నారు. కరోనా కాలం – ఈ కాలంలోనే పాలకుల విధానాల వలన పెరుగుతూన్న ఆర్థిక అంతరాలు, సామాజిక అంతరాలు ప్రజల జీవనాన్ని ఎలా సంక్షోభంలోకి నెడుతున్నాయో వివరించారు. ఈ సంక్షోభాలు మోపుతున్న భారాన్ని అంతిమంగా భరిస్తూన్న మహిళల పరిస్థితులను వివరిస్తూ – ఉపాధ్యాయునులుగా, మహిళలంగా అంతర్జాతీయ మహిళాదినం స్ఫూర్తి అయిన అంతరాలు లేని సమాజ స్థాపన కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములం కావాలన్నారు.

ఏపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్. మంజుల మాట్లాడుతూ తమ సంఘ ఉద్యమ నేపథ్యాన్ని వివరించారు. బడుల్లో నెలకొంటున్న విషసంస్కృతి ప్రభావం గురించి, మహిళల మీద సాగుతున్న దోపిడీ, పీడనల గురించి వివరించారు. ఎస్ఆర్ఆర్ & సివిఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి. శైలజ సావిత్రిభాయి పూలేను స్మరిస్తూ – ఆవిడ జీవన గమనాన్ని, స్త్రీలకు విద్య యొక్క అవసరాన్ని తెలియచేశారు. ఇంకా ఈ సభలో డా॥ పద్మజ, గుడిపూడి రాధికారాణి, డా॥ ఓలేటి ఉమా సరస్వతి మొదలగువారు ఉపన్యసించారు.

**12, 13 మార్చి 2022** తేదీలలో 30వ జాతీయ నాస్తికమేళా మంగళగిరి సమీపాన చార్వాకాశ్రమంలో జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుండి, ఒరిస్సా, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడుల నుండి ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. శివారెడ్డి, సత్యనారాయణ, సుధాకర్, లతీఫ్, వెంకటరెడ్డి, శివకృష్ణ, గంజి ఈశ్వరలింగం, డా॥ భానుప్రసాద్, జి. స్వామి, ఎం.ఎన్. బుద్ధ, పల్లవోలు రమణ మొదలగువారు మేళా నిర్వహణలో బాధ్యత వహించారు.

12వ తేదీన 'ప్రత్యామ్నాయ సంస్కృతి' అనే అంశంపై 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడారు. ఆయన తన ప్రసంగంలో పెళ్ళిళ్ళు, చావులు, గృహప్రవేశాలు, పుట్టినరోజులు, సత్కారాలు మొదలైన సందర్భాల్లో పాటిస్తున్న భూస్వామ్య సంస్కృతికి ప్రత్యామ్నాయంగా నాస్తికులుగా భౌతికవాదులుగా ప్రజాసంస్కృతిని ఎలా పాటించాలో తెలియచేశారు. సినిమాలు, విద్యావిధానం, లలితకళలు, పత్రికలు, సమాచారవ్యవస్థ ఇలా సమస్త రంగాలలో ప్రజాప్రత్యామ్నాయ రూపాలను సూచించారు.

తుమ్మా భాస్కర్ బైబిల్‌లోని అసమంజసాలు వివరించగా డా॥ వి. బ్రహ్మారెడ్డి 'వైద్యం అక్కరలేకుండా రోగాన్ని తగ్గించుకోవడం ఎలా?' అన్న విషయంపై జనరంజక ప్రసంగం చేశారు.

వి.ర.సం. నాయకుడు సి.ఎస్.ఆర్. ప్రసాద్ రష్యా–ఉక్రెయిన్ యుద్ధ పూర్వాపరాలను వివరించి, అది సమాజ పురోగతికి ఎంత నష్టమో వివరించారు. అంబటి నాగయ్య 'చరిత్రను వక్రీకరిస్తున్న మతవాదులు' గురించీ, పండుగలు పుక్కిటి పురాణాలు అన్న అంశంపై సమతాశ్రీధర్ మాట్లాడారు. డా॥ వి. వరప్రసాద్ మూఢనమ్మకాల వెనుక వున్న మానసిక అంశాల పరిశీలన'పై ప్రసంగించారు. 13వ తేదీన 'పాఠ్యాంశాలు – రాజ్యాంగ విలువలు'పై రమేశ్ పట్నాయక్ 'జీవావిర్భావం – పదార్థ పరిణామం'పై డా॥ కె. జయకుమార్, 'కులనిర్మూలన'పై దుడ్డు ప్రభాకర్, 'దృశ్యమాధ్యమాలు – శాస్త్రీయ ప్రచారం'పై తమ్మారెడ్డి భరద్వాజ, బాబ్జీలు ప్రసంగించారు.

వీరేగాక ప్రతినిధులుగా హాజరైన స్వరాజ్యలక్ష్మి, రమాదేవి, శాంతారాం, చంద్రశేఖర్‌లు మాట్లాడారు. జేడి సారయ్య బృందం నాస్తిక, హేతువాద గేయాలను ఆలపించారు. ఉదయం 9:30కు నాస్తిక జెండాను బి. గృహలక్ష్మి ఆవిష్కరించగా చందుపట్ల భూపతి 'చార్వాకులం – మేము సత్యకాములం' గీతాన్ని ఆలపించారు. ఆర్. పిచ్చయ్య అభ్యుదయ గేయాలు పాడారు. హాజరైనవారు తమను తాము పరిచయం చేసుకున్నారు. ప్రత్యామ్నాయ సాహిత్యాన్ని ప్రచురించి, ప్రచారం చేస్తున్న విప్లవ, హేతువాద, భౌతికవాద ప్రచురణకర్తలు తమ తమ పుస్తకాలను ప్రదర్శించారు. అమ్మకాలు చేశారు.

**20-3-2022న విజయవాడ** సిద్ధార్థ ఆడిటోరియంలో 11-1-2022న తన 81వ యేట మరణించిన నూతలపాటి పరమేశ్వరరావు సంతాపసభను ఏ.పి.టి.ఎఫ్ నిర్వహించింది. ఏ.పి.టి.ఎఫ్ అధ్యక్షుడు కె. భానుమూర్తి సభకు అధ్యక్షత వహించారు.

ఎన్. పరమేశ్వరరావు 57 సంవత్సరాలపాటు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ, సింగరాజు తర్వాత ప్రధాన కార్యదర్శిగా, 'ఉపాధ్యాయ' పత్రిక సంపాదకునిగా పనిచేశారు. ఆయన

తన 81వ యేట జనవరి 11న మరణించారు. వారికి నివాళి తెలియచేస్తూ 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ "పరమేశ్వరరావు విద్యార్థులకు ఉపాధ్యాయునిగా చేయలేదు కాని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయునిగా చేశారు. చెన్నుపాటి, సింగరాజు, పరమేశ్వరరావుల నాయకత్వంలో సంఘంలో ఎన్ని విచ్ఛిన్నాలు వచ్చినా, అది వాటిని తట్టుకుంటూ ఫీనిక్స్ పక్షిలా మరలా పటిష్టంగా ముందుకు సాగుతూ వచ్చింది. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మామగారైన ప్రజారచయిత, 'మా భూమి' మొదలగు నాటకాల రచయిత సుంకర సత్యనారాయణ సమగ్ర రచనలను హాజరైన వారందరికీ ఇస్తున్నారు. మీరు మీ ఇంట్లో సొంత గ్రంథాలయాలు ఏర్పరచుకోండి. పరమేశ్వరరావు ప్రతి సమావేశంలోనూ ఉత్తమ సాహిత్యాన్ని ప్రోత్సహించేవారు. అదే వారికి నివాళి" అన్నారు.

ఈ సభలో డా॥ నిమ్మా వెంకట్రావు, కె.ఎస్. జవహర్, గడ్డి ఈశ్వరి, రఘువర్మ, పాండురంగవరప్రసాదు, షేక్ జిలాని, కె. వేణుగోపాల్, ఎ. నరసింహారెడ్డి, నరహరి, మనోహర్‌రాజు, చెన్నుపాటి మంజుల, ఎ. సురేశ్, జాస్తి కిశోర్‌బాబు, సింహాద్రి ఝాన్సీ మొదలగువారు పరమేశ్వరరావు వ్యక్తిత్వంలోని వివిధ పార్శ్వాలను తెలియచేస్తూ మాట్లాడారు.

**21-3-2022న తెనాలిలో** 'ఖాకీ బతుకులు' రచయిత 'స్పార్టకస్' (గంటినపాటి మోహనరావు) మొదటి వర్ధంతిసభ జరిగింది. ఈ సభలో 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ 'పోలీసు కానిస్టేబుళ్ళ జీవితాల్నీ, పోలీసు ఉన్నతాధికారుల దౌష్ట్యాన్నీ ప్రతిభావంతంగా మొట్టమొదటిసారి 'ఖాకీ బతుకులు' నవల చిత్రించింది. ఒకే ఒక్క నవలతో స్పార్టకస్ తెలుగు సాహిత్యలోకంలో సుస్థిరస్థానం సంపాదించుకున్నారు. ఆ నవల 1996 డిసెంబర్ 6న విడుదలైంది. ఈ ఏడాది ఆ నవలకు రజతోత్సవ సంవత్సరం' అన్నారు. అడ్వకేటు జి.ఎస్. నాగేశ్వరరావు బ్రిటిష్‌వారు ఏర్పాటుచేసిన పోలీసు వ్యవస్థ స్వభావం ఈనాటికీ మారలేదన్నారు. పోలీసు కానిస్టేబుల్‌గా చేసి రిటైరైన నందూరి నారాయణరావు తనకు మోహనరావుతో వున్న సాహిత్య పరిచయాన్ని వివరించారు. చివర్లో మోహనరావు కుమారుడు ప్రేమచంద్ మాట్లాడుతూ 'ఖాకీ బతుకులు' నవలను పునర్ముద్రిస్తామని చెప్పారు.

**మార్చి 23, 2022** భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు వర్ధంతి సందర్భంగా విశాఖజిల్లా చోడవరం మండలం, చెన్నవోలు గ్రామంలో జనసాహితి విశాఖజిల్లా శాఖ నిర్వహణలో కాగడాల ప్రదర్శన రాత్రి 7 గం॥ నుండి నిర్వహించబడింది. జనసాహితి సభ్యులైన నూకాచారి, గౌరీశంకర్, రామకృష్ణ, లక్ష్మీకుమారి, రవిశంకర్, వాసు తదితరులు గ్రామ యువకులను, విద్యార్థులను కలుపుకుంటూ గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించారు. 'కూర్చొనే కొమ్మలు నరకొద్దు', 'దేశీయ పరిశ్రమలు అమ్మొద్దు....', 'సమసమాజ నిర్మాణం, భగత్‌సింగ్ ఆశయం'; 'పబ్జి, ఫ్రీఫైర్ ఆటలు తప్పు – భవిష్యత్తుకు ఎంతో ముప్పు';.. 'బెట్టింగ్ వలలో చిక్కొద్దు – బంగారు భవితను కోల్పోవద్దు....' తదితర నినాదాలతో ర్యాలీ చేయడం జరిగింది. పబ్జి, ఫ్రీఫైర్ తదితర ఆటల వలన, బెట్టింగుల వలన ఎంతో ఆవేదన చెందుతున్న తల్లిదండ్రులు స్వయంగా ర్యాలీలోకి వచ్చి చేరారు. ఇదే విధంగా చోడవరం మండలంలోని పలు గ్రామాలలో కాగడాలు ప్రదర్శిస్తూ, నినాదాలనిస్తూ ర్యాలీ నిర్వహించారు.

**23 మార్చి 2022**న జనసాహితి ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో షహీద్ భగత్సింగ్ వర్ధంతి సందర్భంగా ఒంగోలులోని వెనుకబడిన తరగతుల కళాశాల బాలుర వసతిగృహం విద్యార్థులతో జనసాహితి ప్రచురించిన 'మా నెత్తురు వృధాకాదు' పుస్తక పరిచయ సభ మరియు స్టడీ సర్కిల్ నిర్వహించారు.

భగత్‌సింగ్ జీవితాన్ని, మార్గాన్ని విద్యార్థులకు పరిచయం చేసిన అనంతరం 2016 ఏప్రిల్ 'ప్రజాసాహితి' సంపాదకీయాన్ని, 'మా నెత్తురు వృధాకాదు' పుస్తకంలోని భగత్‌సింగ్ రాసిన 'యువత – రాజకీయాలు' అనే వ్యాసాన్ని విద్యార్థుల చేత చదివించారు. తర్వాత విద్యార్థులచేత ఈ అంశంపై మాట్లాడించారు. ఈ సందర్భంగా వసతి గృహ విద్యార్థి, చిత్రలేఖన కళాకారుడు లక్ష్మీనారాయణ, భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా తను గీసిన భగత్‌సింగ్ చిత్రాన్ని ప్రదర్శించి మాట్లాడారు.

**మార్చి 27 ఆదివారం** కామ్రేడ్ రామ్మోహన్ సంస్మరణ సభ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఎ. రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగింది.

ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్యోపన్యాసం చేశారు. మిత్రుల వ్యాసాలు (48), కుటుంబ సభ్యులవి(25) రామ్మోహన్ స్వీయ రచనలు (29)తో కలిపి మొత్తం 450 పేజీల పుస్తకం 'మా నవతా పతాక మన సి. రామ్మోహన్@75' పుస్తకాన్ని (పాలమూరు అధ్యయన వేదిక ప్రచురణ) 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు కె. శ్రీనివాస్ ఆవిష్కరించి ప్రసంగించారు.

రామ్మోహన్ భార్య భారతిగారి అన్న సుధాకర శర్మ ఒక అక్కగారైన వీణావాణి, కె. శివారెడ్డి, కవయిత్రి విమల, గోరటి వెంకన్న, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి ప్రొఫెసర్ కోదండరామ్, వి. నారాయణస్వామి, లెల్లే సురేష్, గాయని విమల తదితరులు ప్రసంగించారు. సుధాకిరణ్ 'మా నవతా పతాక' పుస్తకాన్ని సంక్షిప్తంగా పరిచయం చేశారు.

తెలంగాణ రచయితల సంఘం తరఫున నాళేశ్వరం శంకరం, విప్లవ రచయితల సంఘం బాధ్యులు రాంకీ, జనసాహితి అధ్యక్షులు దివికుమార్, 'వీక్షణం' సంపాదకులు ఎన్. వేణుగోపాల్, మేనల్లుడు నర్ల రవి తమ తమ సందేశాలను ఇచ్చారు.

దివికుమార్ మాట్లాడుతూ రామ్మోహన్ విరసం బాధ్యులుగా ఉండినప్పటికీ ఒక దశలో జనసాహితి మౌలిక అవగాహనతో ఏకీభావం కలిగి ఉన్నారని కనుకనే జనసాహితి నూతన ప్రణాళిక రూపొందించడంలో చురుకైన పాత్ర నిర్వహించారనీ చెప్పారు. ఈనాటి కమ్యూనిస్టు ఉద్యమం, ప్రజాసాంస్కృతిక ఉద్యమం రామ్మోహన్ అనే వ్యక్తిలో ఉన్న సంయమనతత్వాన్ని తమ ఉద్యమతత్త్వంగా అలవర్చుకో గలిగితేనే దానికి నిజమైన భవిష్యత్తు ఉంటుందని చెప్పారు.

పాలమూరు అధ్యయన వేదిక ముఖ్యులైన మరింగంటి రాఘవాచారి పుస్తక ప్రచురణ సభ నిర్వహణలో కీలక బాధ్యతను నిర్వహించారు. సభ ముగింపుదశలో కామ్రేడ్ రామ్మోహన్ ప్రత్యేక సంచికగా విడుదల చేసిన 'ప్రజావిమోచన' పత్రికను ఆవిష్కరించారు.

రామ్మోహన్‌గారి వలె గంభీరంగా నాలుగు గంటలపాటు ప్రశాంతంగా సంస్మరణసభ సాగింది. ✦




**బహుళ :** అంతర్జాతీయ అంతర్జాల మహిళాపత్రిక, త్రైమాసిక. 2021 నవంబర్ సంచిక. ప్రారంభ సంచిక.

రచయిత్రి జ్వలిత ప్రధాన సంపాదకురాలుగా, బహుజన స్త్రీల సమస్యలకు చర్చావేదికగా ఈ బహుజన మహిళాపత్రిక వెలువడింది. ఎడిటోరియల్‌లో పత్రిక ఆశయం, లక్ష్యం వివరించారు. మనువాదాన్ని సమర్థించే రచనలకు పత్రికలో చోటు వుండదని చెప్పారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళల సాధికారత, ఐక్యత పత్రిక లక్ష్యం అన్నారు. సావిత్రీబాయి పూలే భావజాలాన్ని సమర్థించే పత్రిక అని ప్రకటించారు.

బాలబహుళ శీర్షికలో ముగ్గురు బాలికలు చిత్రించిన చిత్రాలు, ఒక బాలిక రాసిన కవితగాక ఈ సంచికలో వున్న 51 రచనలు 50 మంది రచయిత్రులు రాసారు. వీటిలో కథలు 10, కవితలు 20, వ్యాసాలు 7, నాటిక 1, సాహిత్య విమర్శలు 3 మొదలైనవి వున్నాయి. అనిశెట్టి రజిత, షాజహానా, నాంపల్లి సుజాత, కళాగోపాల్, నస్రీన్‌ఖాన్, కుప్పిలి పద్మ, కొండపల్లి నీహారిణి, తాతినేని వనజ, తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి, జ్వలిత, స్వాతి శ్రీపాద, డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి, డా॥ వి. త్రివేణి తదితరులు దీనికి తమ రచనలు అందించారు.

సంపాదకవర్గం, ప్రధాన సంపాదకులు, రచయితలు అందరూ మహిళలచే నిర్వహింపబడుతున్న పత్రిక 'బహుళ'. ఇది అంతర్జాల పత్రికే ఐనా, దీనిని అచ్చులో తీసుకువస్తే బాగుంటుందని, ఈ ప్రారంభ సంచికకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని మునికుంట్ల అశోక్‌కుమార్ అందించారు.

ప్రతి పుటలోనూ అచ్చుతప్పులు వున్నాయి. తరువాత వచ్చే సంచికలు – అంతర్జాలమే అయినా అచ్చుతప్పులు లేకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం కనబడ్తోంది. అలాగే, తాము నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా వుండే రచనలను ఎన్నిక చేయడంలో సంపాదకవర్గం తగు జాగ్రత్త వహించాల్సి వుంటుంది.

సావిత్రీబాయి ముఖచిత్రంతో, 1/4 డెమ్మీ సైజులో 106 పుటలు గల ఈ సంచిక వెల : రూ.60/– రాబోయే సంచికలు అంతర్జాలంలోనే వుంటాయి గనుక ఎక్కడా చిరునామా ఇవ్వలేదు.

**విప్లవ మేధో సైనికుడు కామ్రేడ్ జశ్వంతరావు :**

నిబద్ధ మార్క్సిస్టు మేధావి కామ్రేడ్ పోలవరపు జశ్వంతరావు కోవిడ్‌తో 27–8–2020 రాత్రి మరణించారు. కాకినాడలో వైద్య విద్యార్థిగా వామపక్ష రాజకీయాలలో ప్రవేశించి కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి రాజకీయ విధానాలతో విప్లవోద్యమంలో చివరిక్షణం వరకు కృషిచేసిన కార్యకర్త జశ్వంత్. 29–5–1948న గుంటూరులో జన్మించిన ఆయన 50 ఏళ్ళపాటు విప్లవోద్యమానికి అంకితమై, వివిధ బాధ్యతలలో పనిచేసి తన 73వ ఏట అమరులయ్యారు.

ఆయన కృషిని రేఖామాత్రంగానైనా పాఠకులకు అందించే ప్రయత్నంలో భాగంగా సి.పి.ఐ.(ఎం–ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ ఈ పుస్తకాన్ని అక్టోబరు 2020లో ప్రచురించింది. దీనిలో వివిధ వామపక్ష పార్టీలు విడుదల చేసిన సంతాప ప్రకటనలతోపాటు ఆయన వ్యక్తిత్వంలోని వివిధ పార్శ్వాలను తడుముతూ 9 మంది రాసిన వ్యాసాలున్నాయి.

రెండవ భాగంలో జశ్వంత్ వివిధ రాజకీయ సామాజిక సమస్యలపై ఇచ్చిన ప్రసంగపాఠాలు, వ్యాసాలు, జనశక్తిలో వచ్చిన వ్యాసాలు పొందుపరిచారు. సి.పి.ఐ.(ఎం–ఎల్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీలు విప్లవ జోహార్లు తెలుపుతూ వేసిన 6 పుటల కరపత్రంతోపాటు ఆరు కవితలు ప్రచురించారు. చివరి 14 పుటలలో జశ్వంత్ పాల్గొన్న వివిధ సభల ఫొటోలు ఇచ్చారు.

1/8 డెమ్మీలో 176+14 పుటలు. విరాళం : రూ. 100/– ప్రతులకు : మైత్రి బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ – 520002.

**శ్రామికవర్గ విప్లవ నాయకుడు కామ్రేడ్ మధు :**

సి.పి.ఐ.(ఎం–ఎల్) నాయకుడు కామ్రేడ్ మధు 16–4–2021న గుండెపోటుతో విజయవాడలో మరణించారు. సి.పి.ఐ. కాలం నుండి వివిధ బాధ్యతలలో పనిచేస్తూ కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి పార్టీ పంథాకు అంకితమై 2005 నుండి కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఆయన వ్యవహరించారు.

"కామ్రేడ్ మధు అతి, మిత, అవకాశవాదాలపై రాజీలేకుండా సంఘర్షించారు. విప్లవ సంస్థల ఐక్యతాక్రమాల్లో, విప్లవోద్యమంలోని మలుపులన్నింటిలో ముఖ్యపాత్ర వహించారు. పార్టీ పత్రికలను సమర్థవంతంగా నిర్వహించారు. నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో తెలుగు సాహిత్య, సాంస్కృతికోద్యమం కర్తవ్యాలను గతితార్కిక దృష్టితో స్పష్టంగా విశ్లేషించారు." వారికి నివాళిగా సి.పి.ఐ.(ఎం–ఎల్) ఆంధ్రప్రదేశ్ కమిటీ ఈ పుస్తకాన్ని అగస్టు 2021న ప్రచురించింది.

దీనిలో కామ్రేడ్ మధు మరణానికి సంతాపాలు, టి.ఎన్. కానుసన్యాల్, జశ్వంత్‌లకు మధు రాసిన నివాళులు వున్నాయి. రెండవ భాగంలో సిద్ధాంతం, రాజకీయ అంశాలపై మధు వ్రాసిన కొన్ని వ్యాసాలున్నాయి. చివరిభాగంలో ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమ సిద్ధాంత అంశాలపై మధు చేసిన కృషి సమీక్ష వున్నాయి. ఆరు పుటల్లో ఆయన హాజరైన సభల ఛాయాచిత్రాలున్నాయి. ఆయనపై రాసిన రెండు పాటలు, ఒక కవిత ఉన్నాయి.

1/8 డెమ్మీ 192+6 పుటలు. విరాళం : రూ. 100/– ప్రతులకు : మైత్రి బుక్‌హౌస్, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ – 520002.

**పిలకరాయుళ్ళు :** గ్రంథకర్త. గౌరిబోయిన పోలయ్య.

ఇంకొల్లుకు చెందిన పోలయ్య 1950 ఏప్రిల్‌లో ఈ పుస్తకాన్ని రచించారు. 1974లో ద్వితీయ ముద్రణ పొందింది. ఇప్పుడు తృతీయముద్రణ (2021) – చార్వాకాశ్రమం ప్రచురించింది.

ఇది పోలయ్య రాసిన మూడో పుస్తకం. మొదటిది : 'పురాణాల్లో బూతు', రెండోది : 'విమర్శ రామాయణం'. దీనిలో ఆర్య, ద్రావిడ

సంఘర్షణల గురించీ స్మృతులలోని అసంగతాల గురించీ, దేవుడు – దయ్యం గురించీ, జీవుడు – ప్రాణవాయువు గురించి తనదైన శైలిలో పోలయ్య చర్చించారు. దీనికి ముందుమాటను ప్రముఖ నవ్యమానవవాది ఆవుల గోపాలకృష్ణమూర్తి రాస్తూ "విషయాన్ని యింత పెళుసుగా ఎందుకు చెప్పాలని కొందరనవచ్చు. కాని నగిషీలు లేకుండా రచయిత చెప్పారు" అన్నారు. కాని నిజానికి ఈ అంశంపై తర్వాత వచ్చిన గ్రంథాలు పరిశీలిస్తే దీనిలో పెళుసుతనం అంతగా కన్పించదు.

1/8 డెమ్మీలో 26 పుటలు. వెల : రూ.10/- ప్రతులకు : డా॥ కె. అంకయ్య,M.S.(Ortho)., పాలబజారు, ప్రసాదంపాడు, విజయవాడ – 521108.

**చార్వాక కేలండర్ :** చార్వాకాశ్రమ ప్రచురణ.

తాత్త్విక, సామాజిక అంశాలను వివరిస్తూ 1982 నుండి చార్వాక కేలండర్ ప్రచురణ కొనసాగుతోంది. నెలలపేర్లు కపిల, కణాద, భగత్‌సింగ్, కోవూరు, బుద్ధ, అసితకేశ, గోశాలి, వేమన, పెరియార్, పాయసి, శంబూక, అంబేద్కర్‌గా మార్చారు. ప్రతి నెలలోనూ నాస్తిక, హేతువాదులు, భౌతికవాదులు గుర్తుంచుకోవలసిన తేదీలు నెలలవారీగా ఇచ్చారు. ప్రత్యామ్నాయ సెలవుదినాలు కూడా నిర్ణయించారు. ఈ క్యాలెండర్‌లో తిథులు, వర్జ్యాలు, రాహుకాలాలు మొదలైనవి వుండవు. బుధవారాన్ని ఏ మతంవారూ వాడుకోవడంలేదు గనుక దానికి వారంలో మొదటిరోజుగా ప్రాధాన్యం ఇచ్చారు.

ప్రతి ఏడాదీ ఒక శాస్త్రీయమైన అంశంపై చర్చావ్యాసం వుంటుంది. ఈ ఏడాది డా॥ ఆర్.కె. రాసిన 'కులం – పునాదులు' అనే 25 పుటల వ్యాసం కేలండర్‌తోపాటు పుస్తక రూపంలో ముద్రించారు. ఆర్యులు, అనార్యుల తెగలు, చారిత్రక క్రమంలో శ్రమ విభజన – వర్ణ వివక్ష, బౌద్ధం, వైదిక భావజాలం, వర్ణం – కులం, కులభావజాలం, కుల పరిణామం – మధ్యయుగాల్లో, ఆధునిక కాలంలో కులం – వర్ణం, కులం అనే శీర్షికల క్రింద కులం పునాదుల గురించి ఈ వ్యాసం చర్చించింది. ఇటువంటి వైజ్ఞానిక విషయాలతో కూడిన క్యాలెండర్‌ను, ఇతర క్యాలండర్‌లలాగా సంవత్సరం మారగానే పారవేయలేం. దీనిని ఒక పుస్తకంగా మన గ్రంథాలయంలో చేర్చుకుంటాం.

శాస్త్రీయమైన ఆలోచనలను ప్రచారం చేసే ఇటువంటి కేలండర్లను ప్రోత్సహిద్దాం. 1/8 డెమ్మీలో 36 పుటలు. వెల : రూ.30/- ప్రతులకు : చార్వాకాశ్రమం, నిడమర్రు, మంగళగిరి మండలం, గుంటూరుజిల్లా – 522503. ఫోన్ : 92906 19550.

**ఎడమకాలు చెప్పు జారింది :** యథార్థ జీవిత వ్యధల కవితాత్మక కథలు. **రచన – జనజ్వాల.**

వర్తమాన సామాజిక సమస్యలను చిత్రిస్తూ తనదైన శైలిలో జనజ్వాల రాసిన 12 కథల సంపుటి ఇది. వీటిలో 2 కథలు 'ప్రజాసాహితి' ప్రచురించింది. వరవరరావు ముందుమాట రాశారు.

1/8 డెమ్మీలో 56 పుటలు. వెల : రూ.60/- మొదటిముద్రణ : అగస్టు 2015.

**రేపు భూమి ముఖచిత్రం నా పోయెం :** జనజ్వాల కవిత్వం.

జనజ్వాల రాసిన కవితల నుండి ఎంపిక చేసిన 50 కవితల సంపుటి ఇది. అన్నీ వ్యవస్థ మార్పు కోరేవే.

1/8 డెమ్మీలో 12+100 పుటలు. వెల : రూ.100/- మొదటిముద్రణ : మార్చి 2016. పై రెండు పుస్తకాలకు కవి చిరునామా : జనజ్వాల, 15-23 రాయిగడ్డ వీధి, వనపర్తి – 509103. మహబూబ్‌నగర్‌జిల్లా. ఫోన్ : 08545-232620. సెల్ : 99491 63770. email : janajwala1957@gmail.com

**గౌతం – క్రిష్ణ :** నవల. **రచన – షేక్ సురయ.**

ఇది రచయిత్రి తొలినవల. గాంధీవాదాన్ని, గాంధీ ఆశయాలను ఈనాటి సమస్యలకు పరిష్కారంగా చూపే రచన. ఆదర్శవాదంతో నిండిన సాదాసీదా నవల.

1/8 డెమ్మీలో 398 పుటలు. వెల : రూ.250/- మొదటిముద్రణ : జులై 2021. సన వెబ్ టెక్నాలజీస్ గుంటూరువారి ప్రచురణ. చిరునామా : publisher@sanawebtech.com ఫోన్ : 97038 84703.

**నేనూ – ఆ నెమలి :** మరికొన్ని కథలు. **రచయిత : పి. చంద్రశేఖర ఆజాద్.**

ఇది అజాద్ రాసిన 14 కథల సంపుటి. చివర్లో పాఠకులకు ఉపయోగపడే చిన్న వ్యాసం 'కథల్ని నేనెందుకు చదివాను?' చేర్చారు. ఆ వ్యాసంలోనే ఆయన 'కథ ఎప్పుడూ జీవితానికి ప్రతిబింబంగా నిలుస్తుంది' అన్నారు.

'అనంతం' కథల్లో ఆడ పాము అంతరంగాన్ని వినిపించారు. బైబిల్‌లో కథ ప్రకారం మొదటి పురుషుడు, స్త్రీలైన ఆదాము, అవ్వలను ఆకర్షించడానికి సైతాను అందమైన పాము రూపంలో ఈడెన్ గార్డెన్‌లోకి ప్రవేశిస్తాడు. పాముకు విషం లేకపోతే దానితో మనం ఎన్ని ఆటలు ఆడుకునేవారం అన్పిస్తుంది. ఈ ఆడ పాము జ్ఞాపకాలు, మనుషుల పట్ల ఆ పాము అవగాహన ఈ కథలో చూస్తాం. ఇంకా ఈ కథల్లో సినిమా నటిపై వ్యామోహం పెంచుకున్న సినీ నిర్మాతకు పరోక్షంగా బుద్ధి చెప్పిన సుశీల, వారాలు చెప్పుకునే గురవయ్య తనను చేరదీసిన దయామయుడు ఆర్థిక సంక్షోభంలో మునిగినపుడు 10 లక్షల డ్రాఫ్టు పంపడం, గోడలమీద నినాదాలు రాసే వెనుకబడినవర్గపు సత్యం జీవితానుభవాలూ, ఎంత మిత్రత్వం వున్నా రక్త సంబంధీకులకు ఇచ్చే ప్రాముఖ్యత, నడివయసులో వున్న ప్రసాద్ ప్రమాదంలో మరణించడాన్ని, ముసలితనంలో వున్న ఆయన మేనత్త అనసూయమ్మ స్పందనలూ; మార్చురీలో ప్రసాద్ శవం బదులు వేరొకరి శవం ఇవ్వడం; ఈనాటి మీడియాను అపహాస్యం చేసే తిక్కన చేష్టలు, ప్రసిద్ధ సినీపాటల రచయిత అహంభావాన్ని అణచిన ఆయన కూతురు సరస్వతి, దేవుడు చచ్చిపోయాడు అన్న వార్తపై వివిధ దృక్పథాల వారి చర్చలపై వ్యంగ్యం – పంజరంలోని పక్షులు – సమాజమనే పంజరంలోని మానవులు, ఇలా ఎన్నెన్నో పాత్రలు వారివారి విశిష్టతలతో పాఠకులకు ఈ కథల్లో కనబడతాయి.

అన్ని కథల్లో రచయిత జీవితానుభవం కనబడ్తుంది. తనదైన ఒక విశిష్ట కథాశిల్పం అభివృద్ధి చేసిన రచయిత అజాద్.

1/8 డెమ్మీలో 120 పుటలు. వెల : రూ.120/- ప్రథమ ప్రచురణ : డిసెంబరు 2020.

**(ఇంకా వున్నాయి)** ✦

కవిత

# నేరం

- రవి నన్నపనేని

ఎప్పుడో చిన్నప్పుడు తప్ప
ఇప్పుడు ఏ పొలంలోకి వెళ్లకుండానే
ఎలా దొరుకుతుంది అన్నం
ఎట్లా తీరుతుంది ఆకలి

నడుస్తున్న రహదారికి ఇరువైపుల
ఎన్నెన్ని పంటచేలు
ఎన్నెన్ని పండు మిరప కాయలు
ఎంత చెమట ధారపోశారో
ఎంత మంది చాకిరి ప్రతిఫలమో ఇది !

పొట్ట నిండుగా తినడం తెలుసు
తిండిలో పలు రకాల పదార్థాలు తెలుసు
తిండి పుట్టించిన
తిండి సృష్టించిన
ఆ మనిషి గురించి మాట్లాడడం తెలియకపోవడం
తెలిసీ తెలియనట్లుండడం నిజంగా నేరం

ఎక్కడైనా ఏ ఊరైనా
మట్టినమ్ముి బతికే మెట్ట మనుషులంతా
ఒకే రకంగానే ఉన్నారు
ఎదురైన ప్రతి ముఖంలో ప్రతి దేహంలో

పని తాలుకు ఆనవాళ్లు
శ్రమ తాలుకు నకళ్లు

ఉన్న అప్పెంతో
ఉంచుకున్నదెంతో
తడిచినదెంతో తగలబెట్టుకున్నదెంతో
మోసపు మార్కెట్టు - ఊడ్చుకుపోయినదెంతో
ఉసురు తీసిన ఉరితాళ్లు లెక్కెంతో

ఎప్పుడో చిన్నప్పుడు తప్ప
ఇప్పుడు ఏ చేనుగట్టు ఎక్కి, దిగకుండానే
ఎలా జీవిస్తున్నాం
ఎట్లా బతగ్గలుగుతున్నాం

ప్రతి వంటింట్లో ప్రతి పొయ్యి వెలగడం
వెనుక ఉంది అతడే
ఏ దేశానికైనా ప్రథమ పౌరుడు ఆ మనిషే
అతని దుఃఖం, అకాల మరణం లోకానికరిష్టం
ఆ మనిషి మనుగడ, అతని సంతోషం
సమస్త ప్రపంచానికి కడు శ్రేష్టం
అతణ్ణి బతికించుకోవాలి
మనిషనేవాడు ఆ మనిషిని ప్రేమించాలి

కవిత

# పునరావేశం

- పి.ఎస్. నాగరాజు

అక్షరాలకు
చిపురు శాలువాలు కప్పి
శవయాత్రలు చెయ్యకండి!!

పదాలను
అకడమిక్ పిరమిడ్ పురస్కారాలతో
నిర్జీవం చేయకండి!!

కవనకుతూహల
కదనోత్సాహాన్ని
ఏకరీతి విసుగు ముసురుల్లో
నీరుకార్చకండి!!

మట్టిలోంచి
వజ్రగింజ సృజనకు
చెమటమబ్బై
ఎప్పుడూ ఏ సత్కారం ఆశించలేదు!

యంత్రంకోరల్లో తలపెట్టి
వస్తుప్రపంచాన్ని శిల్పించే
కర్మవీరుడు ఏనాడూ
సన్మానాలకు ఆశ పడలేదు!!

మట్టిమనుషులు మశానమైపోతున్న
మాయదారి పాలన ఇది!!!

అక్షరాల్ని కన్నీటికణాలతో
చెకుముకిలాడిద్దాం!

పదాల్ని
జనం గాయాలతో
పదునుపెట్టుకుందాం!!
చెమటచుక్కెవల్ని
కావ్యాల్లో సంకలనంచేద్దాం!!

దగాపడిన బతుకుల్ని కూడదీసి
దారిపొడుగునా కాలాన్ని మండిస్తూ

గతం గతుకులతో
మతంమాయతో
కులంకుట్రతో
భూధనస్వామ్యాలతో
ఆసలుయుద్ధానికి
కలాల్ని గళాల్ని
పరపరాల్ని తరతరాల్ని
దాపిడిపెడుతూ
రాజీలేని
కళాత్మకసాయుధపదాతిదళాలుగా
భావజాల సంఘర్షణలో
నిబద్ధంగా నిమగ్నమౌదాం!!

PRAJA SAAHITI April 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 44 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

కవిత

# రాంపుర్హాత్

ఆంగ్లమూలం : మౌమితా ఆలం
తెలుగు అనువాదం : కొత్తపల్లి రవిబాబు

**నగరాన్ని** చుట్టుముట్టింది కాలిన మానవశవాల కంపు
అందరూ పీలుస్తున్నారాదుర్వాసన
పిల్లలు, గర్భిణీల, నూతన దంపతుల
కాలిన మాంసపుకంపు అది.
ఇప్పుడు తెలుసుకున్నాం -
అగ్నికి వివక్ష లేదని,
అది అందర్నీ దహిస్తుంది -
ముసలీ, ముతకా, అందర్నీ
ఒకేరకంగా...

నాగరికుల ఆవాసమైన
కోల్‌కటాలోని ఒక ఆడిటోరియంలో
ప్రసిద్ధ కవి శిఖామణులందరూ
తమ కవితలనాలపిస్తున్నారు
ఎంతో ఆనందంగా
వసంతకాలాన్ని ఆహ్వానిస్తూ -

కోల్‌కటా - రాంపుర్హాత్
రెండు వాసనల రెండు ప్రాంతాలు
కోల్‌కటాలోని కబాబు లేత కోడిపిల్లలది కాగా,
రాంపుర్హాత్‌లో మానవుల మాడిన ఎముకలు
వాటికంటే చౌక.

అందరూ కవితలు వినిపిస్తున్నారు!
ప్రేమపైనా, వసంతంపైనా, తన్మయత్వంపైనా!

(పశ్చిమబెంగాల్‌లోని రాంపుర్హాట్ డివిజన్లోని బొగ్టుయ్ గ్రామంలో రాజకీయ కక్షలతో పిల్లలు, స్త్రీలతోసహా 8 మందిని మార్చి 21న సజీవ దహనం చేశారు. పశ్చిమబెంగాల్‌లో గత 10-15 రోజుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒకవైపు నరమేధం జరుగుతుంటే, ప్రముఖ కవులు, రచయితలు కవితోత్సవాల నిర్వహణలో మునిగి వున్నారు.

అణచివేతకు గురౌతున్నవారికి గొంతునిచ్చి, పోరాడవలసిన కవులు, రచయితలు, మేధావులు ఈ భయంకర నరమేధంపట్ల మౌనం వహించటాన్ని నిరసిస్తూ నా ఈ కవిత - ఆలం.)

మౌమితా ఆలం పశ్చిమబెంగాల్‌కు చెందిన కవయిత్రి.

'కౌంటర్ కరెంట్స్' వెబ్‌లో 27-3-2022న ఈ కవితను పోస్టు చేశారు. ✤

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI